అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

హన్మకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇంట్లో ఎసిబి సోదాలు
రూ.8 కోట్ల ఆస్తుల గుర్తింపు
రూ.30 లక్షలు స్వాధీనం
03

సంపుటి 28, సంచిక: 210 | గురువారం | 22-01-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


సిపిఐ శతాబ్ది ఉత్సవాల వేడుకలు ముగింపు సందర్భంగా బెలూన్లు వదిలిన సిపిఐ నేతలు



# దేశ పరిస్థితుల దృష్ట్యా ఐక్య పోరాటం చేయాలి

● బిజెపి ఓటమే లక్ష్యంగా అన్ని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకమవ్వాలి ● పలు రాష్ట్రాల్లో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ పార్టీకి వ్యతిరేకంగా బలమైన పోరాటాలు చేస్తాం ● ఫిబ్రవరి 12న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన జాతీయ స్థాయి సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ● సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రకటన ● సిపిఐ జాతీయ సమితి సమావేశ నిర్ణయాలు మీడియాకు వెల్లడి

**ఖమ్మం:** రాబోయే శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే లక్ష్యంగా అన్ని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని, దేశ పరిస్థితులను అర్థం చేసుకొని ఐక్య పోరాటం చేయాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విజ్ఞప్తి చేశారు. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరి వంటి రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా బలమైన పోరాటం చేస్తామని ప్రకటించారు. కేంద్ర కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న తలపెట్టిన జాతీయస్థాయి సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతును ఆయన ప్రకటించారు. మద్దతుతో సరిపెట్టకుండా సిపిఐ సమ్మెలో క్రియాశీల పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఖమ్మంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల జాతీయ స్థాయి ముగింపు సభ, మూడు రోజుల పాటు జాతీయ సమితి సమావేశాలు బుధవారం నాడు ముగిశాయి. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రామకృష్ణ పండా, కె .రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, తరువాయి 12లో


లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన డి.రాజా తదితరులు

## కమ్యూనిస్టుల ఐక్యతకు ఖమ్మం సభ
# కొత్త ఆక్సిజన్

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

భారత కమ్యూనిస్ట్ పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో నిర్వహించిన బహిరంగ సభ పార్టీ శ్రేణుల్లో మునుపెన్నడూ లేని ఉత్సాహాన్ని నింపిందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సభ పార్టీ భవిష్యత్తుకు ఒక 'ఆక్సిజన్' లాగా పని చేస్తుందని అన్నారు. తెలంగాణలోని ఆదిలాబాద్ నుండి గద్వాల వరకు, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు మారుమూల ప్రాంతాల నుండి కూడా ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చారని ఆయన తెలిపారు. చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఈ శతాబ్ది తరువాయి 12లో


## గాజా 'శాంతి మండలి'లో చేరాలన్న...
# అమెరికా ఆహ్వానాన్ని అంగీకరించొద్దు

భారత ప్రభుత్వానికి సిపిఐ సహా ఐదు వామపక్ష పార్టీలు విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** గాజా శాంతి ప్రణాళిక అమలు కోసం ఉద్దేశించిన శాంతి మండలి (పీస్ ఆఫ్ బోర్డ్)లో చేరాలన్న అమెరికా ఆహ్వానాన్ని అంగీకరించవద్దని ఐదు వామపక్ష పార్టీలు భారత ప్రభుత్వానికి ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశాయి. అంగీకారం తెలపడం అంటే పాలస్తీనా లక్ష్యానికి 'ఘోరమైన ద్రోహం చేయడమే అవుతుందని' వామపక్షపార్టీలు హితవు పలికాయి. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ), భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఎంఎల్) లిబరేషన్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి), రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌ఎస్‌పి) లు సంయుక్తంగా బుధవారం నాడు ఇక్కడ ఒక ప్రకటన విడుదల చేశాయి. బోర్డ్ ఉద్దేశపూర్వకంగా ఐక్యరాజ్య సమితిని దాటవేస్తోందని, అమెరికా నియంత్రణలో కొత్త అంతర్జాతీయ నిర్మాణాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని వామపక్ష పార్టీలు ఆరోపించాయి. 'గాజా శాంతి ప్రణాళిక అమలు కోసం ఉద్దేశించిన 'శాంతి మండలి' తరువాయి 12లో

## రూ.12,500 కోట్లతో
# స్టీల్ ఉత్పత్తి యూనిట్

● తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన రష్మి గ్రూప్ ● రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఒయు ● 12 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు ● 6వేల కోట్లతో రియాక్టర్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్ సంస్థ సిద్ధం



ప్రజాపక్షం/హైదరాబాద్

డక్టైల్ ఐరన్ (డిఐ) పైపుల తయారీలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రష్మి గ్రూప్ తెలంగాణలో స్టీల్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్)2026 సదస్సులో భాగంగా దావోస్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం రష్మి గ్రూప్‌తో రూ.12,500 కోట్ల పెట్టుబడికి అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 12 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఈ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చిన రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సిఎం రేవంత్ రెడ్డి అభినందించారు. తెలంగాణ విభిన్న పరిశ్రమలతో బలమైన పారిశ్రామిక వ్యవస్థగా ఎదుగుతోందని, ముఖ్యంగా తయారీ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన అన్ని సహాయాలు, బొగ్గు సరఫరా లింకేజీలు సహా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రష్మి గ్రూప్ ప్రమోటర్ సజ్జన్ కుమార్ పట్వారి, డైరెక్టర్ తరువాయి 2లో

### ప్రతి జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలోఅప్ సదస్సు

ప్రతి ఏడాది జులై లో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఇఎఫ్) ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన 'జాయిన్ ది రైజ్ కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ రోజుల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక ఏడాది చాలా ఎక్కువ సమయమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే ప్రతి ఏడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో ఫాలోఅప్ ఫోరం నిర్వహించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధులకు సూచించారు. హైదరాబాద్‌లో తరువాయి 2లో

## ప్రపంచ మార్కెట్‌లో
# అమెరికా కలకలం



**ముంబయి :** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అస్థిరత, స్టాక్ మార్కెట్ల పతనంలో స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ పడిపోవడం, బాండ్ మార్కెట్లలో భారీ ఊగిసలాట, డాలర్ బలహీనత, బంగారం ధరలు చరిత్రాత్మక గరిష్ఠాలకు చేరుకోవడం తదితర అంశాలన్నీ ఒకే దిశలో సూచిస్తున్నాయి. పెట్టుబడిదారులు ప్రస్తుతం తీవ్ర అనిశ్చితి, భయం, జాగ్రత్తల మధ్య నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితులకు ప్రధాన కారణం ఆర్థిక అంశాల కంటే ఎక్కువగా రాజకీయ పరిణామాలే కావడం గమనార్హం. రాయిటర్స్ కథనం ప్రకారం, ముఖ్యంగా అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ దూకుడు వైఖరితో మాట్లాడటం, యూరప్‌పై టారిఫ్‌ల బెదిరింపులు, గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటామన్న వ్యాఖ్యలు తదితర అంశాలు అంతర్జాతీయ మార్కెట్లలో నమ్మకాలను చెరిపివేస్తున్నది. గత ఏడాది ఏప్రిల్‌లో ట్రంప్ చేసిన లిబరేషన్ డే టారిఫ్ ప్రకటనల తర్వాత, ప్రపంచ పెట్టుబడిదారులు అమెరికా స్టాక్స్, బాండ్లు, డాలర్ వంటి ఆస్తుల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవాలంటూ మొదలైన 'సెల్ అమెరికా' అనే భావన ఇప్పుడు మరింత బలపడుతోంది. ఇటీవల అమెరికా స్టాక్ మార్కెట్‌లో భారీ పతనం నమోదైంది. వాల్ స్ట్రీట్ ఒక్క రోజులోనే 2 శాతం కంటే ఎక్కువగా పడిపోయింది. ఎస్ అండ్ పి 500 సూచీ సుమారు 2 శాతం తగ్గగా, టెక్నాలజీ ఆధారిత నాస్డాక్ సూచీ దాదాపు 2.4 శాతం తరువాయి 2లో

### రికార్డు స్థాయిలో రూపాయి పతనం



దేశీయ కరెన్సీ (ఫోరెక్స్) మార్కెట్‌లో రూపాయి బుధవారం భారీ ఒత్తిడిని ఎదుర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లలో జాగ్రత్త భావన కొనసాగడం, విదేశీ పెట్టుబడిదారులు నిరంతరంగా నిధులు ఉపసంహరించుకోవడం వల్ల అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయిలో పడిపోయింది. అంతర్జాతీయ లావాదేవీల సమయంలో రూపాయి ఒక్కరోజులో 61 పైసలు క్షీణించి, డాలర్‌కు రూ. 91.50గా స్థిరపడింది. ఇప్పటి వరకూ నమోదైన చరిత్రలో అదే అత్యల్ప స్థాయి. విదేశీ మారక మార్కెట్ వ్యాపారుల ప్రకారం, గ్రీన్‌ల్యాండ్ అంశంపై యూరప్‌తో నెలకొన్న ఉద్రిక్తతలు, అలాగే అమెరికా విధించవచ్చని భావిస్తున్న సుంకాల భయాలు తరువాయి 2లో

### పసిడి, వెండి ధరలు పరుగో పరుగు




పది గ్రాముల బంగారం రూ.1.61లక్షలు, కిలో వెండి రూ.3.30లక్షలు

బంగారం, వెండి ధరల పరుగు ఆగడం లేదు. బుధవారం చరిత్రలోనే ఎన్నడూ లేని గరిష్ఠ స్థాయిలను ధరలు తాకాయి. అమెరికా డాలర్ బలహీనత, గ్రీన్‌లాండ్ సంక్షోభం చుట్టూ పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, జపాన్ ప్రభుత్వ బాండ్ల మార్కెట్‌లో ఏర్పడిన సంక్షోభం నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గుచూపడంతో లోహాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే లక్షన్నర దాటిన 24 క్యారెట్ల బంగారం తరువాయి 2లో

## గ్రీన్‌లాండ్ స్వాధీనానికి
# తక్షణం చర్చలు

● దావోస్ వేదికపై ట్రంప్ ప్రతిపాదన ● బలమైన అమెరికా అంటే 'సురక్షితమైన నాటో' అని వ్యాఖ్య




**దావోస్:** యూరప్ గమనం,ఆలోచనావిధానం సక్రమంగా లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్)పై ఆయన ప్రసంగిస్తూ, యూరప్ సరైన మార్గంలో ప్రయాణించడంలేదని, వారు వలసలను నియంత్రించలేకపోయారని విమర్శించారు. గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకోవడానికి తక్షణం సంప్రదింపులు కోరుతున్నామని చెప్పారు. ''బలప్రయోగం చేయాలని నిర్ణయించుకుంటే తప్ప మనకు ఏదీ లభించదు, మనం దేన్నీ పోకుండా ఆపలేం, నిర్మొహమాటంగా చెప్పాలంటే మమ్మల్ని ఎవ్వరూ ఆపలేరు, కానీ నేను అలా చేయదల్చుకోలేదు, తక్షణం సంప్రదింపులు కోరుతున్నా'' అని చెప్పారు. ''నేను బలప్రయోగం చేయాల్సిన అవసరం లేదు, బలాన్ని ఉపయోగించాలనుకోవడం లేదు, అలా చేయను'' అన్నారు. ''గ్రీన్‌లాండ్ ఒక భారీ మంచు ముక్క, ప్రపంచాన్ని రక్షించడంకోసమే అది కావాలని అమెరికా కోరుకుంటోంది'' అని చెప్పారు. గ్రీన్‌లాండ్‌పై మాకు పూర్తి హక్కులు కావాలి, తరువాయి 12లో



## ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ పనులకు
# ప్రత్యేక విభాగం

● మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటన ● పాలమూరు – రంగారెడ్డితో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిపై బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో నీటిపారుదల అధికారులతో ఆయన తరువాయి 2లో

## అభివృద్ధి అంటే...
# భవన నిర్మాణాలు కాదు

ప్రజల జీవితాలలో మార్పు రావడమే

సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క




ప్రజాపక్షం/ధర్మపురి

తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అభివృద్ధి అంటే భవన నిర్మాణాలే కాదు ప్రజల జీవితాలలో మార్పు రావడమే అసలైన అభివృద్ధి అని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తూ పారదర్శకత, నిబద్ధత, సంకల్పంతో ముందుకు వెళ్తున్నదని భట్టి చెప్పారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మండలంలోని నేరేళ్ల వద్ద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన సముదాయం నిర్మాణానికి రూ.200 కోట్లు,ధర్మపురిలో డిగ్రీ కళాశాల భవనానికి రూ.10 కోట్లు,ఎస్టీపి ప్లాంటు నిర్మాణానికి రూ.24.5 కోట్లు,మున్సిపల్ పరిధిలో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాలకు రూ.15 కోట్లు,విద్యుత్తు లైన్ల మార్పుకోసం తరువాయి 12లో

## జపాన్ మాజీ ప్రధాని షింజో అబే హంతకుడికి యావజ్జీవ శిక్ష



**టోక్యో:** జపాన్ మాజీ ప్రధానమంత్రి షింజో అబే (68) హత్య కేసులో దోషికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. ఆయన హత్య కు గురైన మూడున్నర సంవత్సరాల తర్వాత ఈ కేసులో తీర్పు వెలువడింది. జపాన్ ఎగువసభకు ఎన్నికల సందర్భంగా నారా రాష్ట్రంలో ప్రచారకార్యక్రమంలో ఉండగా 2022 జులై ఎనిమిదో తేదీన షింజో అబే హత్యకు గురయ్యారు. ఈ హత్య జపాన్ ప్రజలకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. ఆ దేశంలో సుదీర్ఘకాలం (తొమ్మిది సంవత్సరాలు) ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వహించింది షింజో అబే ఒక్కరే. నారాలో స్థానిక నివాసితుడైన హంతకుడు టెట్సుయా యమ గామి (45) నిరుద్యోగి. నాడు ప్రధానమంత్రిని హత్య చేసిన తర్వాత ఘట నాస్థలం వద్దనే యమ గామిని పోలీసులు అరెస్టు చేశారు. కానీ 2025 అక్టో బరు 28న యమగామి కేసుపై కోర్టులో విచారణ ప్రారంభమై మూడు నెలల్లో నే ఆ ప్రక్రియను పూర్తిచేసి న్యాయస్థానం బుధవారం తీర్పు ప్రకటిం చింది.

## లండన్‌లో చైనా మెగా దౌత్య భవనం

లండన్ : లండన్‌లో చైనా దౌత్యకార్యాలయం ఏర్పాటు చేసేందుకు బ్రిటన్ ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదముద్ర వేసింది. బ్రిటన్ జాతీయ భద్రత రీత్యా దేశంలో ఈ దౌత్యకార్యాలయం ఏర్పాటు చేయాలా? వద్దా? అనే విష యంపై అనేక సంవత్సరాలుగా చర్చ జరుగుతోంది. చివరకు దానికి ఆమో దముద్ర పడింది. లండన్ టవర్ సమీపంలో 20,000 చదరపు మీటర్ల విస్తీ ర్ణంలో రాయల్ మింట్ కోర్టు స్థలంలో అత్యంత భారీస్థాయిలో చైనా దౌత్య కార్యాలయ భవనాలు ఏర్పాటు చేసేందుకు బ్రిటన్ ప్రభుత్వం అంగీకరిం చింది. బ్రిటన్ పార్లమెంటు కార్యదర్శి స్టీవ్‌రీడ్ మంగళవారం ఈ విషయం ప్రకటించారు. రాయల్ మింట్ కోర్టు స్థలాన్ని సొంతం చేసుకోవడానికి చైనా ప్రభుత్వం 255 మిలియన్ పౌండ్లు చెల్లించింది. 2018లో ప్రారంభ మైన ఈ ప్రక్రియ ఈ వారంలో పూర్తి కానున్నది.

## రూపాయి పతనం

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడిదారుల్లో అప్రమత్తతను పెంచాయి. ఈ భౌగోళిక రాజకీయ పరి ణామాలు ప్రపంచ పెట్టుబడి ప్రవాహాలపై ప్రతికూల ప్రభావం చూపుతు న్నాయి. ఫలితంగా అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలపై, ముఖ్యంగా రూపాయిపై, అమ్మకాల ఒత్తిడి పెరిగింది. దేశీయ స్టాక్ మార్కెట్లలో కనిపిం చిన బలహీన ధోరణి కూడా రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపింది. ఈక్విటీ మార్కెట్లు నష్టాల బాటలో సాగడంతో పెట్టుబడిదారుల విశ్వాసం మరింత దెబ్బతింది. ఇంటర్–బ్యాంక్ విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి రూ. 91.05 వద్ద ప్రారంభమై, క్రమంగా విలువ కోల్పోయి డాలర్‌కు రూ. 91.58 చారిత్రాత్మక కనిష్ఠాన్ని తాకింది. ఇది గత ముగింపు స్థాయితో పోలిస్తే అరవై ఒక పైసల పతనం. చివరిలో అత్యంత స్వల్పమైన మార్పు చోటు చేసుకోవడంతో రూ. 0.08 మేర మెరుగుపడింది.

## వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలోఅప్ సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైం దని, రూ.5.75 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించిందని సిఎం వివరించారు. మూసీ నది పునరుజ్జీవనంతో పాటు రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేసి నైట్ టైమ్ ఎకానమీపై దృష్టి పెడుతామని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను ప్రదర్శించారు. ఇదే వేదికపై తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్ (టిఎఐహెచ్), తెలంగాణ నెక్స్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026–2030ను ఆవిష్కరించారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్‌లో మెట్రో రైలు విస్త రణ, చెరువులు కుంటల పునరుజ్జీవనం వంటి గేమ్‌చేంజర్ ప్రాజెక్టులను వివరించారు. ప్రముఖ నటుడు చిరంజీవి ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచారు.

## ప్రత్యేక విభాగం (మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా,సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్‌లతో పాటు ఇఎ న్‌సిలు,చీఫ్ ఇంజినీర్లు,ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనులను కొనసాగించడా నికి గాను ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రమాద వశాత్తు జరిగిన ఘటనలో టన్నెల్ లో చిక్కుకున్న టన్నెల్ బోరింగ్ మెషీన్ శకలాలను పూర్తిగా తొలగించామని, ప్రస్తుతం టన్నెల్ లో రైలు ట్రాక్ సహా యంతో మరమ్మతులు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.ప్రాజె క్టుల పనులలో నిబంధనలు పాటిస్తూనే నాణ్యతాప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అధికారులకు ఉపదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తికి సరిపడా నిధుల కేటాయింపును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీక రించారని, యుద్ధప్రాతి పదికన పనుల పూర్తికి అధికారులు చొరవ తీసుకో వాలని ఆయన సూచించారు.నిర్మాణాల విషయంలో అధికారులు బాధ్యా తాయుత్తంగా ప్రవర్తించాలని, అలక్ష్యం ప్రదర్శిస్తే ప్రభుత్వం ఏ మాత్రం ఉపేక్షించ బోదని ఆయన స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టి వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు నిర్మించ తల పెట్టిన బ్యారేజ్ కు సంబంధించిన డి.పి.ఆర్ తయారీ కోసం పూర్తి స్థాయిలో సర్వేలు,పరిశోధనలు వేగవం తంగా కొనసాగుతున్నాయన్నారు. బ్యారేజ్ ప్రాంతంలో అవసరమైన 73 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో టోపోగ్రాఫికల్ సర్వే పూర్తిఅయిందని, దానితో పాటు 85 కిలోమీటర్ల కాలువ సర్వేను కుడా పూర్తి చేశామన్నారు. అదనంగా వార్ధ, వైన్‌గంగా నదులకు ఇరువైపులా క్రాస్‌సెక్షన్ లెవల్స్ సర్వే పూర్తి అయినందున డి.పి.ఆర్‌లకు తుదిరూపం ఇచ్చేందుకు కసరత్తు వే గంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.అదేవిధంగా నీ టిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి గాను పర్యావరణ అనుమతులు పొం దేందుకు మరింత ఒత్తిడిని పెంచాలన్నారు. పర్యావరణ అనుమతులకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన ఆదేశాలను ఆయన ఈ సంద ర్భంగా ఉటంకించారు. ఇదే విషయాన్ని కేంద్ర జలశక్తి మంత్రి దృష్టికి ఇప్ప టికే ఇసుకొచ్చామని, ముఖ్యమంత్రితో చర్చించిన మీదట ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. అన్నింటికీ మించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులలో మట్టి, ఇసుక మేటలతో పుడుకు పోయాయని దానితో నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి ప్రాజెక్టులలో పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టిందని ఆయన చెప్పారు.

**కాళేశ్వరం బ్యారేజ్‌ల పునరుద్ధరణ డిజైన్లను నెల లోపు రూపొందించాలి**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన బ్యారేజ్ లకు సంబంధించిన పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ మెడిగడ్డ, అన్నారం,సుందిళ్ళ బ్యారేజ్ లపై సైట్ తనిఖీ నివేదికతో పాటు పనులకు సంబందించిన ప్రణా ళికాలు సమర్పించిందని ఆయన వివరించారు. బుధవారం రోజున మెడి గడ్డ బ్యారేజ్ వద్ద ముగ్గురు సభ్యులతో కూడిన బృందం అధ్యయనం ప్రారం భించగా మరో ఇద్దరు సభ్యులు బోర్ హోల్ ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు మంత్రితెలిపారు. అన్నారం,సుందిళ్ళ బ్యారేజ్ ల వద్ద పరిశీలన పనులు ఈ నెల 22 న ప్రారంభం కానున్నాయని ఆయన తెలిపారు.ఈ మూడు బ్యారేజ్ ల పునరుద్ధరణ డిజైన్లు నెల వ్యవధిలో రూపొందించాలని ఆయన అధికారులకు చెప్పారు.

# ట్రాన్స్ అట్లాంటిక్ దేశాల రణరంగ వేదికగా దావోస్

### ట్రంప్‌ను పొగిడే కాలం ముగిసింది : రాస్ముస్సేన్

**దావోస్ :** స్విట్జర్లాండ్ దావోస్ నగరం సంప్రదాయబ ద్ధంగా ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలు, చర్చలకు కేంద్రంగా ఉంటూ వస్తున్నప్పటికీ, ఈసారి మాత్రం ఆ చర్చల సారాంశానికి ప్రాధాన్యత తగ్గిపోయింది. గ్రీన్ లాండ్‌పై చిచ్చు రేగడంతో అమెరికా–యూరప్ నాయ కులు దావోస్ వేదిక మీదకు వచ్చి బాహాబాహీగా వాణి జ్య యుద్ధానికి తలపడుతున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోందర్ లేయన్, అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెం ట్‌లు ఇప్పటికే దావోస్ వేదికను వేడెక్కించారు. వారి అభి ప్రాయాల మార్పిడికి, పంచాయతీలకు డబ్ల్యుఎఫ్ వేది కగా మారింది. ఇదే వేదికపై యూరప్‌తో చర్చించి ప్రక టనలు చేసేందుకు బుధవారం దావోస్ బయలుదేరిన డోనాల్డ్ ట్రంప్ విమానంలో స్వల్ప ఎలక్ట్రికల్ లోపం ఏర్పడంతో ఆయన రాకలో జాప్యం జరిగింది. గ్రీన్‌లాం డ్‌పై తన వైఖరిని యూరప్ దేశాలకు దావోస్ వేదికపైనే వెల్లడిస్తానని, అక్కడే వారితో చర్చలు జరుపుతానని ట్రంప్ ముందుగానే ప్రకటించారు. ఇప్పటికే పలువురు యూరప్ నేతలు దావోస్ వేదికగా ట్రంప్‌తో భిన్నాభిప్రా యాలు ప్రకటించడంతో గ్రీన్‌లాండ్, నాటో కూటమి అంశాలే ప్రధానంగా తెరమీదకు వచ్చి ఉద్రిక్తతలు పెరి గాయి.ట్రంప్ ప్రకటనలతో అమెరికా,యూరప్‌లలో స్టాక్‌మార్కెట్లు కూడా నష్టాల్లో నడుస్తున్నాయి. యూరప్ నాయకులతో దావోస్‌లో మాట్లాడతానని ట్రంప్ చెప్పిన సమయంలోనే అమెరికా–యూరప్ మధ్య గత ఏడాది జులైలో కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు స్ట్రాస్‌బర్గ్ నుండి బుధవారం మధ్యాహ్నం అధికారిక ప్రక



టన వెలువడేందుకు రంగం సిద్ధమైంది. అమెరికా–యూరప్ మధ్య జులై వాణిజ్య ఒప్పందం రద్దయితే ఫిబ్ర వరి ఎనిమిదో తేదీ నుండి యూరప్ ప్రతీకార సుంకాలు అమలులోకి వస్తాయి. ఐతే తొందరపడి నిర్ణయం తీసుకో వద్దని, గడచిన 150 సంవత్సరాలుగా అమెరికా అధ్య క్షులు బుర్రల్లో గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునే విష యం నలుగుతూనే ఉందని, ప్రపంచ భద్రతకు గ్రీన్ లాండ్ అమెరికా గుప్పెట్లో ఉండాలని స్కాట్ బెస్సెంట్ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉండగా, దావో స్‌లో ట్రంప్‌కు రెడ్‌కార్పెట్ పరచి ఘన స్వాగతం పలికేం దుకు నిర్వాహకులు సిద్ధంగా ఉన్నప్పటికీ, నిరసన ప్రద ర్శకులు కూడా ఆయనకోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఎదురుచూపులమధ్య నాటో కూటమి మాజీ కార్యదర్శి జనరల్ ఆండ్రస్ ఫాగ్ రాస్ముస్మేన్ స్పందిస్తూ, డోనాల్డ్ ట్రంప్‌కు స్వాగత సత్కారాలు చేసి ప్రశంసించే కాలం ముగిసిపోయిందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే యూర ప్ ట్రంప్ నుండీ దూరంగా జరుగుతోందని, ఇకమీదట ఇంకా ధృఢంగా స్పందించే పరిస్థితులు రావొచ్చునని అన్నారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటానని ట్రంప్ బెదిరింపులు కొనసాగిస్తే ఇక నాటో మనుగడ సాగించబోదని ఆయన హెచ్చరించారు.

# ఎనిమిది యుద్ధాలు ఆపి కోట్లాది ప్రజల ప్రాణాలు కాపాడా

### ఆపిన ప్రతియుద్ధానికీ ఒక్కో నోబెల్ రావాలి : ట్రంప్

**న్యూయార్క్/వాషింగ్టన్ :** భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య అణు యుద్ధం రాకుండా ఆపానని, ఎనిమిది యుద్ధాలు నివారించి కోట్లమంది ప్రజల ప్రాణాలు పోకుండా తాను కాపాడానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చెప్పారు. రెండోసారి అమెరికా అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పాలన పూర్తిచేసిన సందర్భంగా ట్రంప్ పత్రికాగోష్ఠి నిర్వహించారు. గత ఏడాది మే 10వ తేదీ నుండీ ఇప్పటివరకూ ట్రంప్ 90 సార్లు భారత్–పాకిస్థాన్ యుద్ధం గురించి మాట్లాడారు. ఆపిన ప్రతి యుద్ధానికీ నాకో నోబెల్ బహుమతి రావా లని, కానీ తాను అలా కోరుకోవడంలేదని, కోట్లాదిమంది ప్రజల ప్రాణాలు తాను కాపాడా నని అన్నారు. యుద్ధం ఆపినందుకు సంబంధిత దేశ నాయకులు నోబెల్ ఇవ్వాలని తనకోసం బలమైన సిఫార్సులు పంపారని అన్నారు. నార్వే నోబెల్ కమిటీపైన, నార్వే ప్రభుత్వంపైనా ఆయన విమర్శలు గుప్పించారు. నార్వే ప్రభుత్వం నోబెల్ బహుమతిని నియంత్రిస్తుం దని తాను చాలా బలంగా నమ్మానన్నారు. కానీ నోబెల్ కోసం తాను ఇదంతా చేయలేదని చివ రకు చెప్పారు. తనకు నోబెల్ (2025)ను అంకితం చేసిన వెనిజులా ప్రతిపక్ష నాయకు రాలు మచాడోను ప్రశంసించారు.బుధవారం ఆయన పాత్రికేయులతో సుదీర్ఘంగా 105 నిమి షాలు మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రంప్ సాధించిన 2.0 పాలనా విజయాల చిట్టాను వైట్‌హౌస్ ప్రకటించింది. ''365 రోజుల్లో 365 విజయాలు'' అనేక శీర్షికతో ఈ సుదీర్ఘమైన చిట్టాను వైట్‌హౌస్ విడుదల చేసింది. ప్రపంచ వేదికపై అమెరికా నాయకత్వాన్ని పునరుద్ఘాటిం చిందని తెలిపింది. ట్రంప్ పాలన తిరిగి రావ డంతో విజయాలు,పురోగతిలో కొత్త శకం అని ప్రకటన పేర్కొంది. వచ్చిన 10 నెలల కాలంలో తాను ప్రపంచంలో ఎనిమిది యుద్ధాలను అడ్డు కున్నానని, వాటిని ముగించి ఒప్పందాలకు దారి ఏర్పాటు చేశానన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలు ఆపడం ద్వారా మిలియన్ల మంది ప్రజల ప్రాణాలు తాను కాపాడాన న్నారు. కాంబోడియా–థాయ్‌లాండ్ మధ్య అనేక సంవత్సరాలుగా పలుసార్లు యుద్ధం జరి గిందని, కోసావో–సెర్బియా, కాంగో–రు వాండా, పాకిస్థాన్–భారత్ మధ్య యుద్ధాలు జరిగేవేనని, వాటిని ఆపానని అన్నారు. భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధంలో ఎనిమిది విమా నాలు నేలకూలిపోయాయన్నారు. ఆ రెండు దేశాలు నా ఉద్దేశం ప్రకారం అణు యుద్ధానికి పాల్పడేవన్నారు. ''మీరు ఊరికే అంకెలు జోడిం చండి, ఏ యుద్ధాన్నైనా తీసుకోండి, మీరు లక్షల మంది ప్రజల గురించి మాట్లాడుతున్నారు, ఆ సంఖ్యను రెట్టింపు చేసుకోండి, ఉదాహరణకు భారత్–పాకిస్థాన్ దేశాలనే తీసుకోండి, ఆ దేశా లలో యుద్ధాలవల్ల రెండుకోట్లమంది ప్రజలు ఈ బారిన పడే అవకాశం ఉంటుంది, ఇంకా ఎక్కువే ఉండవచ్చు కూడా, అందువల్ల నేను కోట్లాదిమంది ప్రజల ప్రాణాలు కాపాడాను'' అన్నారు.వైట్‌హౌస్ విడుదల చేసిన ప్రకటనలో, ట్రంప్ పాలన తిరిగి రావడంతో అమెరికా సరి హద్దులను రక్షించారని, అమెరికా తన బలంతో పునర్నిర్మాణం జరుగుతోందని, అమెరికా ప్రజ లను అగ్రస్థానంలో నిలబెడుతున్నారని పేర్కొం ది. ట్రంప్ నిజమైన పరివర్తన ఫలితాలు సాధిం చారని పేర్కొంది. ఆధునిక అధ్యక్ష పదవీ చరి త్రలో ట్రంప్ అనేక విజయాలు సాధించి లక్ష్యా లు పూర్తిచేశారని పేర్కొంది. గడచిన యాభై సంవత్సరాలలో మొదటిసారి వలసలు ఆగిపో యాయని తెలిపింది. రికార్డుస్థాయిలో ఈ వల సలు రద్దయ్యాయని పేర్కొంది. ట్రిలియన్ డాల ర్ల పెట్టుబడులుగా వచ్చాయని, కోశాగారానికి అదనపు సంపద సమకూరిందని తెలిపింది. అనేక యుద్ధాలు ఆపడం ద్వారా శాంతి ఒప్పం దాలను యంత్రాంగం చేసిందని తెలిపింది.

## మార్చి 5న నేపాల్ సార్వత్రిక ఎన్నికలు నలుగురు మాజీ ప్రధానుల మధ్య పోటీ

**ఖాట్మండు:** గత ఏడాది జనరేషన్ జెడ్ హింసాత్మక నిరసన ఉద్యమం తర్వాత ఈ ఏడాది మార్చి 5వ తేదీన నేపాల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో నలుగురు మాజీ ప్రధానమంత్రులు అధికారంకోసం నువ్వా? నేనా? అనే రీతిలో పోటీకి దిగారు. కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్–లెనినిస్ట్) ఛైర్మన్, పదవీచ్యుతుడైన ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి (74) ఝాపా–5 నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నారు. ఖాట్మండు మేయర్ బలేంద్ర షా ఈసారి ఇదే నియోజకవర్గం నుండి పోటీకి దిగడంతో ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. వాస్తవానికి ఈ నియోజకవర్గం అనేక సంవత్సరాలుగా కె.పి.శర్మ ఓలికి కంచుకోటగా ఉంది. 2022లో ఓలి ఇదే నియోజకవర్గం నుండి భారీ మెజారిటీతో దిగువసభకు ఎన్నికయ్యారు. కాగా మాజీ ప్రధానమంత్రి పుష్పకమల్ దహల్ (ప్రచండ) (71 )కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు సెంటర్) అభ్యర్థిగా రుకుమ్ ఈస్ట్ నియోజకవర్గం నుండి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. మరో ఇద్దరు మాజీ ప్రధానమం త్రులు మాధవ్ కుమార్ నేపాల్ (నేపాలీ కమ్యూనిస్టుపార్టీ), బాబూరామ్ భట్టా రాయ్ (ప్రగతిశీల్ లోక్‌తంత్ర పార్టీ) కూడా వరుగా రౌతాహత్–1, గోర్ఖా–2 నియోజకవర్గాల నుండి పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేశారు. కాగా మరో ఇద్దరు మాజీ ప్రధానమంత్రులు మాత్రం ఈసారి ఎన్నికలకు దూరంగా ఉన్నారు. నేపాలీ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ప్రధానమంత్రి షేర్ బహదూర్ దేబా, నేపాలీ కమ్యూనిస్టుపార్టీ సీనియర్ నాయకుడు ఝూలానాథ్ ఖనాల్ ఇద్దరూ పోటీలో లేరు. గత ఏడాది సెప్టెంబరు 9న జనరేషన్ జెడ్ ఉద్యమం వల్ల కె.పి.శర్మ ఓలి తన పదవికి రాజీనామా చేశారు.షేర్ బహదూర్ దేబా, ప్రచండ, కె.పి.శర్మ ఓలీ ముగ్గురూ గడచిన 15 సంవత్సరాలుగా ఒకరి తర్వాత ఒకరు ప్రధాన మంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. దేశంలో నాయ కత్వమార్పు కావాలని జెనరేషన్ జెడ్ ఉద్యమ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటివరకూ 3,088 పురుషులు, 395 మంది మహిళలు దిగువసభలో ఉన్న 165 సీట్ల కోసం నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 275 సీట్లకుగాను దిగువసభలో 110 మంది ప్రతినిధులను దామాషా పద్ధతిలో ఎన్నుకుంటారు. ఎంతమంది అభ్యర్థులు పోటీలో మిగి లారనే విషయం ఈనెల 23వ తేదీన ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది.

## అమెరికా కలకలం (మొదటి పేజీ తరువాయి)

క్షీణించింది. ఇది కేవలం సంఖ్యల ఆట కాదు; ఇది పెట్టుబడిదారుల మాన సిక స్థితిని ప్రతిబింబించే సంకేతం. అమెరికా విశ్వసనీయ భాగస్వామిగా లేక పోవచ్చన్న భావన బలపడుతోంది. స్వప్రయోజనాలకే పరిమితమై, ప్రపంచ వాణిజ్య వ్యవస్థకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుందన్న అభిప్రాయం పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే వెస్ట్‌పాక్ సీనియర్ ఆర్థికవేత్త మాంటాస్ వానాగాస్ మాట్లాడుతూ, అమెరికాపై నమ్మకం తగ్గడంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను తగ్గించుకుంటున్నారు అని వ్యాఖ్యానించారు. మార్కె ట్లలో అనిశ్చితి పెరిగినప్పుడు పెట్టుబడిదారులు సాధారణంగా భద్రమైన ఆస్తుల వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం అదే జరుగుతోంది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధర బుధవారం ఒక్కరోజే 2.1 శాతం పెరిగి, ఔన్స్‌కు 4,865 డాలర్ల కొత్త రికార్డు స్థాయిని తాకింది. రాజకీయ, ఆర్థిక సంక్షోభాల సమయంలో పెట్టుబడులకు అత్యంత భద్రతమైనదిగా బంగారాన్ని భావిస్తారు. ప్రస్తుతం అమెరికా డాలర్ బలహీనపడటం, వాణిజ్య యుద్ధ భయాలు పెరగడం ప్రస్తుతం అలాంటి పరిస్థితులనే సృష్టిస్తు న్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అశాంతికి ప్రధాన రాజకీయ కారణం ట్రంప్ తాజా వ్యాఖ్యలే. గ్రీన్‌ల్యాండ్ ఎట్టి పరిస్థితుల్లోనూ అమెరికా నియంత్రణలోకి రావాల్సిదేనని భీష్మించుకోవడం, అందుకు యూరోపియన్ యూనియన్ (ఇయు) తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేయడం ఇప్పుడు అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. ఇరు వర్గాలూ, అవసర మైతే బలప్రయోగం కూడా చేయవచ్చన్న సంకేతాలు ఇవ్వడం మరింత ఆందోళన కలిగించింది. ఇది కేవలం ఒక భూభాగం విషయంలో వివాదం కాదు. ఇది అంతర్జాతీయ చట్టాలు, సార్వభౌమాధికారం, శాంతి అనే మూల సూత్రాలకే సవాలు విసిరినట్లుగా ప్రపంచం భావిస్తోంది. ముఖ్యంగా యూర ప్ దేశాలు దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాయి. అమెరికా–యూరప్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న వ్యూహాత్మక మైత్రి ఇప్పుడు పరీక్షకు గురవు తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో యూరోపియన్ యూనియన్ బ్రస్సె ల్స్‌లో అత్యవసర సదస్సు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గ్రీన్‌ల్యాండ్ వివాదం, టారిఫ్ బెదిరింపులు, భవిష్యత్తు వ్యూహాలపై చర్చ జరగనుంది. అదే సమయంలో ట్రంప్ దావోస్ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. పంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం)లో ట్రంప్ ప్రసంగానికి ముందే, మదుపరులు రక్షణాత్మక విధానాలను పాటించారు. ఫలితంగా ప్రపంచ బాండ్ మార్కెట్లు భారీ పతనాన్ని చవిచూస్తున్నాయి.జపాన్, అమెరికా, జర్మనీ వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ప్రభుత్వ బాండ్లపై భారీ అమ్మకాలు జరిగాయి. జపాన్‌లో దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్లు దాదాపు 25 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా పతనమయ్యాయి. ప్రధాని సానాయ్ తకైచి ప్రభుత్వం భారీ ఖర్చులు పెంచుతుందన్న భయంతో పెట్టుబడిదారులు బాండ్లను అమ్మే శారు. ప్రపంచ మార్కెట్ల పతనాన్ని, దావోస్‌లో ట్రంప్ ప్రసంగం నిలువరి స్తుందా లేక మరింత పెంచుతుందా అనేది చూడాలి.

చివరి క్షణాల్లో ఆదుకున్న దేశీయ ఇన్వెస్టర్లు చివరి క్షణాల్లో దేశీయ మదుప రులు ఆదుకోవడంతో, భారత స్టాక్ మార్కెట్లు బుధవారం స్వల్ప నష్టాలతో బయటపడ్డాయి. లేకపోతే, భారీ నష్టాలను చవిచూసేవి. ఒకానొక దశలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్ ఏకంగా 1,056.02 పాయిం ట్లు పతనమైంది. అయితే, చివరి సెషన్‌లో దేశీయ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టడంతో, పరిస్థితి కొంత మెరుగుపడింది. లావాదేవీలు ముగిసే సమయా నికి సెన్సెక్స్ 270.84 పాయింట్లు (0.33 శాతం) నష్టపోయి, 81,909.63 పాయింట్ల వద్ద స్థిరపడింది. అదే విధంగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎ స్ఇ)లో నిఫ్టీ 75 పాయింట్లు (0.30 శాతం) పతనమై, 25,157.50 పాయింట్లకు చేరింది. బుధవారం నాటి లావాదేవీల్లో విదేశీ సంస్థాగత పెట్టు బడిదారులు 2,938.33 కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. అయితే, సంస్థా గత పెట్టుబడిదారులు 3,665.69 కోట్ల విలువైన వాటాలను కొలుగోలు చేశారు. ఐసిఐసిఐ బ్యాంక్, ట్రెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, లార్సెన్ అండ్ టూబ్రో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మారుతి వంటి కంపెనీలు స్వల్ప నష్టాలను చవిచూడగా, ఎటర్నల్, అల్ట్రా టెక్ సిమెంట్, ఇంటర్‌గ్లోబ్ ఏవిషయేషన్, రిలియన్స్ ఇండస్ట్రీస్ స్వల్పంగా లాభపడ్డాయి.

## స్టీల్ ఉత్పత్తి యూనిట్

(మొదటి పేజీ తరువాయి)

సంజిబ్ కుమార్ పట్వారి తెలంగాణ రైజింగ్ బృందంతో భేటీ అయ్యారు. స్టీల్ ప్లాంట్ లేబర్ ఇంటెన్సివ్ తయారీ విధానంతో పనిచేస్తుందని, పెద్దఎత్తున ఉపాధి అవకా శాలు కల్పిస్తుందని డైరెక్టర్ సంజిబ్ కుమార్ తెలిపారు. గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యంపై కూడా చర్చలు జరిగాయి. రష్మి గ్రూపు ఆసియాలోని 40 దేశాలు, యూరప్, ఆఫ్రికా, ఉత్తర,దక్షిణ అమెరికా దేశాల్లో కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తుందని ముఖ్య మంత్రి కార్యాలయం తెలియజేసింది. రూ.6 వేల కోట్లతో రియాక్టర్ విద్యుత్ ప్లాంట్ క్లీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణలో రూ.6 వేల కోట్ల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ (ఎస్ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు అభివృద్ధికి స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆ సంస్థ ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈ ఓఐ) సమర్పించింది. దావోస్‌లో బుధవారం జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక–2026 సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు సిఎం సిద్ధంగా ఉంద న్నారు. 2047 నాటికి కాలుష్యం నెట్–జీరో అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో సుస్థిర అభివృద్ధే తెలంగాణకు ప్రధానమని స్పష్టం చేశారు. స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్, భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంయుక్త భాగస్వామ్యంలో ఏర్పడిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ గరిష్ఠంగా 300 మెగావాట్ల సామర్థ్యంతో తెలంగాణలో కొత్త విద్యుత్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరి శీలిస్తోందని సిఎం కార్యాలయం వెల్లడించింది.

**రూ.1,000 కోట్ల పెట్టుబడికి అమెరికా సంస్థ సర్గాడ ఎంఒయు**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దావోస్ పర్య టన విజయవంతంగా ముందుకు సాగుతోంది. విమాన యాన రంగంలో పేరొందిన అమెరికాకు చెందిన సర్గాడ సంస్థ తెలంగాణలో మెయింటెనెన్స్ అండ్ రిపేర్ యూనిట్ నెలకొల్పేందుకు, రానున్న 3 నుంచి 5 ఏళ్లలో దశలవారీగా సుమారు రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వంతో సర్గాడ సంస్థ అవ గాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది.



ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా బుధవారం దావోస్‌లో సర్గాడ సంస్థ వ్యవస్థాపకుడు, సిఇఒ శ్రీనివాస్ తోట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. తెలంగాణలో విమానాల నిర్వహణ, మరమ్మతులు, పున రుద్ధరణ (ఎంఆర్ఓ) కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆస క్తిని సంస్థ ప్రతినిధులు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణను మూడు క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు ప్రత్యేక జోన్లుగా అభి వృద్ధి చేస్తున్నామని వివరించారు. వరంగల్, ఆదిలాబాద్ లలో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నా మని, ఈ ప్రాంతాల్లో ఏదైనా ఒక చోట ఎంఆర్ఓ కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్య మంత్రి సర్గాడ సంస్థ సిఇఒ కు సూచించారు. వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అత్య ధిక ప్రోత్సాహకాలు అందిస్తామని సిఎం వారికి హామీ ఇచ్చారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈ పెట్టుబడులతో తెలంగాణలోని ఎంఎస్ఎంఈలకు పరికరాల తయారీ రంగంలో కొత్త అవకాశాలు వస్తాయని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

**తెలంగాణతో బ్లైజ్ కంపెనీ ఒప్పందం**

తెలంగాణ ప్రభుత్వం దావోస్‌లో కాలిఫోర్నియాకు చెందిన బ్లైజ్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎం ఒయు) కుదుర్చుకుంది. ఈ సంస్థ డేటా సెంటర్ ఆర్టిఫి షియల్ కంప్యూటింగ్‌కు తక్కువ శక్తి వినియోగించే ఎఐ హార్డ్‌వేర్, ఫుల్‌స్టాక్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోంది. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో బ్లైజ్ సహవ్యవస్థాపకులు, సిఇఒ దినాకర్ మునగాలా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా జరిగిన చర్చల అనంతరం ఒప్పందం కుదుర్చు కున్నారు. దీంతో తెలంగాణలో ఎలక్ట్రానిక్స్, సెమీకండ క్టర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలు వేగవంతమవుతాయని, ఇప్పటికే బ్లైజ్ సంస్థ హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవెలప్‌మెంట్, ఇంజినీరింగ్ సెంటర్‌ను నిర్వహిస్తోందని సంస్థ ప్రకటిం చింది. సంస్థ ఆర్ అండ్ డి సెంటర్‌ను విస్తరించే పెట్టుబ డులు, ప్రణాళికలపై ఈ సందర్భంగా చర్చలు జరి గాయి. బ్లైజ్ సంస్థ హైదరాబాద్ ఆర్ అండ్ డి యూనిట్ విస్తరణకు ప్రభుత్వం తగిన మద్దతు అందిస్తుందని హామీ ఇచ్చారు.

**హైదరాబాద్‌లో తొలి బ్యూటీ–టెక్ జిసిసి ఏర్పాటు**

హైదరాబాద్ ప్రపంచంలోనే తొలి బ్యూటీ–టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జిసిసి)ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధు నిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించ నుంది. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ –2026లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లోరియల్ సిఇఒ నికోలస్ హియోరోనిమస్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ–టెక్ జిసిసి ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడిం చారు. ఈ జిసిసి ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నో వేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఎఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొం దించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియోరోనిమస్ తెలిపారు. నవంబర్‌లో జిసిసి ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లను లోరియల్ ఆహ్వానించారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ–టెక్ వంటి కొత్త విభాగా ల్లోనూ తెలంగాణ ముందుంటోందని హియెరోనిమస్‌కు ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాష్ట్రంలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్ట మ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగం లోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హియెరోనిమస్ సానుకూలంగా స్పందించారు.

## పరుగో పరుగు

(మొదటి పేజీ తరువాయి)

10 గ్రాముల ధర బుధవారం మరింత పెరిగింది. హైదరాబాద్ మార్కెట్‌లో ఈ ఉదయం పసిడి ధర ఏకంగా రూ. 1,61,100 పలికింది. మంగళ వారంతో పోలిస్తే దాదాపు రూ. 9000 పైగా పెరిగింది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,41,900 చేరింది. వెండి ధర కూడా దూసుకెళ్తోంది. ఉదయం కిలో వెండి ధర రూ. 3,30,000పలికింది. మంగళ వారంతో పోలిస్తే బుధవారం ఒక్కరోజే కిలో వెండి ధర రూ.14,000 మేర ఎగబాకింది. దేశ రాజధాని ఢిల్లీ మార్కెట్‌లో పది గ్రాముల పసిడి ధర రూ. 7,400 మేర పెరిగి రూ. 1,58,100 చేరింది. కిలో వెండి ధర రూ. 11,000 మేర పెరిగి రూ. 3,33,800 ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర తొలిసారిగా ఔన్సుకు 4,800 డాలర్ల మైలురాయిని దాటి కొత్త రికార్డు నెలకొల్పింది. ఈ నేపథ్యంలో బంగారం పెట్టు బడిదారులకు అత్యంత నమ్మకమైన ఇన్వెస్ట్ మెంట్ గా మారింది. అదే విధంగా వెండి ధర కూడా ఔన్సుకు 95.87 డాలర్ల గరిష్ఠ స్థాయిని చేరుకుంది.

# ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు

**సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ స్ఫూర్తితో నిర్వహిస్తాం**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంలో జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ ఇచ్చిన ఉత్సాహంతో రాబోయే కాలంలో తెలంగాణలో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, ఏ ప్రభుత్వం ఉన్నా సరే ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఖమ్మంలో సిపిఐ జాతీయ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పార్టీ జాతీయ కార్యదర్శి డి. రాజాకు, 18వ తేదీ నుండి 21వ తేదీ వరకు జరిగిన అన్ని కార్యక్రమాలకు సహకరించిన పాత్రికేయ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

1975లో విజయవాడలో జరిగిన సభ తర్వా త, దాదాపు 50 ఏళ్ల తర్వాత మళ్ళీ అంతటి స్థాయిలో ఖమ్మం నగరం ఎర్రజెండాలతో అరుణమయమైందని, ఇది తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని పేర్కొన్నారు. ప్రదర్శన , బహిరంగ సభ లో సుమారు 2లక్షల మంది పాల్గొన్నారని, అందులో సగం మంది 40 ఏళ్ల లోపు వయసున్న యువతే ఉండటం విశేషమని ఆయన చెప్పారు. కొత్త తరం కూడా కమ్యూనిజం వైపు ఆకర్షితులవుతున్నారని దీనిద్వారా స్పష్టమవుతోందని అన్నా రు. కమ్యూనిస్టులు ఎక్కడ ఉన్నారు అని ప్రశ్నించే వారికి ఈ సభ ఒక సమాధానమని, ప్రజలు కమ్యూనిస్టులందరూ ఒకటి కావాలని కోరుకుంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. సిపిఐ శతాబ్ది బహిరంగ సభకు, జాతీయ సమితి సమావేశాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి భాగం హేమంతరావు ధన్యవాదాలు తెలిపారు.

**ప్రైవేటురంగంలో రిజర్వేషన్లపై తీర్మానం: కె. రామకృష్ణ**


జాతీయ సమితి సమావేశాల్లో 9 తీర్మానాలు చేశామని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. అందులో మహాత్మాగాంధీ నరేగా స్థానంలో బిపిఎస్ఎ చట్టం తీసుకురావడానికి వ్యతిరేకంగా పోరాడాలని, ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతు ఇవ్వాలని, భారతదేశంలోని ఢిల్లీ సహా పలు నగరాల్లో కాలుష్యంపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాల వైఫల్యం వంటివి ఉన్నాయన్నారు. అలాగే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ తీర్మానం చేసినట్లు రామకృష్ణ వెల్లడించారు. ప్రభుత్వరంగ సంస్థలు అన్ని ప్రైవేటీకరణ జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం నయా .......ద్వారా విధానాల ఫలితంగా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తున్నారని, కాబట్టి ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానించినట్లు తెలిపారు

# లెనిన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి

**ఆర్థిక దోపిడీ, అణచివేతలపై నిరంతర పోరాటం సాగించాలి**

**డి.రాజా**

**ప్రజాపక్షం/ఖమ్మం,హైదరాబాద్ :** ఆర్థిక దోపిడీ, అణచివేతలపై నిరంతర పోరాటం సాగించాలని, లెనిన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. లెనిన్ 102వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం పట్టణంలో బుధవారం జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గ, జాతీయ సమితి సమావేశాల్లో లెనిన్ చిత్ర పటానికి రాజాతో పాటు పలువురు నాయకులు పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించగా, జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె. రామకృష్ణ, అమర్జిత్ కౌర్, రామకృష్ణ పాండ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ మార్క్స్, ఎంగెల్స్ తర్వాత ప్రపంచ గతిని మార్చిన గొప్ప తత్వవేత్త, విప్లవకారుడు లెనిన్ అని కొనియాడారు. పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాద దోపిడీ నుంచి మానవాళిని రక్షించేందుకు విప్లవ యోధుడు వ్లాదిమిర్ లెనిన్ చూపిన మార్గంలో ప్రయాణించాలని చెప్పారు. ఆయన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లారని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని లోపాలను అద్భుతంగా విశ్లేషించారని తెలిపారు. పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశనే సామ్రాజ్యవాదమని లెనిన్ చెప్పిన విషయాన్నీ గుర్తు చేశారు. ప్రస్తుత ప్రపంచ రాజకీయా ల్లో డోనాల్డ్ ట్రంప్ వంటి నాయకుల చర్యలు సామ్రాజ్యవాద స్వభావాన్ని ప్రతిబింబిస్తున్నాయని అన్నా రు.


హైదరాబాద్‌లోని మఖ్దుంభవన్‌లో

**మఖ్దుంభవన్‌లో ఐ.వి.లెనిన్‌కు సిపిఐ నేతల ఘన నివాళి :**

ప్రపంచ కార్మిక వర్గ ప్రయోజనాల కోసం జీవితాంతం పోరాడిన మహా నేత ఐ.వి. లెనిన్ అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. ఐ.వి. లెనిన్ 102వ వర్ధంతి సందర్భంగా బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఆయన చిత్ర పటానికి చాడ వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్య నాయక్, సమితి సభ్యులు ఎం.అనిల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ శ్రమజీవుల హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయంకోసం లెనిన్ చూపిన మార్గం నేటికీ ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తోందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీకి వ్యతిరేకంగా లెనిన్ చేసిన పోరాటం, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణంలో ఆయన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నా రు. కె.శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ లెనిన్ సిద్ధాంతాలు నేటి యువత, కార్మికులు, రైతులకు స్ఫూర్తిదాయకమన్నారు. లెనిన్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో బోయ శ్రీరాములు, విజయ్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.




# మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేయాలి

**టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్/నిజామాబాద్:** రాబోయే మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతిఒక్కరూ పనిచేయాలని, నిజామాబాద్ జిల్లాలో మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేసి తీరాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గాంధీ భవన్‌లో బుధవారం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పార్లమెంట్ ఇంచార్జ్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, మండవ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ ప్రజలు పట్టం కట్టారని, 70 శాతం పైగా సర్పంచ్ స్థానాలను గెలుచుకున్నామని అన్నారు. ఎప్పటిలానే మతం పేరిట బిజెపి రాజకీయం చేస్తుందని, బిజెపి, బిఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని చెప్పారు. కిషన్ రెడ్డి పలుకులు బిఆర్ఎస్ నేతలు చెప్పినట్లుగా ఉన్నాయని, కెటిఆర్, హరీష్ దారిలో కిషన్ రెడ్డి నడుస్తున్నాడని ఎద్దేవా చేశారు.

టెండర్ల అవకతవకలపై అనుమానం ఉంటే చర్చకు రావాలని, కేంద్ర బొగ్గు మంత్రిగా కిషన్‌రెడ్డి ఉన్నారు కదా? విచారణ జరపాలన్నారు. గత బిఆర్ఎస్ హయాంలో అవకతవకలపై దర్యాప్తు అవసరమని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రంలో పారదర్శకత వచ్చిందని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు.

# విత్తన బిల్లు రైతుల పాలిట మరణ శాసనం

**వ్యవసాయ దిగుమతులతో సంక్షోభంలోకి సాగు రంగం**

**ఎఐకెఎస్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు రాజు క్షీర్ సాగర్, రావుల వెంకయ్య**




**ప్రజాపక్షం/ఖమ్మం:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన బిల్లు–2025 రైతుల పాలిట మరణ శాసనమని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు రాజు క్షీర్‌సాగర్, రావుల వెంకయ్యలు తెలిపారు. బిజెపి ప్రభుత్వం రైతాంగ విధానాలను అవలంబిస్తుందని ఈ క్రమంలో వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ శక్తులు ఆక్రమిస్తున్నాయని వారు తెలిపారు. బుధవారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రావుల వెంకయ్య మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా ఉండే విత్తన బిల్లును, విద్యుత్ బిల్లును తీసుకు వచ్చిందని వీటిని ఏఐకెఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అదే సమయంలో ఇండో యుఎస్ వాణిజ్య ఒప్పందాలను సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. భారతదేశం వ్యవసాయ దిగుమతులను పెంచడంతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రావుల వెంకయ్య తెలిపారు. గతంలో విదేశీ వ్యవసాయ దిగుమతులు కేవలం రూ.70వేల కోట్లు ఉంటే ఇప్పుడు రూ.3లక్షల కోట్లకు పెరిగాయని వెంకయ్య తెలిపారు. విదేశీ దిగుమతుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావడం లేదని ఆయన తెలిపారు. కనీస మద్దతు ధర కోసం పోరాడుతున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్వామినాథన్ చెప్పినట్లుగా సి2ప్లస్ 50 శాతాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో రోజుకు 31 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అయినా ఈ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. జాతీయ అధ్యక్షులు రాజు క్షీర్‌సాగర్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని దీనిని నిరసిస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని ఆయన తెలిపారు. జనవరి మూడు, నాలుగు తేదీలలో నాగపూర్‌లో జరిగిన జాతీయ సమితి సమావేశాల్లో రైతాంగ సమస్యల పరిష్కారం, వ్యవసాయరంగ పరిరక్షణకు బహుముఖ ఆందోళనలు చేయాలని నిర్ణయించినట్లు క్షీర్‌సాగర్ తెలిపారు. మోన్‌శాంటో, బోల్‌గార్డ్ తదితర విత్తన సంస్థలు రైతులను మోసం చేస్తున్నాయని అయినా మోడీ ప్రభుత్వం విత్తన సంస్థలకు మద్దతుగా నిలుస్తుందన్నారు. సిసిఐ, నాఫెడ్ లాంటి సంస్థలను రంగంలోకి దింపి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. రైతు రుణ విముక్తి చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఆరావళి పర్వతాలను కార్పొరేట్ శక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తున్నామన్నారు.

ఫిబ్రవరి, మార్చి మాసాల్లో జరిగే రైతాంగ ఉద్యమాలను చేపట్టనున్నామని ఆయన తెలిపారు. నాలుగు లేబర్‌కోడ్స్‌కు వ్యతిరేకంగా జరిగే బంద్‌కు ఏఐకెఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. ఈ మీడియా సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సీనియర్ నాయకులు అడపా రామకోటయ్య, రైతు సంఘం బాధ్యులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇంట్లో ఎసిబి సోదాలు

**రూ.8 కోట్ల ఆస్తుల గుర్తింపు, రూ.30 లక్షలు స్వాధీనం**

**ప్రజాపక్షం/హనుమకొండ :** హన్మకొండ అదనపు కలెక్టర్‌గా గతంలో పనిచేసి ఎసిబికి పట్టుబడిన వెంకట్ రెడ్డి ఇంట్లో ఆ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 10 చోట్ల ఎసిబి సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో ఉన్న ఆయనకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు, అనుబంధ ప్రదేశాల్లో ఒకేసారి తనిఖీలు చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో అక్రమంగా కోట్ల రూపాయల ఆస్తులకు సంబంధించిన నగదు, కీలక పత్రాలు, స్థిరాస్తుల వివరాలపై అధికారులు పరిశీలిస్తున్నారు. హన్మకొండ అదనపు కలెక్టర్‌గా పనిచేసి గత నెలలో ఎసిబి కి పట్టుబడ్డ వెంకట్ రెడ్డి ఇంట్లో ఎసిబి అధికారులు సోదా చేస్తున్నారు. గత నెలలో ఆయన ఒక పాఠశాల రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ విషయంలో రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఆయనతో పాటు ఇద్దరు ఉద్యోగుల ను అదుపులోకి తీసుకున్నారు. వెంకట్ రెడ్డి పై నల్గొండ జిల్లాలో పనిచేసినప్పుడు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయింది. జనగామలో పనిచేసినప్పుడు ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయి. సోదాలు పూర్తయ్యాక పూర్తి వివరాలను వెల్లడించే అవకాశం ఉందని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాధేష్, వరంగల్ ఎసిబి డీఎస్పీ సాంబయ్య తెలిపారు. కాగా ఇప్పటికే వెంకట్ రెడ్డి ఇంట్లో 8 కోట్ల రూపాయల విలువైన ఆస్తులు గుర్తించినట్లు, వెంకట్ రెడ్డి ఇంట్లో ఆ శాఖ అధికారులు జరిపిన సోదాలలో రూ.30 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపా రు.

# దావోస్ వేదికగా తెలంగాణ గ్లోబల్ లైఫ్ సైన్సెస్

**'నెక్స్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026–30' ఆవిష్కరణ**

**రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు, 5 లక్షల ఉద్యోగాల లక్ష్యం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ ఆరోగ్య, బయోఫార్మా రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'నెకట్స్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026–30'ను వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఇఎఫ్) వార్షిక సమావేశంలో ఆవిష్కరించింది. ఈ విధానంతో 2030 నాటికి ప్రపంచంలోని టాప్5 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో తెలంగాణను నిలబెట్టాలన్నది ప్రభుత్వ ఆశయం. ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో అమెరికన్ డాలర్లు 25 బిలియన్లు (రూ.2 లక్షల కోట్లు) పెట్టుబడులు ఆకర్షించడం, సుమారు 5 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంప్రదాయ భారీ ఉత్పత్తి కేంద్రంగా కాకుండా, అధిక విలువైన పరిశోధన–అభివృద్ధి (ఆర్ అండ్ డి), ఆధునిక బయోలాజిక్స్, నూతన థెరపీలు, పర్యావరణహిత తయారీ వైపు తెలంగాణను మలిచే దిశగా ఈ పాలసీ రూపకల్పన జరిగింది.దావోస్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ పాలసీని అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ , తెలంగాణ లైఫ్ సైన్సెస్ సిఇఒ శక్తి ఎం. నాగప్పన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచానికి విశ్వసనీయమైన, మార్పును తీసుకొచ్చే బయోసైన్సెస్ ఎకోసిస్టమ్‌ను తెలంగాణలో నిర్మిస్తున్నాం. దావోస్ వేదికపై పాలసీని ప్రకటించడం ద్వారా గ్లోబల్ సహకారం, అంతర్జాతీయ పెట్టుబడులు, సంయుక్త ఆవిష్కరణలే లైఫ్ సైన్సెస్ భవిష్యత్తు అని స్పష్టం చేస్తున్నాం అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,గత రెండేళ్లలోనే రూ.73 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాం. ఈ కొత్త పాలసీతో వచ్చే ఐదేళ్లలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం. సెల్ & జీన్ థెరపీలు, పెప్టైడ్స్, ప్రెసిషన్ ఫర్మెంటేషన్ వంటి ఫ్రంటియర్ సైన్స్‌పై దృష్టి పెట్టాం. క్లినికల్ రీసెర్చ్, డయాగ్నస్టిక్స్, డిజిటల్ హెల్త్ రంగాల్లోనూ తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం అన్నారు. ఫోకస్ రంగాలలో అడ్వాన్స్‌డ బయోలాజిక్స్, సెల్ జీన్ థెరపీ, క్లినికల్ ట్రయల్స్, ఫార్మా సర్వీసులు సిఆర్ఒలు, సిడిఎంఒలు, డయాగ్నస్టిక్స్, మెడికల్ ఎలక్ట్రానిక్స్, ప్రిసిషన్ మెడిసిన్, పర్సనలైజ్డ్ థెరపీలు,గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఉన్నాయి. ప్రస్తు తం హైదరాబాద్‌లో అమ్జెన్, సానోఫీ, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్, లిల్లీ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తమ ఆర్ అండ్ డి, గ్లోబల్ సెంటర్లను విస్తరిస్తుండటం తెలంగాణపై ప్రపంచ స్థాయి నమ్మకాని కి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది.ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్ అవసరాల్లో మూడో వంతు సరఫరా చేసే స్థాయికి ఎదిగిన తెలంగాణ, ఈ కొత్త పాలసీతో గ్లోబల్ లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా మారాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**కీలక ప్రాజెక్టులు ..**

*గ్రీన్ ఫార్మా సిటీ: జీరో లిక్విడ డిశ్చార్జ్, నెట్‌జీరో లక్ష్యాలతో పర్యావరణహిత పరిశ్రమ నగరం

*10 ఫార్మా విలేజ్‌లు: ఔటర్ రింగ్ రోడ్డు వెంట 1,000–3,000 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి

*1బయో కేంద్రం: దేశంలోనే తొలి గ్రోత్‌ఫేజ్ బయోఫార్మా స్కేల్‌అప్ తయారీ కేంద్రం

*జీనోమ్ వ్యాలీ విస్తరణ, మెడికల్ డివైసెస్ పార్క్ బలోపేతం

*లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ ఫండ్ ప్రారంభంగా రూ.100 కోట్లు, భవిష్యత్తులో రూ.1,000 కోట్లకు విస్తరణ

# ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఒకే రకమైన విద్యాప్రమాణాలు

**మంత్రి దామోదర్ రాజ నర్సింహ్మా**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా విద్యార్థికైనా, ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీ విద్యార్థికైనా ఒకే రకమైన అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించాల్సిందేనని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సంప్రదాయ విద్యా విధానంతో పాటు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ ఎడ్యుకేషన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వైద్య విద్యలో సాంకేతికతను జోడించడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా విద్యార్థులందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించవచ్చాన్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఎడ్యుకేషన్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఏటా 4,140 మంది విద్యార్థులు ఎంబిబిఎస్ విద్యను అభ్యసిస్తున్నారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో చదివిన వైద్యులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గుర్తింపును దృష్టిలో ఉంచుకుని, అదే స్థాయి బోధనను కొత్తగా ఏర్పాటైన జిల్లాల కాలేజీల్లోనూ అందించాలి. మెడికోలకు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించాలని మంత్రి సూచించారు. తరగతి గదుల్లో స్మార్ట్ బోర్డులు, ఎల్ఈడీ స్క్రీన్లు, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పరీక్షించేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా క్లిష్టమైన అనాటమీ, సర్జికల్ ప్రొసీజర్ల పట్ల విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించేందుకు వర్చువల్ ల్యాబ్స్, సిమ్యులేషన్ టూల్స్ వంటి అధునాతన పద్ధతులను వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ఉస్మానియా, గాంధీ, వరంగల్ ఎంజీఎం కళాశాలలను సెంటర్స్ ఆఫ్



ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈ కేంద్రాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి భవిష్యత్ సాంకేతికతపై ప్రత్యేక దృష్టి సారించి, వీటిని ఇతర కళాశాలలకు మెంటర్ శిక్షణా కేంద్రాలుగా మార్చాలని సూచించారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పాఠ్యాంశాలను డిజిటల్ రూపంలోకి మార్చి, నేషనల్ డిజిటల్ లైబ్రరీతో అనుసంధానం చేయాలని, ఇందుకుప్రతి కళాశాలలో అవసరమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌తో పాటు ఐటి అడ్మినిస్ట్రేటర్లు, టెక్నీషియన్లను నియమించాలన్నారు. మన విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా రాణించేలా వారిని తీర్చిదిద్దడమే ఈ డిజిటల్ విధానం ప్రధాన ఉద్దేశమని మంత్రి పునరుద్ఘాటించారు.

# ఎంపి మల్లు రవి క్షమాపణ చెప్పాలి: కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అలంపూర్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకుడు విజయుడిపై కాంగ్రెస్ ఎంపి మల్లు రవి దుర్భాషలాడుతూ చేయి చేసుకోవడం ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడిగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అభివర్ణించారు. ప్రతిపక్షాన్ని భయపెట్టేందుకు, గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారిన రాజకీయానికి ఇది నిదర్శనమని ఆయన ట్విట్టర్ ద్వారా తెలియజేసారు. ప్రజలతో ఎన్నికైన ఎమ్మెల్యేను అవమానిస్తూ, శారీరక దాడికి దిగడం కాంగ్రెస్ సంస్కృతి ఎంత దిగజారిందో అర్థమవుతుందని కెటిఆర్ మండిపడ్డారు. చట్టం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై కాంగ్రెస్కు గౌరవం లేదని ఈ ఘటన మరోమారు స్పష్టం చేస్తోందన్నారు. ఈ దాడిని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఎంపి మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాన్ని బెదిరింపులతో కాదు, ప్రజల తీర్పుతోనే ఎదుర్కోవాలని సూచించారు. బిఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తే చూస్తూ ఉరుకోమని హెచ్చరించారు.

# క్షమాపణ చెప్పకపోతే నిరాహార దీక్ష చేస్తా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తనపై కావాలనే కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వారు క్షమాపణ చెప్పకపోతే నిరాహార దీక్షకు కూర్చుంటానని నాగర్ కర్నూల్ ఎంపి డా. మల్లు రవి స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మంగళవారం అలంపూర్ లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగిన సందర్భంగా ఎంపిగా తాను, ఎంఎల్ఏగా విజయుడు ఇద్దరం కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నామని, ఎస్‌బిఐ ద్వారా ఐదు గ్రామాలను దత్తత తీసుకొని, ఆ గ్రామాల్లోని స్కూళ్లలో సైన్స్ ల్యాబ్, ఆడపిల్లలకు సైకిళ్లు, ఫ్రీ ఆర్మీ సెలక్షన్ ట్రైనింగ్ క్యాంప్స్ వంటివి ఏర్పాటు చేయాలనుకున్నామని తెలిపారు. కానీ, ఆ కార్యక్రమంలో తామిద్దరం కొట్టుకున్నామని సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నార ని అన్నారు. ఏదైనా కార్యక్రమం జరిగినప్పుడు వారి పార్టీ కార్యకర్తలను వారు, తన పార్టీ కార్యకర్తలను తాము సముదాయించుకోవాల్సిన అవసరం ఉంటుందని, కానీ, ఈ ఘటన గురించి కెటిఆర్‌కి కొందరు తప్పుడు సమాచారం ఇచ్చినట్టున్నారు, తప్పుడు సమాచా రం తో కెటిఆర్ ట్వీట్ చేసినట్టున్నారని చెప్పారు. పూర్తి సమాచారం తెలుసుకోకుండా తనపై ఆరోపణ చేసిన వారందరూ క్షమాపణ చెప్పాలని, అసలు గొడవ జరగకుండా ఎంఎల్ఏను అక్కడి నుంచి తీసుకెళ్ళానని చెప్పారు. తన ప్రతిష్ట,



కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట చెడగొట్టడానికి తిట్టకపోయినా తిట్టినట్టు, కొట్టకపోయినా కొట్టినట్టు, దళితుడి మీద దాడి చేసినట్టు తప్పుడు సమాచారాన్ని వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారన్నారు. నమస్తే తెలంగాణ పేపర్ సహా తప్పుడు ప్రచారం చేసిన వారందరూ క్షమాపణ చెప్పాలని కోరారు. తనతో పాటు సిఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పకపోతే, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి తీసుకొని, క్షమాపణ చెప్పేంతవరకు తాను నిరాహార దీక్షకు కూర్చుంటానని మల్లు రవి పేర్కొన్నారు.

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్ : గద్వాల్ సర్కిల్
టెండర్ ప్రకటన నెం. 08/2025-26
Open Tender - Tender Notice-08/2025-26, Specification No. W-59 to W-61/2025-26
ఆపరేషన్ సర్కిల్ గద్వాల్‌లోని వివిధ ప్రదేశాలలో చేపట్టే వివిధ విద్యుత్ పనుల కోసం **టెండర్ నోటీస్-08/2025-26, స్పెసిఫికేషన్లు (W-59 నుండి W-61/2025-26)** కొరకు అర్హత గల విక్రేతల నుండి బిడ్లు ఆహ్వానించబడ్డాయి. టెండర్ అమ్మకం ప్రారంభ తేదీ: **22.01.2026 ఉదయం 11:00 గం.లకు** మరియు టెండర్లను స్వీకరించడానికి చివరి తేదీ: **30.01.2026 మధ్యాహ్నం 2:00 గం.ల వరకు**. టెండర్ నోటీసుకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం దయచేసి https://tgsouthernpower.org వెబ్‌సైట్‌ను సందర్శించండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్: గద్వాల్, టిజిఎస్‌పిడిసిఎల్.
DIPR R.O. No. : 14096-PP/CL/ADVT/1/2025-26, Date: 21-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక.
GHMC
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన
NIT No.02/EE-II/Cir.43/SBZ/GHMC/2025-26 తేది: 21.01.2026
**పని పేరు:** జిహెచ్‌ఎంసి, తార్నాక, సర్కిల్-43, వార్డ్-173, టిప్పు ఖాన్ మసీదు ఈద్గా వద్ద ఈద్గాలో సిసి ఫ్లోరింగ్ ఏర్పాటు చేయడం (2026 రంజాన్ పండుగ సందర్భంగా). జిహెచ్‌ఎంసి, తార్నాక, సర్కిల్-43, వార్డ్-173, టిప్పు ఖాన్ మసీదు ఈద్గా వద్ద ఈద్గాలో తెల్లటి పందిళ్లు, తివాచీలు, కుర్చీలు, బల్లలు మొదలైనవి ఏర్పాటు చేయడం (2026 రంజాన్ పండుగ సందర్భంగా). (మొత్తం 2 పనులు). **అంచనా మొత్తం / ఇసివి:** రూ.22.90 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 22.01.2026న సా.4.00గం.ల నుండి, 27.01.2026న సా.4.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, మెట్టుగూడ, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్ జోన్. సెల్ నెం. 970440507. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 14131-PP/CL/ADVT/1/2025-26, Date: 21-01-2026

తెలంగాణ ప్రభుత్వం
**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, వికారాబాద్.**
సంక్షిప్త టెండర్ ప్రకటన
(T-Diagnostics - నమూనా సేకరణ వాహనాలు)
రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, వికారాబాద్ ఆధ్వర్యంలోని T-Diagnostics కార్యక్రమం నిమిత్తం, ప్రభుత్వ ఆరోగ్య సంస్థల నుండి ల్యాబొరేటరీ పరీక్షల కోసం నమూనాల సేకరణ మరియు రవాణా చేయుటకు అవసరమైన నమూనా సేకరణ వాహనాలు (06) (Sample Collection Vehicles) అద్దె ప్రాతిపదికన ఏజెన్సీల నుండి సంక్షిప్త టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి.
**టెండర్ వివరాలు:**
. **పని పేరు:** T-Diagnostics నమూనా సేకరణ వాహనాలు.
. **టెండర్ పత్రాల లభ్యత: తేదీ:** 22.01.2026 నుండి.
. **టెండర్ సమర్పణకు చివరి తేదీ:** 02.02.2026.05.00pm వరకు.
. **అర్హత ప్రమాణాలు, షరతులు:** టెండర్ పత్రంలో పొందుపరచబడ్డాయి.
సంపూర్ణ వివరాలు అధికారిక టెండర్ పత్రంలో పొందుపరచబడ్డాయి. సంబంధిత అధికారి ఎటువంటి కారణం తెలుపకుండా టెండర్‌ను రద్దు చేసే అధికారం కలిగి ఉంటారు.
*"పూర్తి వివరాల కోసం వికారాబాద్ జిల్లా IDOC భవనంలోని రెండవ అంతస్తు, గది సంఖ్య S-17లో ఉన్న జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని సంప్రదించగలరు."*
జారీ చేసిన వారు,
సం/- జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (DM&HO)
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, వికారాబాద్.
తేదీ: 20.01.2026.
DIPR R.O. No. : 14162-PP/CL/ADVT/1/2025-26, Date: 21-01-2026

### ఎఐ డేటా సెంటర్లు, సెమీకండక్టర్,

# ఇవి తయారీ రంగాలపై టాటా గ్రూప్ ఆసక్తి

### టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ
### మేడారం, వేములవాడ, భద్రాచలం వంటి ఆలయ ప్రాంతాల్లో హోటళ్ల ఏర్పాటుపై చర్చలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎఐ డేటా సెంటర్లు, సెమీకండక్టర్, ఈవి తయారీ రంగాల్లో తెలంగాణలో కొత్త పరిశ్రమలు నెలకొల్పే అవకాశాలపై టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ఆసక్తి ప్రదర్శించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో హోటళ్లు, రిసార్టులు ఏర్పాటు చేసే అంశంపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. మేడారం, వేములవాడ, భద్రాచలం వంటి ఆలయ ప్రాంతాల్లో హోటళ్ల ఏర్పాటుకు టాటా గ్రూప్ ఆసక్తి చూపింది. శ్రీశైలం రహదారి వెంబడి అంతర్జాతీయ స్థాయి రిసార్ట్ ఏర్పాటుపై సానుకూలంగా స్పందించింది. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ విజన్–2047, ప్రభుత్వ విధానాలు, రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని టాటా చైర్మన్‌కు వివరించారు. తెలంగాణ రాష్ట్రం రూపొందించిన దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను వివరించారు.



**హైదరాబాద్‌లో తొలి ‘స్విస్ మాల్’**
హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలిసారి ‘స్విస్ మాల్’ ఏర్పాటు చేయాలనే ఆలోచనను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిపాదించగా, స్విట్జర్‌లాండ్‌లోని వాడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి క్రిస్టెల్ లూసియర్ బ్రోడార్ నేతృత్వంలోని బృందం వెంటనే సానుకూలంగా స్పందించింది. క్రీడా శిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధిలో కలిసి పనిచేయవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఎఫ్) 2026 సమావేశం సందర్భంగా దావోస్‌లో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, స్విట్జర్లాండ్‌లోని వాడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి క్రిస్టెల్ లూసియర్ బ్రోడార్‌తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ‘తెలంగాణ రైజింగ్–2047’ విజన్‌ను స్విస్ ప్రతినిధులకు వివరించారు. సంస్కృతి, విద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ రంగాలలో ముఖ్యంగా హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, క్రీడల విభాగాలలో పరస్పర సహకారానికి అవకాశాలపై లీడర్లు అభిప్రాయాలు పంచుకున్నారు.

**తెలంగాణలో ఎబి ఇన్‌బెవ్ యూనిట్ విస్తరణకు సిద్ధం**
ప్రపంచంలో అతిపెద్ద బీరు తయారీ సంస్థగా పేరుగాంచిన ఎబి ఇన్‌బెవ్ తెలంగాణలో ఇప్పటికే ఉన్న తన తయారీ యూనిట్‌ను విస్తరించేందుకు భారీగా పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఎఫ్) 2026 సదస్సులో భాగంగా బుధవారం దావోస్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ‘తెలంగాణ రైజింగ్’ ప్రతినిధి బృందం ఎబి ఇన్‌బెవ్ చీఫ్ లీగల్ అండ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ జాన్ బ్లడ్‌తో సమావేశమయ్యారు. తెలంగాణలో ప్రస్తుతం రెండు తయారీ యూనిట్లు నిర్వహిస్తున్న ఎబి ఇన్‌బెవ్ సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తోంది. రాష్ట్రానికి కొత్త పెట్టుబడి లభించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

**టాస్క్, స్కిల్ యూనివర్సిటీ గొప్ప ఆలోచనలు**
తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ యువతకు ఉద్యోగాలు వచ్చేలా నైపుణ్యాలు నేర్పించాలనే ఉద్దేశంతో ప్రారంభించిందని, ఇది చాలా గొప్ప ఆలోచన అని సిస్కో గ్లోబల్ ఇన్నోవేషన్ ఆఫీసర్ గై డీడ్రిచ్ ప్రశంసించారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఎఫ్) 2026 సమావేశాల సందర్భంగా దావోస్‌లో బుధవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ‘తెలంగాణ రైజింగ్’ బృందం సిస్కో సంస్థ ప్రతినిధులతో సమావేశమైంది. సమావేశంలో తెలంగాణలో సిస్కో చేపట్టనున్న పనులపై చర్చించారు. సిస్కో సీనియర్ అధికారి గై డీడ్రిచ్ మాట్లాడుతూ 2025 మార్చిలో టాస్క్, స్కిల్ యూనివర్సిటీతో కుదిరిన ఒప్పందాల తర్వాత ఆశించిన ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎంతో ధైర్యంగా ప్రారంభించిన గొప్ప ఆలోచన టాస్క్ అని ఆయన కొనియాడారు. ఈ అవగాహన ఒప్పందాల ద్వారా యువతకు కంప్యూటర్ నెట్వర్క్‌లు, సైబర్ సెక్యూరిటీ, ఆధునిక టెక్నాలజీలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణతో విద్యార్థులు చదువు పూర్తికాగానే ఉద్యోగాలు సంపాదించుకునే స్థాయికి చేరుకుంటారని అధికారులు తెలిపారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణను భవిష్యత్తులో ఉద్యోగాలు, పరిశ్రమలు, పెట్టుబడులు ఎక్కువగా వచ్చే రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.

## ఫిబ్రవరి 10 తర్వాత జిహెచ్‌ఎంసి బాధ్యత అధికారులదే

### మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పాలకవర్గం గడువు ఫిబ్రవరి10తో ముగియనుండటంతో ఆ తర్వాత బాధ్యత అంతా అధికారులదే హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలైనా అభివృద్ధి కార్యక్రమాలైన ఇకపై అధికారులే చూసుకోవాల్సి ఉంటుందని దిశా నిర్దేశనం చేశారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మి,డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత,జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ , ఆర్‌టిసిఎండీ నాగిరెడ్డి , అడిషనల్ కమిషనర్లు ,జోనల్ కమిషనర్లు డిప్యూటీ కమిషనర్లు ,వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. జిహెచ్‌ఎంసీ లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం ,వార్డుల విభజన అనంతరం జరిగిన ఈ తొలి సమీక్షా సమావేశంలో జిహెచ్‌ఎంసిలోని అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులు, శానిటేషన్ , ఎస్‌ఆర్‌డిపి ప్రాజెక్ట్ పనుల పురోగతి తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. హైదరాబాద్ క్లీన్ అండ్ గ్రీన్ సిటీ ప్రణాళికల్లో భాగంగా పలువురు ఇంజనీరింగ్ అధికారులకు ప్రత్యేక విధులు కేటాయింపు, కార్యచరణ పై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అధికారులు సామాజిక బాధ్యతతో పనిచేయాలని సూచించారు. హైదరాబాదులో ఉన్న ప్రతి మహిళ సంఘంలో సభ్యురాలు చేర్చడంతో పాటు వారిని అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. హైదరాబాదులో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని దీని పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి గల్లీకి ఆర్టీసీ బస్సు వెళ్లాలన్నారు. నగరంలో వీధిలైట్లు మధ్యాహ్నం వెలుగుతున్నాయి, ఈ పద్ధతి మారాలని, అధికారులతో సరైన విధానంలో పని చేయించుకునే బాధ్యత కమిషనర్‌దేనని మంత్రి స్పష్టం చేశారు. గ్రేటర్ పరిధి మరింత విస్తరించడంతో ప్రశ్నించే వాళ్ళ సంఖ్య పెరుగుతుంది కాబట్టి జవాబు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలన్నారు.కార్పొరేషన్ విభజన ఉంటుందా లేదా అనేది ఫిబ్రవరి 10 తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

## నిరాధార నిందారోపణలు ప్రజలు హర్షించరు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అధికారంలో ఉన్న వారిపై నిరాధారమైన నిందారోపణలు చేస్తూ బురదజల్లితే ప్రజలు హర్షించారని .మాజీ మంత్రులు హరీష్ రావు , కెటిఆర్ గుర్తేరింగితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ హితువు పలికారు. మైన్స్ పై వారు చేసిన వ్యాఖ్యలపై తాము బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన ప్రకటించారు. గత 10 ఏళ్లలో సింగరేణి లో బిఆర్‌ఎస్ వారు చేసిన అక్రమాలు పై మాజీ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత తమకంటే అనేక సార్లు చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వం దృష్టి మరల్చుడానికి బిఆర్‌ఎస్ నేతలు ప్రయత్నం చేస్తున్నరన్నారు. హరీష్ రావు లేఖ రాస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశాల నుండి వచ్చిన తర్వాత 2014 నుండి 2026 జనవరి వరకు ఇచ్చిన గనులపై మేము విచారణ చేపట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో సింగరేణిలో వెంకటేష్ ఓపెన్ కాస్ట్ కాంట్రాక్ట్ టెండర్ తీసుకున్నారని, కాంగ్రెస్ హయాంలో బంధుత్వం ఎలా హిల్ట్ పాలసీ మీద ఇలాగే అనేక ఆరోపణలు చేశారని .. అసెంబ్లీ లో చర్చ పెడితే మాట్లాడకుండా తప్పించుకున్నరన్నారు.

కృష్ణ జలాల మీద సెంటిమెంట్ రాజేసి రాజకీయ రంగు చేసే ప్రయత్నం చేస్తే శాసన సభ వేదికగా జవాబు చెప్పలేక ముఖం చాటేసి ఎలాంటి విబేధాలు లేకున్న శాసన సభ బహిష్కరించారన్నారు.టెలిఫోన్ ట్యాపింగ్ కి సంబంధించి కేటీఆర్ సోదరి , హరీష్ రావు మరదలు కవిత అడిగిన ప్రశ్నకు ముందు వారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### మున్సిపల్ ఎన్నికల ఎఫెక్ట్..

## 47 మంది కమిషనర్ల బదిలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో రానున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం భారీగా మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ల బదిలీలకు సంబంధించింది పురపాలక పరిపాలన శాఖ కార్యదర్శి టికె శ్రీదేవి జీవో నెం.87ను విడుదల చేశారు. సొంత జిల్లాల్లో పని చేస్తున్న వారు, ఒకేచోట సుదీర్ఘ కాలం పనిచేస్తున్న అధికారులను పరిపాలనా కారణాలతో పాటు పదోన్నతులపై మొత్తం 47 మందిని బదిలీ చేశారు.అందులో సివిఎన్‌రాజు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్3) నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. జి.రాజు క్యాతనపల్లి నుంచి ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్గా నియమితులయ్యారు. ఇక ముసాబ్ అహ్మద్ నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్గా బి. శ్రీనివాస్ ఆలేరు నుంచి హుజూర్నగర్ మున్సిపల్ కమిషనర్గా, డి. జైత్రమ్ పదోన్నతిపై జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్గా బదిలీ అయ్యారు. చివరగా బి.శరత్ చంద్ర జీహెచ్‌ఎంసీ (జిహెచ్‌ఎంసి) నుంచి ప్రమోషన్‌పై నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళ్లనున్నారు. బదిలీ అయిన అధికారులు వెంటనే తమకు కేటాయించిన కొత్త ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలని జాయింట్ డైరెక్టర్ నారాయణ రావు ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. విధుల్లో చేరడంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రస్తుత నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# హరీశ్ రావు బాధితుడా? నిందితుడా? ..

### -ఫోన్ ట్యాపింగ్ కేసులో అనూహ్య పరిణామం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత ప్రభుత్వంలో హరీశ్ రావుపై నిరంతరం నిఘా ఉందనే ప్రచారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. కేసు దర్యాప్తులో ఎప్పటికప్పుడు కొత్త ట్విస్టులు ఉత్కంఠ రేపుతున్నాయి. తాజాగా మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్ రావు విచారణతో ఈ కేసులో మరో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. గత ప్రభుత్వంలో మంత్రిగా కీలకంగా వ్యవహరించిన హరీశ్ రావుపై దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాపింగ్ చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో160 సిఆర్‌పిసి కింద హరీశ్ రావుకు సిట్ నోటీసులు ఇవ్వగా మంగళవారం ఆయన విచారణకు హాజరయ్యారు. దాదాపు 7 గంటల పాటు సాగిన ఈ విచారణలో మీ ఫోనే ట్యాపింగ్‌కు గురైందని సిట్ అధికారులు హరీశ్ రావుకు వివరించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. బిఆర్‌ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలు ఉండగా ఇప్పుడీ తాజా ట్విస్ట్ తో ఈ కేసులో హరీశ్ రావు బాధితుడా లేక నిందితుడా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

**ఆధారాలు ముందు పెట్టిన సిట్.. :** విచారణ సందర్భంగా పలు కీలక విషయాలపై హరీశ్ రావును ప్రశ్నించిన సిట్ అధికారులు.’2018 శాసనసభ ఎన్నికల తర్వాత మీతో పాటు మీ అనుచరులు, బిఆర్‌ఎస్‌లోని మరో సీనియర్ నేత ఫోన్లు ఏడాది పాటు నిఘా ఉంచారనే విషయాన్ని సిట్ అధికారులు హరీశ్ రావు దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ఈ విషయంపై తొలుత ఖంగుతిన్న హరీశ్ రావు ఆ తర్వాత నేను నమ్మను అని బదులిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో నిందితులు ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు, శ్రవణ్ రావులతో ఉన్న లింకేంటి అనే విషయాన్ని ఆరా తీసినట్లు తెలిసింది. 2023 నవంబర్ 30న శాసనసభ ఎన్నికలకు ముందురోజు వరకు శ్రవణ్ రావు ఇచ్చిన ఫోన్ నంబర్లను ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు ట్యాప్ చేయించడానికి కారణం ఏమిటని ప్రశ్నించగా హరీశ్ రావు సరైన సమాధానాలు ఇవ్వలేదని తెలిసింది. ఈ క్రమంలో శ్రవణ్ రావు, ప్రణీత్ రావు ల మధ్య జరిగిన చాటింగ్ స్క్రీన్ షార్టులను హరీశ్ రావు ముందుంచి ప్రశ్నించగా తనకు ఆ విషయాలు తెలియదని సమాధానం చెప్పినట్లు సమాచారం. సిట్ ప్రశ్నలకు సమాధానాల సమయంలో చాలా వరకు గుర్తులేదు. తెలియదు, నేను నమ్మను అనే పదాలతో బదులిచ్చినట్లు తెలుస్తోంది.

## త్వరలో హరీశ్‌రావు అనుచరులకు నోటీసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ కీలక మలుపులు తిరుగుతోంది. ఈ క్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు విచారణ అనంతరం దర్యాప్తును అధికారులు మరింత వేగవంతం చేశారు.ఈ కేసులో ఎ1గా ఉన్న నిందితుడు ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు బెయిల్ కేసు సుప్రీంకోర్టు మార్చి నెలకు వాయిదా వేయడంతో సిట్ అధికారులు అప్పటి వరకు ఈ కేసులో మిగిలిన తతంగం పూర్తి చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే హరీష్‌రావును విచారించారు. హరీష్‌రావు తన కుమారుడు అమెరికా పర్యటన నేపథ్యంలో బుధవారం విచారణ జరపలేదు. మరోసారి హరీష్‌రావును విచారిస్తామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ తెలిపారు. అలాగే ఆరుగురు హరీష్‌రావు అనుచరులకు త్వరలో నోటీసులు జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.



## తెలంగాణలో 50 కులాలను సంచార జాతులుగా గుర్తిస్తూ ఆమోదం

### వెల్లడించిన రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో 50 కులాలను సంచార జాతులుగా గుర్తిస్తూ, ప్రభుత్వ సిఫారసుల నివేదికను కమిషన్ ఆమోదించిందని, అలాగే ఈ కులాలకు సంబంధించిన సర్టిఫికేట్ జారీలో చేపట్టవలసిన మార్పులు, చేర్పుల గురించి కూడా ప్రభుత్వ సిఫారసులను ఆమోదించిందని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వెల్లడించారు. రాష్ట్ర బిసి కమిషన్ సమావేశం ఆయన అధ్యక్షతన బుధవారం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, బాల మాయ దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుతున్న సీడ్ పథకానికి అర్హులకు కావాల్సిన డిఎన్‌డి సర్టిఫికేట్ జారీ విధివిధానాలపై సమావేశంలో చర్చించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రభుత్వ సంస్థల్లో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వివరాల్లో ఫైనాన్స్ డిపార్ట్మెంట్ మినహా మిగతా అన్ని శాఖల నుండి కమిషన్‌కు సమాచారం అందింది, కాబట్టి ఈ సమాచారాన్ని క్రోడికరించి ఉద్యోగ రంగంలో బిసిల స్థితిగతులను అంచనా వేయడానికి ఉపయోగించనున్నట్లు జి.నిరంజన్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాస రావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్ హాజరయ్యారు.

## రెండు రైళ్లకు శాశ్వతంగా అదనపు కోచ్‌లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణికుల రద్దీని తగ్గించి మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించే దిశగా దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రెండు రైళ్లకు శాశ్వతంగా అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. సికింద్రాబాద్ – అనకాపల్లి – సికింద్రాబాద్ స్పెషల్ (07055–07056)
ఈ రైలుకు ప్రస్తుతం ఉన్న కోచ్‌లతో పాటు మూడు అదనపు 3AC కోచ్‌లను శాశ్వతంగా జత చేశారు. దీంతో ఈ రైలు మొత్తం కోచ్‌ల సంఖ్య 19 నుంచి 22కు పెరిగింది. ఈ మార్పు సికింద్రాబాద్ నుంచి ఈ నెల 22న, అనకాపల్లి నుంచి 23న నుంచి అమల్లోకి రానుంది. ఇక సికింద్రాబాద్ – విశాఖపట్నం – సికింద్రాబాద్ దురంతో ఎక్స్‌ప్రెస్ (22204–22203)
ఈ రైలును కూడా శాశ్వతంగా అదనపు కోచ్‌లతో బలోపేతం చేశారు. ఈ సౌకర్యం సికింద్రాబాద్ నుంచి 24న, విశాఖపట్నం నుంచి 25 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది.
ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే సేవలను నిరంతరం మెరుగుపరుస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ తెలిపారు. ఈ నిర్ణయంతో ముఖ్యంగా ఏసీ ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుందని ఆయన పేర్కొన్నారు.

### మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే

## జిల్లాల తొలగింపునకు అనుమతి ఇచ్చినట్లే : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్‌కు ఓటు వేస్తే జిల్లాల తొలగింపునకు ప్రజలు అనుమతి ఇచ్చినట్లేనని బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారాక రామరావు అన్నారు. ఈ అంశాన్ని ప్రజలు గుర్తించి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని ఆయన కోరారు. తెలంగాణ భవన్‌లో బుధవారం కెటిఆర్ మీడియా ప్రతినిధులతో ఇష్టా గోష్టిగా మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో ‘రాము’ ఉన్నాడు, ‘రెమో’ ఉన్నాడని, అందుకే ఎప్పుడు రెండు నిర్ణయాలుంటాయన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం మున్సిపాల్టీల వారీగా పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించనున్నామని, ఉమ్మడి జిల్లాలకు చెందిన వారినే బాధ్యతల్లో పెడతామని కేటీఆర్ తెలిపారు. రేపు లేదా ఎల్లుండి ఇన్‌చార్జ్‌లను ప్రకటిస్తామని చెప్పారు. ఇప్పటికే జిల్లాల వారీగా సన్నాహక సమావేశాలు పూర్తయ్యాయని, ఎన్నికలకు పార్టీ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని వెల్లడించారు.పంచాయతీ ఎన్నికల్లో 40 శాతం సర్పంచ్ స్థానాలు గెలవడం సామాన్యమైన విషయం కాదన్నారు. జెడ్‌పిటిసి, ఎంపిటిసిఎన్నికలు నిర్వహిస్తారని తాము అనుకోవడం లేదని, అయినప్పటికీ మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ అత్యంత సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. సికింద్రాబాద్‌లో స్థానికులు చేస్తున్న ఉద్యమానికి సిఎం జవాబు ఇవ్వాలన్నారు. చాలా చోట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన ఉందని, కొత్త జిల్లాలు చేసిన పట్టణాల్లో జిల్లాలు ఎత్తేస్తారన్న భావన ప్రజల్లో బలంగా ఉందని పేర్కొన్నారు. ‘ఫార్ములా–ఈ’ విషయంలో గ్రీన్ కోకు లబ్ధి చేకూర్చామంటూ ఆరోపణలు చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి అదే సంస్థలో చర్చలు జరుపుతున్నారని ఇది కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.

**సింగరేణిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి :**
సింగరేణిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కెటిఆర్ మరోసారి డిమాండ్ చేశారు. ఎప్పటి నుంచి విచారణ చేసినా తమకు అభ్యంతరం లేదని, సింగరేణిపై మంత్రులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. సిట్టింగ్ జడ్జిని వేయించి, సింగరేణి మీద మీరు ఎప్పటి నుంచి చేస్తామంటే అప్పటి నుంచి విచారణ చేయండి మాకు అభ్యంతరం లేదన్నారు. 2014 నుంచి విచారణ చేయండి. కాకపోతే ’విజిట్ సైటేషన్ సర్టిఫికేట్’ అనే పనికిమాలిన నిబంధన ఎందుకు పెట్టారో చెప్పాలని డిమాండ్‌చేశారు.



## తెలంగాణ ప్రీమియర్ లీగ్ నిర్వహించేది టిసిఎనే

### హెచ్‌సిఎకు అవకాశం లేదన్న గురువారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) యువ క్రికెటర్ల జీవితాలతో ఆడుకుంటోందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి మండిపడ్డారు. తెలంగాణ ప్రీమియర్ లీగ్ నిర్వహించేది మాత్రమేనని, టి20 లీగ్ నిర్వహించే అధికారం హెచ్‌సిఎకు లేదని చెప్పారు. హైదరాబాద్‌లో బుధవారం మీడియా సమావేశంలో టిసిఎ వైస్ ప్రెసిడెంట్ పి విజయ్ చందర్ రెడ్డి, అడ్వైసరీ మెంబర్ గోపాల్ శర్మ, టెక్నికల్ కమిటీ మెంబర్ చిత్తరంజన్, సోషల్ మీడియా ఇంఛార్జ్ వరుణ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ..ఒకవేళ రూల్స్ కు విరుద్ధంగా హెచ్‌సిఎ తెలంగాణ టి20 లీగ్ చేస్తే డిస్ క్వాలిఫై అవుతారని హెచ్చరించారు. మంత్రి వివేక్ కు హెచ్ సిఎతో ఏం పని ఉందని ప్రశ్నించారు. మంత్రిగా ఉంటూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని ఫైర్ అయ్యారు. కావాలంటే వివేక్ తన మంత్రి పదవికి రాజీనామా చేసి క్రికెట్ టోర్నీలు ఆడించుకోవచ్చని సూచించారు.బిసిసిఐ గుర్తింపు లేకుండా కాకా వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారన్నారు. దీనిలో ఆడిన క్రికెటర్లపై చర్యలు తీసుకునే అధికారంబిసిసిఐకి ఉంటుందన్నారు.

### అజ్ఞాతం వీడిన మావోయిస్టులకు

## తెలంగాణ పోలీసుల అండ

### 2025లో 576 మంది లొంగుబాటు

### జనజీవన స్రవంతిలోకి రావాలని మరోసారి పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మావోయిస్టు కేంద్ర కమిటీలో ఉన్న తెలంగాణ నాయకులను జనజీవన స్రవంతిలోకి రావాలని... ఇచ్చిన మాట ప్రకారం పునరావాసం కల్పిస్తామని మరోసారి తెలంగాణ పోలీసులు విజ్ఞప్తి చేశారు. అజ్ఞాతం వీడుతున్న మావోయిస్టులకు జనజీవన స్రవంతిలో స్థిరపడే దిశగా తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అండగా నిలుస్తుంది. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టుల లొంగుబాట్లను ప్రోత్సహించే విధంగా అడుగులు వేస్తుంది. ఇప్పటికే లొంగిపోయి గుర్తింపు లేక ఇబ్బందులు పడుతున్న వారికి ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు ఖాతాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పునరావాస చర్యలను వేగవంతం చేసింది. లొంగిపోయిన మావోయిస్టుల పునరావాస కార్యక్రమాలన్నింటినీ తెలంగాణ నిఘా విభాగానికి చెందిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి) నేరుగా పర్యవేక్షిస్తోంది. 1980లో పీపుల్స్ వార్ (ప్రస్తుత సిపిఐ–మావోయిస్ట్) ఆవిర్భవించిన నాటి నుంచి ఎన్నడూ లేనివిధంగా గత ఏడాది ఏకంగా 576 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరికి పునరావాస ప్యాకేజీలో భాగంగా స్వగ్రామాల్లో నివాస ధ్రువపత్రాలు ఇప్పించి, ఆధార్ నమోదు చేయిస్తున్నారు. అనంతరం పాన్ కార్డు, బ్యాంకు ఖాతాలు తెరిపించి, రివార్డు సొమ్మును అదే ఖాతాల్లో జమ చేస్తున్నారు. స్థానిక రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో మాట్లాడి అవకాశం ఉన్న వారికి ఇళ్ల స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకుంటున్నారు. అనారోగ్య కారణాలతో జనజీవన స్రవంతిలోకి వచ్చిన పలువురికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు అందించారు. పోరు వద్దు – ఊరు ముద్దు. అజ్ఞాతం వీడి జనంలోకి రండి. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పునరావాసం కల్పిస్తాం అని మిగిలిన మావోయిస్టులను రాష్ట్ర పోలీస్ శాఖ సూచించింది.

## హరీశ్‌రావు చిల్లర రాజకీయాలు మానుకోవాలి..

### టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసుపై మాజీ మంత్రి హరీష్‌రావు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాడని టిపిసిసి మీడియా కమిటి చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ పోలీసులు ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండు కేసులు నమోదు చేశారని ఒకటి కాంగ్రెస్ నేత చక్రదర్‌గౌడ్ పెట్టిన కేసు, మరోకటి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) అధికారులు పెట్టిన కేసు అని గుర్తు చేశారు. అయితే చక్రదర్‌గౌడ్ పెట్టిన కేసులో మాత్రమే సుప్రీంకోర్టు హరీష్‌రావుకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్ఐబి పెట్టిన కేసు ఇంకా విచారణ దశలోనే ఉందని ఈ కేసులోనే హరీష్‌రావును సిట్ అధికారులు నోటీసులు జారీ చేసి విచారించారన్నారు. వాస్తవాలు ఇలా ఉండగా తనకు ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిదని హరీష్‌రావు అనడం అవివేకమన్నారు.



### పురుషులకు జిరో టికెట్ నేపంతో

## కండక్టర్లను ఉద్యోగం నుంచి తొలగించడం సరికాదు : ఆర్‌టిసి జెఎసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి బస్సులో పురుషులకు జిరో టికెట్ ఇచ్చారనే నేపంతో చెకింగ్ అధికారులు కనీసం మానవత్వం కోణంలో ఆలోచించకుండా కేసు లు రాయడం దీంతో కండక్టర్లను ఉద్యోగాలను నుంచి తొలగించడం సరికాదని ఆర్‌టిసి ఎండికి ఆర్‌టిసి జెఎసి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు జిరో టికెట్ కేసుల పేరుతో కఠిన శిక్షలు వేస్తే కండక్టర్లను ఉద్యోగాల నుంచి తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్‌టిసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి. యాదగిరి ఆర్‌టిసి ఉన్నతాధికారులు వినతి పత్రం అందజేశారు. ఈ ఇలాంటి శిక్షల కారణంగా మానసిక క్షోభకు గురైన పలువురు కండక్టర్లు ప్రాణాలు కోల్పోతుండగా మరికొన్ని కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో రోడ్లపై పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాలక్ష్మి జీరో టికెట్ వలన అనుకోకుండా జరిగే పొరపాటులకు కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించకుండా సంబందిత అధికారులకు ఆర్‌టిసి ఎండి తగిన ఆదేశాలు, మార్గదర్శలు ఇచ్చి కార్మికులకు భరోసా కలిపించాలని ఈ సందర్భంగా వారు కోరారు. అనంతరం ఇడి (ఒ) మునిశేఖర్ గారిని స్వయంగా కలిసి ఈ అంశం గురించి వివరించారు. దీంతో ఈ అంశాన్ని ఎండి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని జెఎసి నేతలకు హామీ ఇచ్చారు.

## ప్రయాగ్‌రాజ్‌లో కూలిన ఐఎఎఫ్ టూ సీటర్ విమానం



**ప్రయాగ్‌రాజ్:** భారతీయ వైమానిక దళానికి చెందిన టూ సీటర్ మైక్రోలైట్ విమానం కుప్పకూలింది. యుపిలోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఆ విమానంలో ఉన్న పైలెట్‌తో పాటు సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. మైక్రోలైట్ విమానాన్ని .. సాధారణంగా శిక్షణ, బర్డ్ రెక్కీ, సర్వే కోసం వినియోగిస్తుంటారు. రెగ్యులర్ సొరైటీలో భాగంగా ఆకాశంలో ఎగురుతున్న సమయంలో విమానం కూలినట్లు అధికారులు చెబుతున్నారు. ఓ చెరువులో అది కూలినట్లు గుర్తించారు. ఆ ప్రాంతాన్ని సీజ్ చేశారు. ఘటన పట్ల దర్యాప్తు మొదలుపెట్టారు. పప్పామావు, సంగం ప్రాంతాల్లో సొరైటీ నిర్వహిస్తున్నప్పుడు విమానంలో సాంకేతిక లోపం తలెత్తినట్లు ప్రయాగ్‌రాజ్ డిసిపి మనీశ్ శాండిలయ్య తెలిపారు. పైలెట్లు సురక్షితంగా బయటకు వచ్చారని, జార్జ్‌టౌన్ పోలీసు ఏరియాలోని కెపి కాలేజీ వద్ద ఉన్న ఓ చెరువులో ఆ విమానాన్ని దించినట్లు ఆయన చెప్పారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల సహకారంతో సురక్షితంగా పైలెట్లను రక్షించారు.

## 'ఎంజి నరేగా'పై నేడు కాంగ్రెస్ చర్చావేదిక

### దేశ వ్యాప్తంగా పాల్గొననున్న కార్మికులు



**న్యూఢిల్లీ :** 'ఎంజి నరేగా' స్థానంలో కొత్త పథకాన్ని తీసుకువచ్చి ప్రజల హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విరుచుకుపడింది. ఈ అంశంపై ఒక చర్చావేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు వారి పని ప్రదేశాల నుండి పిడికెడు మట్టిని తీసుకవచ్చి కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పేర్కొంది. 'ఎంజి నరేగా బచావో మోర్చా' నిర్వహించే జాతీయ సమావేశం గురువారం జరుగుతుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రసంగిస్తారన్నారు. అయితే ఈ సమావేశానికి ముందు బుధవారం నాడు దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు వారి వారి పని ప్రదేశాల నుండి మట్టితో ఢిల్లీకి వచ్చినట్లు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. కార్మికులు తమ పని ప్రదేశాల నుండి మట్టిని సేకరిస్తున్న వీడియో క్లిప్‌లను షేర్ చేశారు. రచన్నాత్మక్ కాంగ్రెస్ చైర్పర్సన్ సందీప్ దీక్షిత్ మాట్లాడుతూ బిజెపి ఎంజి నరేగా స్థానంలో కొత్త చట్టం 'విబి–జి రామ్ జి'ని తీసుకువచ్చిందని, దానిని కాంగ్రెస్ నిరంతరం వ్యతిరేకిస్తోందన్నారు. అనేక రాష్ట్రాలు, జిల్లాల్లో, 'ఎంజి నరేగా బచావో సంగ్రామ్' జరుగుతోందని ఆయన చెప్పారు. కొవిడ్ కాలంలో నరేగా పథకం కోట్లాది మందికి జీవనాడిలా మారిందని, ఈ పథకం ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకుందన్నారు. ఈ సందర్భంలో, రైతులు, కార్మికుల హక్కుల కోసం చాలా కాలంగా పనిచేస్తున్న వివిధ సంస్థలతో తాము చర్చలు జరిపామని దీక్షిత్ విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ చర్చలన్నింటి నుండి ఒకే ఒక్క విషయం స్థిరంగా బయటపడిందని, ప్రజల హక్కులు లాక్కోబడుతున్నాయన్నారు. నరేగాపై చర్చల కోసం దేశవ్యాప్తంగా కార్మికులు గురువారం వస్తున్నారని ఆయన అన్నారు. 'వీరు తమ గ్రామాల్లో రోడ్లు, పాఠశాలలు, పంచాయతీ భవనాలు, చెరువులు, నీటి సంరక్షణ ప్లాంట్లను నిర్మించడానికి నరేగా పథకాన్ని ఉపయోగించారు. ఈ ప్రజలందరూ తమ కృషి, నరేగా మద్దతుతో దేశ నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషించారు' అని దీక్షిత్ చెప్పారు. పంచాయతీలు స్వయంగా వారి శ్రేయస్సు, అభివృద్ధి కోసం నిర్ణయించుకుని పనిచేశాయని, ప్రభుత్వం వారికి అండగా నిలబడిందని, మోదీ ప్రభుత్వం ఈ మొత్తం ప్రక్రియను నాశనం చేస్తోందని ఆయన విమర్శించారు. గురువారం ఉదయం ఢిల్లీలోని జవహర్ భవన్‌లో ఒక కార్యక్రమం నిర్వహించామని, దీనికి దేశంలోని నలుమూలల నుండి నరేగాతో సంబంధం ఉన్న వ్యక్తులు వస్తున్నారని దీక్షిత్ అన్నారు.

### ఆరావళీ మైనింగ్ సమస్యలపై సమగ్ర పరిశీలనకు...

## డొమైన్ నిపుణులతో కమిటీ ఏర్పాటు

- సుప్రీంకోర్టు వెల్లడి • 4వారాల్లో పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తల పేర్లు సూచించాలని సొలిసిటర్ జనరల్, అమికస్ క్యూరీలకు ఆదేశం



**న్యూఢిల్లీ :** అక్రమ మైనింగ్ వల్ల కోలుకోని నష్టం కలుగుతోందని గమనించిన సుప్రీంకోర్టు ఆరావళీలోని మైనింగ్, సంబంధిత సమస్యలపై సమగ్రమైన, సమగ్ర పరిశీలన చేపట్టడానికి డొమైన్ నిపుణులతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని బుధవారం అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, విపుల్ ఎం.పాంచోలీ త్రిసభ్య ధర్మాసనం నాలుగు వారాలలో మైనింగ్ రంగంలో అనుభవజ్ఞులైన పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తల పేర్లను సూచించాలని సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి, అమికస్ క్యూరీ కె.పరమేశ్వర్‌లను ఆదేశించింది. తద్వారా అంశాలను పరిశీలించడానికి ఒక నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేయవచ్చని ధర్మాసనం తెలియజేసింది. ఆ కమిటీ సుప్రీంకోర్టు మార్గదర్శకం, పర్యవేక్షణ కింద పని చేయనున్నదని బెంచ్ వివరించింది. ఆరావళీ కొండలు, శ్రేణుల ఏకరీతి నిర్వచనాన్ని అంగీకరించే నవంబరు 20నాటి ఆదేశాలను నిలుపుదల చేస్తూ అత్యున్నత న్యాయస్థానం తన ఉత్తర్వును కూడా పొడిగించింది. విచారణ సందర్భంగా, చెల్లా చెదురుగా ఉన్న ప్రదేశాలలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని సుప్రీంకోర్టుకు సమాచారం అందింది. రాజస్థాన్ ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ అటువంటి అనధికార మైనింగ్‌కు ఎలాంటి నష్టం వాటిల్లదని ఇచ్చిన హామీని ధర్మాసనం స్వీకరించింది. ఆరావళీ కొండల నిర్వచనంపై వివాదం నడుమ ఆరావళీ కొండలు, శ్రేణుల నిర్వచనం, అనుబంధ సమస్యలు అనే అంశాన్ని సుప్రీంకోర్టు స్వయంగా స్వీకరించింది. ఆరావళీ యొక్క కొత్త నిర్వచనంపై నిరసనల మధ్య గత ఏడాది డిసెంబరు 29న కోర్టు ఈ ఆరావళీ కొండల ఏకరీతి నిర్వచనాన్ని అంగీకరించి, 100 మీటర్ల ఎత్తు, కొండల మధ్య 500మీటర్ల అంతరం పర్యావరణ పరిరక్షణలో గణనీయమైన భాగం సహా క్లిష్టమైన అస్పష్టతలను పరిశీలించాల్సిన అవసరం ఉందని చెబుతూ తన నవంబరు 20 ఆదేశాలను నిలిపివేసింది. నవంబరు 20న అత్యున్నత న్యాయస్థానం ఆరావళీ కొండలు, శ్రేణుల ఏకరీతి నిర్వచనాన్ని అంగీకరించి, నిపుణుల నివేదిక వెలవడే వరకు ఢిల్లీ, హర్యానా రాజస్థాన్, గుజరాత్‌లలో విస్తరించిన ప్రాంతాలలో కొత్త మైనింగ్ లీజుల మంజూరును నిషేధించింది. ప్రపంచంలోని పురాతన పర్వత వ్యవస్థను రక్షించడానికి ఆరావళీ కొండలు, శ్రేణుల నిర్వచనంపై పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కమిటీ చేసిన సిఫారసులను ఇది ఆమోదించింది. ఆరావళీ జిల్లాలోని స్థానిక భూభాగానికి 100 మీటర్ల ఎత్తు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ఏదైనా భూభాగ రూపాన్ని 'ఆరావళీ కొండ' అని కమిటీ సిఫారసు చేసింది. ఆరావళీ శ్రేణి అనేది ఒకదానికి ఒకటి 500మీటర్ల లోపు రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండల సముదాయం అని సూచిస్తుంది.

## శ్రీనగర్‌లో భద్రత కట్టుదిట్టం



**శ్రీనగర్:** గణతంత్ర దినోత్సవ వేడుకలు సజావుగా, ఘటనలు లేకుండా జరిగేలా చూసేందుకు శ్రీనగర్‌లో పోలీసులు భద్రతా చర్యలను ముమ్మరం చేశారని అధికారులు బుధవారం తెలిపారు. రాబోయే గణతంత్ర దినోత్సవ వేడుకలకు సన్నాహకంగా, ఈ జాతీయ కార్యక్రమాన్ని శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు శ్రీనగర్ పోలీసులు నగరం అంతటా భద్రత, తనిఖీ ప్రోటోకాల్‌లను పెంచారని పోలీసు అధికారులు తెలిపారు. మెరుగైన భద్రతా చట్రంలో భాగంగా, నగరం అంతటా వ్యూహాత్మక ప్రదేశాలలో పోలీసు సిబ్బందిని మోహరించారు. వాహనాలు, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న ప్రత్యేక తనిఖీ కేంద్రాలు, మొబైల్ గస్తీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. నిఘాను కొనసాగించడానికి, ప్రజా శాంతిని దెబ్బతీసే ప్రయత్నాలను నిరోధించడానికి రాత్రి గస్తీ, ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అదనంగా, అనుమానాస్పద కదలికలను పర్యవేక్షించడంపై ప్రత్యేక దృష్టి సారించి, సున్నితమైన ప్రాంతాలకు మరిన్ని సిబ్బందిని నియమించినట్లు అధికారులు తెలిపారు. భద్రతా ప్రణాళికను సమర్థవంతంగా సజావుగా అమలు చేయడానికి సీనియర్ పోలీసు అధికారులు వ్యక్తిగతంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వెరిఫికేషన్, తనిఖీ ప్రక్రియల సమయంలో పోలీసులు సాధారణ ప్రజల సహకారాన్ని అభ్యర్థించారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలను సమీపంలోని పోలీస్ స్టేషన్ లేదా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు వెంటనే నివేదించమని నివాసితులను ప్రోత్సహిస్తున్నారు.

## బెంగాల్‌లో రోడ్డెక్కిన ఆశా కార్యకర్తలు

### నెలవారీ గౌరవ వేతనం పెంపు, బీమా వర్తింపజేయాలని డిమాండ్



**కోల్‌కతా:** నెలవారీ గౌరవ వేతనం పెంపు, బీమా వర్తింపు సహా పలు డిమాండ్లు నెరవేర్చాలని పశ్చిమ బెంగాల్‌లో ఆశా కార్యకర్తలు రోడ్డెక్కారు. రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యాలయమైన 'స్వస్త్య భవన్‌కు నిర్వహించ తలపెట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. కోల్‌కతాలోని ఎస్ల్పనేడ్, సాల్ట్ లేక్‌లోని కీలక రహదారులను బుధవారం వేలాది మంది ఆశా కార్మికులు దిగ్బంధించారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన నిరసనకారులు ఉదయం సీల్దా, హౌరా రైల్వే స్టేషన్ల నుండి బయటకు వస్తుండగా వారిని అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, సుమారు 1,000 మంది గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (ఆశా) తరువాత సాల్ట్ లేక్‌లోని ఎస్ల్పనేడ్, కరుణమోయి వద్ద సమావేశమై మార్చ్‌ను తిరిగి ప్రారంభించడానికి ప్రయత్నించారు,. కానీ పోలీసులు మళ్ళీ వారిని అడ్డుకున్నారని వారు తెలిపారు. మౌలాలి, సీల్దాలోని ప్రాచి సినిమా, బౌబజార్‌తో సహా అనేక ప్రదేశాలలో పోలీసులు నిరసనకారులను అడ్డుకున్నారు. వారి మధ్య దీంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయం 'స్వస్థ్య భవన్' ఉన్న సాల్ట్ లేక్‌లో కొంతమంది నిరసనకారులు బారికేడ్లు ఎక్కి ప్రాంగణంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. ఇది పోలీసు సిబ్బందితో ఘర్షణకు దారి తీసిందని ఒక అధికారి తెలిపారు. ఎస్ల్పనేడ్‌లోని డోరినా క్రాసింగ్ వద్ద కూడా ఇలాంటి దృశ్యాలు కనిపించాయి. అక్కడ ఆందోళనకారులు బారికేడ్లను బద్దలు కొట్టి ముందుకు సాగడానికి ప్రయత్నించారని ఆయన అన్నారు. మాసాలుగా తమకు జీతాలు అందలేదని, వివిధ రకాల వైద్య అత్యవసర పరిస్థితులు, సంక్షేమ కార్యక్రమాల కోసం మోహరించినప్పటికీ కొద్దిపాటి మొత్తాలను మాత్రమే పొందుతున్నారని ఆరోగ్య కార్యకర్తలు పేర్కొన్నారు. కోల్‌కతాలోని కొన్ని ప్రాంతాలు, సాల్ట్ లేక్ ఈశాన్య ఉపగ్రహ పట్టణాలలో వాహనాల రాకపోకలు రెండు గంటలకు పైగా అంతరాయం కలిగిందని, నిరసనకారులు రోడ్లపైనే కూర్చున్నారని అధికారి తెలిపారు. ఎస్ల్పనేడ్, సాల్ట్ లేక్ నుండి అనేక మంది ఆశా కార్మికులు వెళ్లేందుకు నిరాకరించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ల్పనేడ్‌లోని ఎస్ ఎన్ బెనర్జీ రోడ్డులో నిరసనకారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని డిసి (సెంట్రల్) ఇందిరా ముఖర్జీ అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలు సువేందు అధికారి పోలీసు చర్యను అనాగరికమైనది అని అభివర్ణించారు. ఇదిలా ఉండగా, పనితీరు ఆధారిత భత్యాలకు బదులుగా స్థిర నెలవారీ జీతం కోసం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌పై సీనియర్ ఆరోగ్య అధికారులతో సమావేశం కోరుతూ ఆరోగ్య కార్యకర్తలు ఈనెల 8, 12 తేదీలలో 'స్వస్థ్య భవన్' వద్ద నిరసనలు చేపట్టారు. వారి డిమాండ్లలో కనీస నెలవారీ రుసుము రూ. 15,000, విధి నిర్వహణలో మరణం సంభవించినప్పుడు రూ. 5 లక్షల బీమా రక్షణ ఉన్నాయి. ప్రతిరోజూ 15–16 గంటలు పనిచేసినందుకు తమకు నెలకు దాదాపు రూ. 5,500 లభిస్తుందని, దీంతో తాము ఎలా జీవించాలని దక్షిణ్ దినాజ్‌పూర్‌కు చెందిన ఆశా కార్యకర్త చందన బారిక్ ఆవేదన వ్యక్తం చేశారు. 'స్వస్థ్య భవన్' వద్ద జరిగిన ప్రదర్శనలో ఒక నిరసనకారుడు అస్వస్థతకు గురయ్యాడు.

## ఇండోర్‌లో కలుషిత నీటికి మరొకరు మృతి

**ఇండోర్:** మధ్యప్రదేశ్‌లో పరిశుభ్ర నగరంగా గుర్తింపు పొందిన ఇండోర్‌లో కలుషిత నీటి కారణంగా ఇప్పటికే పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. అయితే ఇంకా మరణాలు ఆగడం లేదు. తాజాగా ఇండోర్‌లో 50 ఏళ్ల ఇ–రిక్షా డ్రైవర్ మరణించాడు. భగీరత్‌పుర ప్రాంతంలో కలుషితమైన తాగునీరు వల్ల కలిగే విరేచనాల కారణంగా అతని చనిపోయినట్లు అతని కుటుంబం ఆరోపించింది. ఈ మహమ్మారి ఇప్పటివరకు 25 మంది ప్రాణాలు కోల్పోయిందని స్థానిక నివాసితులు పేర్కొంటుండగా, మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈనెల 15న హైకోర్టు ఇండోర్ బెంచ్‌కు సమర్పించిన స్టేటస్ రిపోర్ట్‌లో ఐదు నెలల బాలుడితో సహా ఏడుగురు మరణించారని పేర్కొంది. 50 ఏళ్ల హేమంత్ గైక్వాడ అంత్యక్రియల ఊరేగింపు బుధవారం ఉదయం భగీరత్‌పురలోని తన ఇంటి నుండి బయలుదేరగా, అతని తల్లి, భార్య, నలుగురు కుమార్తెలను ఓదార్చడానికి శోకతప్తులైన వారు ఇబ్బంది పడ్డారు. హేమంత్ తమ్ముడు సంజయ్ పిటిఐతో మాట్లాడుతూ, 'నా సోదరుడు కలుషిత నీటి కారణంగా మరణించాడు. కేవలం 15 రోజుల అనారోగ్యం తర్వాత అతన్ని కోల్పోయాము. మంగళవారం రాత్రి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. తన అన్నయ్య ఇ–రిక్షా నడుపుతున్నాడని, తన కుటుంబానికి ఏకైక జీవనాధారం ఆయనే అని అన్నారు. తన సోదరుడి కుటుంబం ఆర్థికంగా బలహీనంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందించాలని సంజయ్ విజ్ఞప్తి చేశారు. గత రెండు సంవత్సరాలుగా భగీరత్‌పుర ప్రజలు కలుషిత నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, మున్సిపల్ కార్పొరేషన్‌కు అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ పరిష్కారం కాలేదని ఆయన పేర్కొన్నారు. హేమంత్ కుమార్తె రియా మాట్లాడుతూ, 'నా తండ్రికి కలుషిత నీరు కారణంగా విరేచనాలు అయ్యాయి, మేము అతన్ని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించాము. అతని పరిస్థితి మరింత దిగజారినప్పుడు, అతన్ని మరొక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు, అక్కడ అతను మరణించాడు' అని చెప్పారు.

## '26–26'తో ఉగ్రకుట్రకు ప్లాన్

### నిఘా వర్గాలు అప్రమత్తం



**న్యూఢిల్లీ:** దేశంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 26 లేదా అంతకు ముందు 26–26 అనే కోడ్ పేరుతో ఉగ్రదాడులు జరుగుతాయని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో బుధవారం ఢిల్లీలోని భద్రతా దళాలను హై అలర్ట్‌లో ఉంచారు. ఉగ్రవాదులు, భద్రతా దళాలు అయోధ్యలోని రామాలయం, జమ్మూలోని రఘునాథ్ ఆలయంతో పాటు ఇతర దేవాలయాలు, నగరాలను లక్ష్యంగా చేసుకోవచ్చని ఉగ్రదాడులు జరగవచ్చని భద్రతా దళాలు తెలిపాయి. పాకిస్తాన్ మిలిటరీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అయిన ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్, జైష్–ఎ మొహమ్మద్ ద్వారా, పంజాబ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ల సహాయంతో ఈ దాడికి ప్రణాళిక వేస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. నవంబర్‌లో ఎర్రకోట వెలుపల జరిగిన కారు బాంబుకు జైష్ బాధ్యత వహించింది. ఈ ఘటనలో 15 మంది మరణించారు. గణతంత్ర వేడుకలకు భద్రతా సంస్థలు ఢిల్లీ, దేశ రాజధాని ప్రాంతంలో ముఖ్యంగా బస్సు, రైలు స్టేషన్‌ల వంటి ఎంట్రీ/ఎగ్జిట్ పాయింట్ల వద్ద వాంటెడ్ వ్యక్తుల పోస్టర్‌లను ఏర్పాటు చేశాయి. వీరిలో ఢిల్లీకి చెందిన చౌహాన్ బంగర్‌కు నివాసి మొహమ్మద్ రెహాన్ కూడా ఉన్నాడు, 2016లో ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో అల్ ఖైదా మాడ్యూల్‌ను అరెస్టు చేసిన వెంటనే అతను అజ్ఞాతంలోకి వెళ్లాడు. జాబితాలో ఉన్న ఇతరులలో మొహమ్మద్ ఉమర్, అబు సుఫియాన్, మొహమ్మద్ షాహిద్ ఫైసల్, సయ్యద్ అర్షియా మరియు షర్జీల్ అక్తర్ ఉన్నారు. ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముందు ప్రోటోకాల్ ప్రకారం, భద్రతా సంస్థలు ఇప్పటికే అప్రమత్తంగా ఉన్నాయి, ఖలిస్తానీ ఉగ్రవాద సంస్థల దాడుల గురించి నిఘా హెచ్చరిక తర్వాత బెదిరింపు పర్యవేక్షణను ముమ్మరం చేశాయి. గత ఏడాది ఏప్రిల్‌లో లష్కరే తొయిబా ఉగ్రసంస్థ పహల్గాంలో జరిపిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. గత వారం లష్కరే సంస్థ జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదానికి కట్టుబడి ఉన్నామని బహిరంగంగా ప్రకటించింది. హిందువులకు వ్యతిరేకంగా లష్కరే కమాండర్ విద్వేషపూరిత ప్రసంగం చేశాడు. హిందువుల కుత్తుకలు కోసినప్పుడే 'ఫ్రీడం' సాధ్యమని పీఓకేలో జరిగిన ఒక కార్యక్రమంలో అబూ మూసా కశ్మీరీ చేసిన ప్రసంగం వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా కశ్మీరీ ఇలాంటి వ్యాఖ్యలే చేశాడు. దీంతో భారత్‌పై దాడులకు మరింత భారీ కుట్ర చేసే అవకాశాలు ఉండవచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

## ప్రజాస్వామ్య బలోపేతంలో 'స్వచ్ఛమైన' ఓటర్ల జాబితా కీలకం

### ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్



**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష పార్టీలు ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సమీక్షను ప్రశ్నిస్తున్న నేపథ్యంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పందించారు. 'స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి కీలకమని స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్నికల నిర్వహణ సంస్థల అంతర్జాతీయ సమావేశం ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత సంవత్సరం బిహార్‌లో జరిగిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో ఓటర్లను చేర్చడం లేదా మినహాయించడాన్ని సవాలు చేస్తూ ఒక్క ఫిర్యాదు కూడా దాఖలు కాలేదని ఆయన పేర్కొన్నారు. లక్ష పోలింగ్ స్టేషన్లలో ఏ ఒక్కదానిలోనూ బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండు దశల్లో ఒక్క రీపోలింగ్ కూడా జరగలేదని కుమార్ గుర్తు చేశారు. 'చట్టం ప్రకారం ప్రతి ఓటరుతో సహా స్వచ్ఛమైన ఓటరు జాబితా ప్రజాస్వామ్యాన్ని, ఆ ఓటరు జాబితా ఆధారంగా జరిగే ఎన్నికలను బలోపేతం చేయడానికి చాలా అవసరం' అని సిఇసి కుమార్ అన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితాను కట్టుదిట్టమైన ప్రజా పరిశీలన మధ్య సమీక్షించామని చెప్పారు. ఓటర్ల జాబితా శుద్ధి నుండి ఎన్నికల నిర్వహణ వరకు, స్థానిక ఎన్నికల యంత్రాంగం ద్వారా పెద్ద ఎత్తున స్థాయి సామర్థ్యం సాధించామన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై ప్రతిపక్ష పార్టీలు బిజెపి ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై విమర్శలు చేస్తున్నాయి. ఇది ఓట్లను తారుమారు చేసే చర్య అని ఆరోపిస్తున్నాయి. అయితే, ప్రభుత్వం, ఇసి ఈ ఆరోపణను త్రోసిపుచ్చాయి. 'సర్' రెండవ దశ గత సంవత్సరం నవంబర్ 4న అండమాన్, నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లలో ప్రారంభమైంది. అసోంలో 'సర్' పురోగతిలో ఉంది. 2003 బిహార్ ఓటర్ల జాబితాను ఇసిఐ ఇంటెన్సివ్ సమీక్ష కోసం ఉపయోగించినట్లే, రాష్ట్రాలలో చివరి 'సర్' కటాఫ్ తేదీగా పనిచేస్తుంది. చాలా రాష్ట్రాలు 2002, 2004 మధ్య ఓటరు జాబితాలో చివరి 'సర్'ను కలిగి ఉన్నాయి. 'సర్' ప్రాథమిక లక్ష్యం విదేశీ అక్రమ వలసదారుల జన్మస్థలాన్ని తనిఖీ చేయడం ద్వారా వారిని తొలగించడం. బంగ్లాదేశ్, మయన్మార్ నుండి వచ్చిన వారితో సహా వివిధ రాష్ట్రాల్లో అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ చర్య ప్రాముఖ్యతను సంతరించుకుంది.

### వాయు నాణ్యత నిర్వహణ కమిషన్‌పై...

## మీ కార్యాచరణ ప్రణాళికను సమర్పించండి

### కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాన్ని కోరిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** ఢిల్లీఎన్‌సిఆర్ పరిధిలో అధ్వానంగా ఉన్న వాయునాణ్యత సూచిక (ఎక్యుఐ)ను మెరుగుపరచడానికి దీర్ఘకాలిక చర్యల కోసం కేంద్ర కాలుష్య నిఘా సంస్థ సిఫారసులపై నాలుగు వారాలలోగా యాక్షన్‌ప్లాన్‌ను సమర్పించాలని బుధవారం అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ సర్కార్‌ను, ఇతర వాటాదారులను ఆదేశించింది. వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సిఎక్యుఎం) తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి దాఖలు చేసిన స్టేటస్ రిపోర్టును భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్‌లు జోయ్ మాల్యా బాగ్చీ, విపుల్ ఎం. పంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. 'వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ 15 దీర్ఘకాలిక చర్యలను సిఫారసు చేసింది.ఈ దీర్ఘకాలిక చర్యలను అమలు చేయడానికి సమర్థులైన సంబంధిత ఏజెన్సీలను కూడా సిఎక్యుఎం గుర్తించింది. సిఎక్యుఎం పైన పేర్కొన్న చర్యలకు అదనంగా కొన్ని అదనపు దీర్ఘకాలిక చర్యలు తీసుకోవలసి రావచ్చు. సిఎక్యుం సిఫారసు చేసిన ఈ దీర్ఘకాలిక చర్యలు ఆలస్యం లేకుండా అమలులోకి రావాలి అనడంలో ఎలాంటి సందేహం లేదు. అందువల్ల ఈ చర్యలను అమలుచేయడానికి వాటాదారుల తమ సంబంధిత కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని మేము కోరుతున్నాం. ఈ చర్యలకు సంబంధించి ఈ కోర్టు ఎటువంటి అభ్యంతరాలను స్వీకరించడానికి ఇష్టపడదు. విచారణ ప్రారంభం కాగానే, ఢిల్లీఎన్‌సిఆర్ నుండి కాలుష్య కారకాల వాహనాలను దశలవారీగా తొలగించడం, కాలుష్యనియంత్రణలో ఉన్న విధానాన్ని బలోపేతం చేయడం, రైలు రవాణా, మెట్రోను పెంచడం సవరించిన ఎలక్ట్రిక్ వాహన విధానం వంటి ఇతర చర్యలతో సహా వివరణాత్మక దీర్ఘకాలిక చర్యలను సిఎక్యుఎం సమర్పించింది' అని భాటి సుప్రీంకోర్టుకు వివరించారు. ఈ విషయంలోఅమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్ మాట్లాడుతూ మునుపటి ప్రణాళికలలో కూడా ఇలాంటి దశలను సిఫారసు చేశారని, ప్రతిపాదిత సిఫారసుల కోసం కోర్టు నిర్ణయించిన కాలక్రమాలను నిర్దేశించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ చర్యలు సజావుగా అమలు జరిగేలా పర్యావరణ పరిహార ఛార్జ్ నిధిని అందించగల ఏజెన్సీలను గుర్తించామని భాటి ధర్మాసనానికి తెలియజేశారు. కాగా ఈ సిఫారసులను, అభ్యంతరాలను స్వీకరించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.కేంద్ర కాలుష్య నిఘా సంస్థ తన విధిని నిర్వర్తించడంలో ఫెయిల్ అయిందని గమనించిన అత్యున్నత న్యాయస్థానం జనవరి 6న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ఢిల్లీ సరిహద్దులోని టోల్‌ప్లాజాలను తాత్కాలికంగామూసివేయడం లేదా రెండు నెలలపాటు వాయిదా వేయాలని అధికార యంత్రాంగాన్ని కోరింది. వాయునాణ్యత నిర్వహణ కమిషన్ 'గంభీరత' పాటించడం లేదని ధోరణిని తప్పుపట్టింది. ఢిల్లీఎన్‌సిఆర్‌లో దిగజారుతున్న వాయు నాణ్యత సూచిక (ఎక్యుఐ)ని గుర్తించడానికి లేదా దీర్ఘకాలిక పరిష్కారాలను కనుగొనడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని పేర్కొంది.

## పెట్టుబడుల గురించి ఎప్పుడూ మాట్లాడను

### ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్నవి నకిలీ వీడియోలు : సుధామూర్తి

**బెంగళూరు:** ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న తన నకిలీ వీడియోలపై రాజ్యసభ సభ్యురాలు, రచయిత్రి, పరోపకారి సుధామూర్తి బుధవారం హెచ్చరించారు. ఆర్థిక పథకాలు, పెట్టుబడులను ప్రోత్సహించడానికి తన ఇమేజ్, వాయిస్‌ను తప్పుగా ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. 'ఆర్థిక పథకాలు, పెట్టుబడులను ప్రోత్సహించడానికి నా ఇమేజ్, వాయిస్‌ను తప్పుగా ఉపయోగిస్తూ ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న నకిలీ వీడియోలపై మిమ్మల్ని హెచ్చరించాలనుకుంటున్నాను. ఇవి నా గుర్తింపు లేదా అనుమతి లేకుండా సృష్టించబడిన డీప్‌ఫేక్‌లు' అని మూర్తి అన్నారు. దయచేసి ఈ మోసపూరిత వీడియోల ఆధారంగా ఎటువంటి ఆర్థిక నిర్ణయాలు తీసుకోవద్దని, అధికారిక మార్గాల ద్వారా సమాచారాన్ని ధృవీకరించాలని, మీరు ఎదుర్కొనే అటువంటి కంటెంట్‌ను నివేదించాలని మిమ్మల్ని కోరుతున్నానన్నారు. తాను ఎప్పుడూ పెట్టుబడుల గురించి లేదా డబ్బుతో ఏదైనా చేయడం గురించి మాట్లాడనని అన్నారు. 'రూ.20వేలు పెట్టుబడి పెడితే.. పదిరెట్ల రాబడి వస్తోందంటూ నేను చెప్పినట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు నకిలీవి. ఈ డీప్‌ఫేక్ వీడియోలను చూసి ప్రజలు మోసపోవద్దు. వీటిని నమ్మి నాకు తెలిసినవారు డబ్బులు పోగొట్టుకున్నారు. నేను ఎప్పుడూ ఆర్థికపరమైన పెట్టుబడుల గురించి మాట్లాడను. ఇలాంటి వీడియోలతో ప్రజలు అప్రమత్తంగా, సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నాను. జై హింద్!' అని సుధామూర్తి రాసుకొచ్చారు. తనకు తెలిసిన చాలా మంది వ్యక్తులు పెట్టుబడి పెట్టి డబ్బు పోగొట్టుకున్నారని పేర్కొంటూ, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో వచ్చే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సందేశాలను నమ్మవద్దని మూర్తి ప్రజలను కోరారు. 'ఇది నకిలీ వార్త, మీరు మీ డబ్బును కోల్పోతారు. మీకు ఏవైనా సందేహాలు ఉంటే, ఇమెయిల్ పంపండి, తెలుసుకోండి లేదా బ్యాంకులో అడగండి. దాని గురించి ఆలోచించండి, ఆపై పెట్టుబడి పెట్టండి. నేను ఎల్లప్పుడూ పని, భారతదేశ సంస్కృతి, మహిళలు, విద్య గురించి మాట్లాడుతాను. డబ్బును పెట్టుబడి పెట్టడం, దాని నుండి రాబడిని పొందడం గురించి నేను ఎప్పుడూ మాట్లాడను. ఇది నకిలీ వార్త' అని ఆమె అన్నారు. 'నా పేరుతో జరిగే ఏదైనా ఆర్థిక లావాదేవీని నమ్మవద్దని, అది నకిలీ వార్త అని ప్రేక్షకులందరినీ నేను చేతులు జోడించి కోరుతున్నాను. మీరు కష్టపడి సంపాదించిన డబ్బును ఏదో దురాశ కోసం పోగొట్టుకోకండి, వారు మిమ్మల్ని వలలాగా పెట్టి లోపలికి లాక్కుంటారు. అలా చేయకండి' అని ఆమె సలహా ఇస్తూ, 'మీ డబ్బును ఆదా చేసుకోండి, తెలివిగా పెట్టుబడి పెట్టండి. మీకు ఏదైనా సమస్య ఉంటే, వెళ్లి పోలీస్ స్టేషన్ లేదా బ్యాంకులో తనిఖీ చేయండి' అని సూచించారు.


**డాక్యుమెంట్ పోయినది**

నేను అనగా **బత్తుల గీత, భర్త బత్తుల శ్రీనివాసరావు,** ఖమ్మం వెళ్ళేందుకు వైరా బస్టాండ్‌కు వెళ్లగా **816/1985** నెంబరుగల డాక్యుమెంట్ పోయినది. దొరికిన వారు ఆ డాక్యుమెంట్ ఇవ్వగలరు. అదేవిధంగా సమాచారం తెలిసినవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
సెల్: **96666 85421, 95539 34703.**

SHRIRAM Finance

**వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS09EH 0364 | Renukuntla Suman | SWIFT DZIRE VDI DIESEL 5 SEATER | 2015 |
| 2 | AP23AN 1555 | More Pushpalatha | I20.I GEN 1.4L U2 CRDI ASTA DIESEL 5 SEATER | 2013 |
| 3 | TS02ER 4384 | Dandaboina Raghu | JOHN DEERE 5042 | 2016 |
| 4 | TS24E 9285 | Lingaiah Mirala | KUBOTA MU5501 | 2020 |
| 5 | TS03EW 3051 | Ravula Thirupathi | NEW HOLLAND 4710 | 2019 |
| 6 | TS02F J8661 | Arepalli Shiva Krishna | NEW HOLLAND 4710 | 2023 |

**AUCTION DATE: 24-01-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
H.No :12-209/1,1st floor, Upstairs of Telangana Grameena Bank, Warangal Road, Huzurabad. Cell : 7702785091

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
గురువారం
22-01-2026
www.prajapaksham.in



# టి.ఎన్.గవర్నర్‌ను 'రీకాల్' చేయాలి

రాజ్యాంగ నియమాల ఉల్లంఘనను కొనసాగిస్తూ, తమిళనాడు రాష్ట్రాన్ని అప్రతిష్ట పాల్జేయటమే తన 'రాజ్యాంగ కర్తవ్యం' అన్నట్లుగా వ్యవహరిస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవిని కేంద్రప్రభుత్వం వెనక్కు పిలిచి (రీకాల్) కేంద్ర–రాష్ట్ర సంబంధాలను, రాజ్యాంగ ఫెడరల్ (సమాఖ్య) సూత్రాన్ని రక్షించాలి. మంగళవారం తమిళనాడు అసెంబ్లీలో మంత్రివర్గం ఆమోదించిన సాంప్రదాయక ప్రసంగ పాఠం చదవకుండా ఆయన సభనుంచి అర్థాంతరంగా వెళ్లిపోయిన అవాంఛనీయ ఘటన ఈ డిమాండ్‌కు బలం చేకూర్చుతున్నది. కొద్ది మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలున్న కారణంగా గవర్నర్ రాష్ట్రప్రభుత్వ వ్యతిరేక ధోరణులతో డిఎంకె ప్రభుత్వం ఘర్షణ కోరుకోకపోవచ్చు. ప్రభుత్వ విధాన ప్రకటనను మాత్రమే రికార్డులోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రతి ఏటా అసెంబ్లీ మొదటి సమావేశం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యే ఆచరణను రద్దు చేయాలని కోరే రాజ్యాంగ సవరణ ప్రవేశపెట్టటానికి తమ ప్రభుత్వం మిత్రపక్షాలతో కలిసి ప్రయత్నిస్తుందని స్టాలిన్ ప్రకటించారు.

ప్రక్కనే ఉన్న కేరళ రాష్ట్రంలో సైతం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ కూడా రాష్ట్రప్రభుత్వంతో ఘర్షణ విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఆయన మంత్రివర్గ విధాన ప్రసంగాన్ని చదవటానికి నిరాకరించలేదు గాని కొన్ని పేరాగ్రాఫ్‌ల్లో (12,15,16) కొన్ని వాక్యాలు దాటవేశారు లేదా తన సొంతం చేర్చారు. ఇదీ రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుంది. లోక్ (రాజ్) భవన్‌లో అధికార కార్యక్రమాల్లో హిందూత్వ ఎజండాను అమలు జరపటానికి ఒత్తిడి చేయటం, శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా తొక్కిపెట్టటం వంటి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రజాభీష్టం మేరకు పనిచేయకుండా ఆటంకం కలిగించటం మినహా అందులో ప్రజా ప్రయోజనమేదీ లేదు. అంతకుముసుపటి గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ కూడా యూనివర్శిటీల బిల్లుల విషయంలో ప్రభుత్వ చర్యలకు మోకాలడ్డి, 2024లో ఒక నిముషంలోపే అసెంబ్లీలో ప్రసంగం ముగించీ అప్రతిష్టపాలై రాష్ట్రం నుంచి నిష్క్రమించారు. శాసనసభ ఆమోదించిన 14 బిల్లులు గవర్నర్ ఆమోద ముద్ర కోసం ఎదురు చూస్తున్నట్లు స్పీకర్ ఎ.ఎన్.షంశీర్ ఇటీవల చెప్పారు.

తమిళనాడు అసెంబ్లీ నుంచి గవర్నర్ రవి నిష్క్రమించాక లోక్‌భవన్ విడుదల చేసిన ప్రకటన చిత్రంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగపాఠంలో ''అనేకానేక అనిర్ధారిత క్లెయిములు, తప్పుత్రోవ పట్టించే ప్రకటనలు'' ఉన్నందున దాన్ని చదవటానికి రవి నిరాకరించారని అది పేర్కొన్నది. అంతేగాక, ''ప్రజల్ని ఇబ్బంది పెడుతున్న అనేక కీలకమైన సమస్యలను ఆ పాఠం అలక్ష్యం చేసిందని'' తన పరిధిని మించి వ్యాఖ్య చేసింది. పైగా ''గవర్నర్ మైక్రోఫోన్‌ను పలుమార్లు స్విచ్ఛాఫ్ చేశారని, ప్రసంగించేందుకు ఆయన్ను అనుమతించలేదని'' పేర్కొన్నది. స్పీకర్ ఎం.అప్పు పక్కనే నిలబడి, సాంప్రదాయం ప్రకారం ప్రభుత్వ విధాన ప్రసంగ పాఠం చదవాలని పదేపదే గుర్తు చేసినా గవర్నర్ పట్టించుకోలేదు. గవర్నర్ రవికి ఇదేమీ కొత్త కాదు. మూడేళ్లుగా ఇదే తంతు – అధికారిక ప్రసంగంనుంచి పక్కకు వెళ్లటమో లేక ప్రసంగం చదవకుండా వాకౌట్ చేయటమో చేస్తున్నారు. ఏమి సాధించారు – గవర్నర్ స్థానానికున్న ప్రతిష్టను మంటగలపటం మినహా! తమిళనాడు శాసనసభ సాంప్రదాయం ప్రకారం సభ ఆరంభంలో తమిళ జాతీయగీతం ఆలాపించబడుతుంది, ముగింపులో జాతీయగీతం ఆలాపించబడుతుంది. అయితే ముందు – చివర జాతీయగీతమే ఆలపించాలన్నది రవి పట్టుదల. డిఎంకె 50 ఏళ్లుగా తిరోగామి రాజకీయాలు చేస్తున్నదని, తమిళనాడుకు ''తమిళజగం'' మరింత అనువైన పేరు అని ప్రకటించి 2003 జనవరిలో తీవ్రమైన విమర్శలపాలైన వ్యక్తి గవర్నర్ రవి. అనేక బిల్లులు తొక్కిపట్టి సుప్రీంకోర్టునుంచి మార్గదర్శక ఆదేశాలకు గురైన వ్యక్తికూడా.

గవర్నర్ రవి ప్రవర్తన బిజెపి తరపున రాజకీయ క్రీడ లాగా ఉంది. మంత్రివర్గం ఆమోదించి పంపిన ప్రసంగాన్ని తుచ తప్పకుండా (గవర్నర్ వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేదు) చదవటం పార్లమెంటులో రాష్ట్రపతి, శాసనసభల్లో గవర్నర్‌ల విధి. సొంత అభిప్రాయాలు చొప్పించే అవకాశం లేదు. ''ప్రజలను ఇబ్బందిపెడుతున్న అనేక కీలకమైన సమస్యలు అలక్ష్యం చేయబడినాయి... దాదాపు అన్ని రంగాల్లో దిగువస్థాయి ఉద్యోగుల్లో విస్తారంగా అసంతృప్తి ఉంది. వారు ఆందోళనతో, నిస్పృహతో ఉన్నారు. వారి న్యాయమైన సాధకబాధకాలు పరిష్కరించే మార్గాలు ప్రస్తావించలేదు....పెట్టుబడులు పెట్టేవారికి తమిళనాడుపట్ల ఆకర్షణ తగ్గింది. మహిళల భద్రత సమస్య పూర్తిగా అలక్ష్యం చేయబడింది. పోక్సో చట్టం కింద మానభంగాలు ఆందోళన గొలుపుతూ 55 శాతం పెరిగాయి, మహిళల మానభంగం, లైంగిక వేధింపుల కేసులు 33 శాతం పెరిగాయి. మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతున్నాయి'' అని గవర్నర్ కార్యాలయం విడుదల చేసిన మూడు పేజీల ప్రకటన పేర్కొన్నది. ఇది గవర్నర్ ప్రసంగమా? ఎన్నికలకు ముందు ప్రతిపక్ష పార్టీ లేదా నాయకుని ప్రకటనా? ఇది రాజ్యాంగం రీత్యా ఏర్పడిన ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వానికి వ్యతిరేకమైన గవర్నర్ రాజ్యాంగ విరుద్ధ ప్రవర్తన కాదా?

ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను ఇబ్బందులు పెట్టేందుకే కేంద్రప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నందున ఆ వ్యవస్థను రద్దు చేయాలని కమ్యూనిస్టుపార్టీలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. తమిళనాడు, కేరళ తాజా సంఘటనలు ఆ డిమాండ్‌కు బలం చేకూర్చుతున్నాయి. ●



## జవాబు దారీతనం కోరాలి

'దురాశ అనే మహమ్మారి' దేశవ్యాప్తంగా వ్యాపించింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భయంకరంగా మారింది. ప్రజలు ప్రభుత్వం నుండి జవాబుదారీతనం కోరాలి. నేటి ప్రతి సాధారణ భారతీయుడి జీవితం నరకయాతనగా మారింది. అధికారంలో ఉన్నవారికి వ్యవస్థ అమ్ముడుపోయింది. అందరూ ఒకరినొకరు తట్టుకుంటారు. ఆపై, వారు ప్రజలను తొక్కేస్తారు. దురాశ తెగులు కారణంగా సమాజం చనిపోతోంది. నోయిడాలో ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మరణించిన ఘటన భారతదేశంలో దురాశ, ఇతర జీవుల పట్ల అగౌరవం అనే సంస్కృతిని ప్రచారం చేయడం ప్రత్యక్ష పరిణామం.

ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ



# ఇరాన్‌లో అశాంతికి ఆజ్యం పోస్తున్న బాహ్య శక్తులు

ఇరాన్ తన విప్లవానంతర చరిత్రలోనే అత్యంత తీవ్రమైన సంక్షోభాలలో ఒకదాన్ని ఎదుర్కొంటోంది. ఆర్థిక కష్టాలపై ప్రారంభమైన నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించి, సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖామెనీ అధికారానికి నిరంతర సవాలుగా మారాయి. హింస పెరుగుతున్న వేళ, ఉరిశిక్షల బెదిరింపులు, దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ నిలిపివేత, అలాగే ముఖ్యంగా అమెరికా వంటి విదేశీ శక్తుల జోక్యం— ఇరాన్ అంతర్గత పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. మానవ హక్కుల సంస్థలు పరిస్థితి వేగంగా క్షీణిస్తున్నదని హెచ్చరిస్తున్నాయి. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి అగ్నెస్ కాలమార్డ్ నిరసనలను అణిచివేయడానికి త్వరిత విచారణలు, యాదృచ్ఛిక ఉరిశిక్షలు మళ్లీ ఉపయోగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2022లో జరిగిన ఉమెన్, లైఫ్, ఫ్రీడం ఉద్యమం తరువాత చోటుచేసుకున్న సామూహిక ఉరిశిక్షలను ఆమె గుర్తు చేశారు. దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ బ్లాక్‌ఔట్ కారణంగా హత్యలు, అరెస్టుల నిజమైన పరిమాణాన్ని నిర్ధారించడం అసాధ్యంగా మారింది. అశాంతి వ్యాప్తి మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఇరాన్‌లోని 31 ప్రావిన్సులన్నింటిలోనూ నిరసనలు చెలరేగాయి; 180కు పైగా నగరాల్లో వందలాది ప్రదర్శనలు నమోదయ్యాయి. ఇటీవల వారాల్లో కనీసం నాలుగైదువేల మంది మరణించారని, 2,300మందికి పైగా అరెస్టయ్యారని హక్కుల సంఘాలు అంచనా వేస్తున్నాయి.

తాజా నిరసనలకు కారణం ఆర్థిక పతనం. ఇరానియన్ రియాల్ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది; ద్రవ్యోల్బణం సుమారు 40 శాతానికి చేరింది; ఆహారం, ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. పెట్రోల్ ధరల పెంపు, చాలా వస్తువులపై సబ్సిడీ మారకపు రేట్ల రద్దు ఇవన్నీ అనేక కుటుంబాలను దారిద్ర్యం అంచుల దాకా నెట్టాయి. అయితే నిరసనలు త్వరలోనే ఆర్థిక అంశాలను దాటి, రాజకీయ దమనంపై ఉన్న లోతైన కోపాన్ని ముఖ్యంగా 2022లో పోలీస్ కస్టడీలో మరణించిన మహ్సా అమిని ఘటన తరువాత మిగిలిన గాయాలను ప్రతిబింబించాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘర్షణాత్మక ధోరణి అవలంబించారు. నిరసనలు కొనసాగించాలని ఇరానీయులను ప్రోత్సహిస్తూ, నిరసనకారులకు ఉరిశిక్షలు అమలు చేస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని తెహ్రాన్‌కు హెచ్చరించారు. ఇరాన్‌లో గెలవాలి అనేదే తన లక్ష్యమని ట్రంప్ చెప్పారు, వేగవంతమైన, బలప్రయోగాత్మక చర్యల సంకేతాలు ఇచ్చారు. అయితే ఇవి— మధ్యప్రాచ్యంపై అమెరికా దృష్టిని తగ్గించాలని, ఇతర దేశాలపై రాజకీయ మార్పులు రుద్దకూడదని చెప్పిన కొద్ది వారాల క్రితమే విడుదలైన వాషింగ్టన్ జాతీయ భద్రతా వ్యూహానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. అమెరికాలోనే ఈ విషయంలో ఏకాభిప్రాయం లేదు. సెనేటర్ బెర్నీ శాండర్స్, అమెరికా సైనిక జోక్యం ఘోరమైన తప్పిదమని హెచ్చరిస్తూ, గత జోక్యాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. హింసాత్మక దమనాన్ని ఆపాలని, ఇంటర్నెట్‌ను పునరుద్ధరించాలని, స్వేచ్ఛాయుత ఎన్నికలను మద్దతు ఇవ్వాలని వాషింగ్టన్ కోరాలని ఆయన అభిప్రాయం.

ఇరాన్ మరో 1979 దిశగా వెళ్తుందా అనే ప్రశ్న చాలామందిని ఆకర్షిస్తోంది. కానీ ఈ పోలిక మోసపూరితమైనది. షాను కూల్చిన విప్లవం విజయం సాధించడానికి నిరసనలే కాకుండా, అధికార వర్గాల్లో చీలికలు, భద్రతా బలగాల సందిగ్ధత కూడా కారణమయ్యాయి. నేటి ఇరాన్ పూర్తిగా భిన్నం. ఇక్కడ అధికారము కట్టుదిట్టమైన ధార్మిక భద్రతా రాజ్యంలో కేంద్రీకృతమై ఉంది. పెద్ద ఎత్తున నిరసనలు మాత్రమే ఉన్నత వర్గాల విరుగుడుకు దారి తీసే అవకాశాలు తక్కువ. మరోవైపు ఇరాన్ అణు కార్యక్రమం అంతర్జాతీయంగా తీవ్రమైన ఆందోళనకు కారణమవుతోంది.

ఆయుధ స్థాయి సమీపానికి యురేనియం శుద్ధిని పెంచిన తెహ్రాన్, ఐక్యరాజ్యసమితి అణు పర్యవేక్షక సంస్థతో సహకారాన్ని తగ్గించింది— తాము బాంబు కోరుకోవడం లేదని చెబుతూనే ఇరాన్ నాయకత్వం తన వైఖరిని స్పష్టంగా తెలిపింది. ఇస్లామిక్ రిపబ్లిక్ వెనక్కి తగ్గదని ఖామెనీ ప్రకటిస్తూ, నిరసనకారులను విదేశీ శక్తుల ఏజెంట్లుగా దూషించారు, బయటి దేశాలు జోక్యం చేయవద్దని హెచ్చరించారు.

డా.ముచ్చుకోట సురేష్ బాబు

# ట్రంప్ ఆర్కిటిక్ జూదాన్ని యూరప్ నిలువరించగలదా?

**అశోక్ నీలకంఠన్ అయిర్స్ (న్యూయార్క్)**

గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటానన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరింపు దౌత్యభాషలో చుట్టి, లేదా బ్రీఫింగ్ కాగితాల్లో మరుగుపరిచి రాలేదు. విదేశాంగ విధానంలో తరచూ జరిగేటట్లుగా మొరటుగా వచ్చింది. గ్రీన్‌ల్యాండ్, ఉన్నది ఉన్నట్లుగా విడిచిపెట్టటానికి వీలులేనంత ముఖ్యమైనది. ఆ ఆర్కిటిక్ దీవి – విశాలమైనది, చెదురుమదురుగా జనాభా కలిగినది, వ్యూహాత్మకమైన ప్రాంతంలో ఉన్నది – అమెరికన్ నియంత్రణ కింద ఉండి తీరాలట! అనంతరం జరిగింది ట్రంప్ తరహా మరో కవ్వింపు చర్య మాత్రమే కాదు. సార్వభౌమత్వానికి, అలయెన్స్ రాజకీయాలకు, సత్యానికి పరీక్ష పెట్టింది – వాషింగ్టన్‌ను కోపెన్‌హేగన్‌కు (డెన్మార్క్) వ్యతిరేకంగా నిలబెట్టింది; యూరప్‌ను అస్థిమిత పరిచింది, గ్రీన్‌ల్యాండర్స్‌కు ఆగ్రహం తెప్పించిం ది. మాస్కో, బీజింగ్ తదితరాలనుంచి భిన్నమైన స్పందనలు తెచ్చింది.

ఈ సంక్షోభం మూలంలో ఒక ప్రాథమికమైన ప్రశ్న ఉంది. ఇది భద్రత గురించేనా – లేక మరేదైనా ఉందా? ట్రంప్ తమ అధ్యక్ష పదవి తొలి పర్యాయంలో కూడా ఒకసారి గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవటమనే ఆలోచన వెల్లడించారు. అప్పుడు అది పిచ్చివాడి రియల్ ఎస్టేట్ తమాషాగా కొట్టి వేయబడింది. ఈ పర్యాయం స్వరం భిన్నంగా ఉంది, భాష పదునుగా ఉంది, ప్రయోజనాలు పెద్దగా ఉన్నాయి.

అంతర్గత చర్చలతో సంబంధమున్న అమెరికా అధికారుల ప్రకారం, గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా జాతీయ భద్రతకు ''అత్యవసరం'' గా ట్రంప్ పరిగణిస్తున్నారు. ఆర్కిటిక్‌లో అది ఉన్న ప్రదేశం, ఉత్తర అమెరికాకు చేరువలో ఉండటం, విదేశీయుల ఆక్రమణపై ఆరోపణలను ఆయన ఉదహరించారు. దాని సార్వభౌమాధికారం బదిలీపై చర్చను డెన్మార్క్ తిరస్కరించినపుడు ఉద్ఘాటనలు మొదలైనాయి. ఐరోపా మిత్ర రాజ్యాలపై సుంకాల హెచ్చరికలు సహా ఆర్థిక పర్యవసానాలు ఉంటాయని హెచ్చరించిన ట్రంప్, వారు ''యుఎస్ భద్రత ప్రయోజనాలకు అడ్డుపడతారా?'' అని ప్రశ్నించారు.

దీన్ని వేధింపు దౌత్యంగా ఐరోపా దౌత్యవేత్తలు ప్రైవేటుగా వ్యాఖ్యానించారు – ఇది నాటో మిత్రరాజ్యాల మధ్య రెండవ ప్రపంచ యుద్ధానంతరం నిర్దేశించుకున్న రూల్సు నుండి నాటకీయమైన నిష్క్రమణ. యూరప్ రాజ్యాలు అసాధారణంగా వెనువెంటనే ఐక్యంగా స్పందించాయి. డెన్మార్క్‌ను ఫ్రాన్స్, జర్మనీ, యుకె, దాని నోర్డిక్ మిత్ర రాజ్యాలు బలపరిచాయి. గ్రీన్‌ల్యాండ్స్ ప్రతిపత్తి సంప్రదింపులకు అతీతం అని ప్రకటించాయి. సర్వసత్తాక భౌగోళిక ప్రాంతంపై మిత్రరాజ్యాలకు వ్యతిరేకంగా ఆర్థిక బెదిరింపులు నియంత్రణ రేఖను దాటాయని యూరోపియన్ నాయకులు హెచ్చరిక చేశారు.

యూరప్‌లో సైద్ధాంతికంగా ట్రంప్‌కు అత్యంత సన్నిహితురాలిగా పరిగణించబడే ఇటలీ ప్రధానమంత్రి గియోర్జియా మెలోని ట్రంప్‌కు నేరుగా ఫోన్ చేసి ఉద్రిక్తతలు తగ్గించాలని కోరినట్లు, ప్రపంచం అస్థిరంగా ఉన్న ఈ సమయంలో ఈ ఉదంతం నాటో ఐక్యతను ముక్కలు చేస్తుందని చెప్పారని అంటున్నారు. మెలోనీ బహిరంగంగా ట్రంప్ బెదిరింపును ఖండించకపోయినా, సార్వభౌమత్వంపై ఒత్తిడి కింద బేరసారాలుండవని ఇటాలియన్ అధికారులు ఆ తర్వాత స్పష్టం చేశారు.

యూరోపియన్ రక్షణ విధాన రూపశిల్పులు ఆర్కిటిక్ భద్రతపై తెరవెనుక సమన్వయం పెంపొందించటం మొదలు పెట్టారు. అది రష్యా, చైనాలకు వ్యతిరేకంగా కాదు, సంక్షోభం మరింత దిగజారకుండా నిరోధించే చర్యలపై.





గ్రీన్‌ల్యాండ్ జనాభా కేవలం 55,000. మెజారిటీ దేశీయ ఇన్‌యుఇట్‌లు. గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్ రాజ్యంలోపల విస్తారమైన స్వయం ప్రతిపత్తి కలిగి ఉంది. ట్రంప్ ప్రకటనకు దాని నాయకులు ఆగ్రహంతో, ఆశ్చర్యంతో స్పందించారు. ''మేము అమ్మకానికి లేము'' అని ప్రకటించారు. ప్రజల ఊరేగింపులు, స్థానిక ప్రజాప్రతినిధుల ప్రకటనలు, అభిప్రాయ సర్వేలు అన్నీ ఒకే దిశలో ఉన్నాయిః అమెరికా భూభాగంలో భాగం కావటం కన్నా డెన్మార్క్ పరిధిలో ఉండటానికి గ్రీన్‌ల్యాండర్స్‌లో అత్యధికులు కోరుకుంటున్నారు. ట్రంప్ వ్యాఖ్యలు తమ గుర్తింపును, చరిత్రను, స్వయం నిర్ణయాధికారాన్ని నిరాకరిస్తున్నట్లు అత్యధికులు అభిప్రాయపడ్డారు. గతకాలపు వలస పాలనలోకి వెళ్లాలని వారు కోరుకోవటం లేదు.

డెన్మార్క్ ప్రధాని మీట్టె ఫ్రెడరిక్‌సెన్ మరీ స్పష్టంగా చెప్పారు. గ్రీన్‌ల్యాండ్ ప్రతిపత్తి మార్పును బలవంతపెట్టే ఏ ప్రయత్నమైనా ట్రాన్స్ అట్లాంటిక్ సంబంధాలకు హాని చేస్తుంది. తాము సమర్థిస్తున్నామని అమెరికా చెప్పుకుంటున్న (నాటో) అలయెన్స్ నిర్మాణాలనే దెబ్బతీస్తుందన్నారు.

గ్రీన్‌ల్యాండ్‌లో అమెరికా సైనిక ఉనికి ఇప్పటికే ఉంది. దీర్ఘకాలిక ఒప్పందాల కింద – తులె వైమానిక స్థావరం సహా ఉన్నాయి. అందువల్ల భద్రతా సహకారం ఎన్నడూ సమస్య కాదని డేనిష్ అధికారులు నొక్కి చెప్పారు. అసలు సమస్య ఆ దీవిపై స్వామ్యం, నియంత్రణ, సాంప్రదాయం నెలకొల్పటం. ఒత్తిడితో గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటే, ఇతర చోట్ల అదే ఎత్తుగడలను ఏది ఆపగలదు? అని వారు ప్రైవేటుగా అంటున్నారు. గ్రీన్‌ల్యాండ్ పరిసరాల్లో చైనా ఓడలు, రష్యా నౌకలు చురుకుగా తిరుగుతూ వ్యూహాత్మకంగా ప్రమాదకారిగా ఉన్నాయని, అందువల్లనే అమెరికా జోక్యం చేసుకోవాలని కోరుకుంటున్నదని ట్రంప్ సమర్థన.

ఈ వాదనలను గూఢచారి అధికారులు, ఆర్కిటిక్ స్వతంత్ర విశ్లేషకులు సవాలు చేస్తున్నారు. ఆర్కిటిక్‌లో రష్యా ఉనికి బలంగా ఉంది. అయితే అది దాని సొంత ఉత్తర తీరం వెంట. గ్రీన్‌ల్యాండ్ చేరువలో రష్యన్ యుద్ధనౌకల విన్యాసాలకు ఆధారాలు లేవు. చైనా కార్యకలాపాలు ప్రధానంగా రీసెర్చి, వాణిజ్యం, దీర్ఘకాలిక ఖనిజాన్వేషణ ప్రతిపాదనలకు సంబంధించినవి. అంతేగాని సైనిక దిగ్బంధానికి సంబంధించినదేదీ లేదు.

చైనా లేదా రష్యా సైనికదళాలు గ్రీన్‌ల్యాండ్ దీవి చుట్టూ తిరుగుతున్నాయనే వాదనలకు ఆధారాలేవీ లేవని అనేక మీడియా శోధనలు కనుగొన్నాయి. ఆ కథనం తప్పుత్రోవపట్టించేది మాత్రమే గాక, ''అతిశయో క్తి'' అని నాటో అధికారులు ప్రైవేటుగా అంటున్నారు. అది మరింత ఇబ్బందికరమైన ప్రశ్న లేవనెత్తుతున్నది. నిజమైన ధ్యేయం ఏమిటి?

మంచుఖండం ఆర్కిటిక్‌లో మంచు తగ్గుతున్నకొలదీ గ్రీన్‌ల్యాండ్ వ్యూహాత్మక విలువ మారుతున్నది. కొత్త నౌకాయాన మార్గాలు తెరుచుకుంటున్నాయి. అధునాతన ఎలక్ట్రానిక్స్, ఆయుధాలు, గ్రీన్‌టెక్నాలజీలకు అత్యంత ఆవశ్యకమైన – ఇంతవరకు వెలికి తీయని అరుదైన భూగర్భ ఖనిజ నిక్షేపాలు ప్రపంచ ఆసక్తిని పెంచుతున్నాయి. రాజకీయంగా సున్నితం అయినటువంటి ఆయిలు, గ్యాస్ నిక్షేపాల ప్రాముఖ్యత ఉండనే ఉంది.

అమెరికా ఆందోళన తప్పనిసరి అయ్యే మిలటరీ బెదిరింపుల గూర్చి కాదని, వనరులను సొంతం చేసుకునే దీర్ఘకాలిక వ్యూహాత్మక స్థానం గూర్చి అని విశ్లేషకులు అంటున్నారు. శత్రువులు ప్రభావవంతులు కాకుండా నిరోధించటం, ఆర్కిటిక్‌పై ఆధిపత్యం నెలకొల్పుకోవటం అని కూడా అంటున్నారు.

ఖనిజాలు లేదా ఆయిలు తన వైఖరిని నిర్ణయించలేదని ట్రంప్ అంటున్నారు. గ్రీన్‌ల్యాండ్‌లోని వనరుల సామర్థ్యం తమ అంతర్గత అంచనాల్లో ప్రాముఖ్యత వహించిందని ట్రంప్ సొంత సలహాదారులు ప్రైవేటుగా ధృవీకరిస్తున్నారు.

కవ్వింపుపూర్వక ప్రకటనగా ప్రారంభమైన విషయం మరింత పర్యవసాన సమస్యగా మారింది; నాటోకు, యూరప్ రాజకీయ వెన్నెముకకు, అమెరికా నాయకత్వ విశ్వసనీయతకు పరీక్షగా మారింది. ట్రంప్ ఎత్తుగడ డెన్మార్క్ లేదా గ్రీన్‌ల్యాండ్‌ను ఏకాకిని చేయటానికి బదులు ఐరోపా యూనియన్ ఐక్యతను పట్టిష్టం చేసింది; గ్రీన్‌ల్యాండ్ గుర్తింపును పెంచింది, సార్వభౌమాధికారం పట్ల వాషింగ్టన్ గౌరవం విషయంలో – ముఖ్యంగా అనుకూల పరిస్థితుల్లో ప్రపంచంలో సందేహాలు కలుగజేసింది.

(ఐపిఎ సర్వీస్)

## హైలైట్స్

అమెరికా జనవరి 3న వెనిజులాపై దాడిచేసిన దరిమిలా ట్రంప్ గ్రీన్‌ల్యాండ్‌పై తమ క్లెయిం విస్తరించారు. ట్రంప్ పదేపదే ప్రకటనలు ట్రాన్స్‌అట్లాంటిక్ (యూరప్, అమెరికా) సహకారాన్ని గందరగోళంలో పడవేశాయి. ట్రంప్ జనవరి 17న 8 ఐరోపా దేశాలపై (డెన్మార్క్, జర్మనీ, ఫ్రాన్స్, యుకె సహా) 10శాతం సుంకాలు విధించటంతో ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి.

* * *

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన నాటి నుండీ అమెరికా యూరప్‌కు ప్రధానమైన భద్రతా హామీదారుగా ఉంది. సమష్టి రక్షణ సూత్రంపై నాటో నిర్మాణమైంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో సోవియట్ యూనియన్‌కు నిరోధకంగా అది శక్తిమంతంగా పనిచేసింది. అమెరికాకు యూరప్‌లో కనీసం 37 సైనిక స్థావరాలున్నాయి. వాటిలో సుమారు 85 వేల అమెరికన్ సైనికులున్నారు. నాటో బడ్జెట్‌లో కనీసం మూడింట రెండువంతులు అమెరికా భరిస్తున్నది. ఇప్పుడు డెన్మార్క్ సార్వభౌమాధికారానికీ, నాటో ఐక్యతకూ ముప్పు బయట నుంచి గాక అత్యంత శక్తివంతమైన అమెరికా నుంచి వచ్చింది.

* * *

ట్రంప్ రష్యా, చైనాలను బూచిగా చూపి గ్రీన్‌ల్యాండ్స్ స్వాధీనం కోరుతున్నారు. అందుకు నాటో సహాయం కోరుతున్నారు. నాటోకు నిబద్ధుడినంటున్నారు. యూరప్ కోరుకుంటున్నట్లు రష్యాపై ఉక్రేన్ యుద్ధం కొనసాగాలంటే అమెరికా అండ అవసరం. ట్రంప్ బెదిరింపులను యూరప్ నాయకులు ఎలా ఎదుర్కోగలరన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్న.

# చేనేతకు చేయూతనిస్తూ ఆదుకోవాలి!

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత వస్త్ర పరిశ్రమ కీలకమైన భాగము. దీని ద్వారా దాదాపు 5 కోట్ల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పిస్తుంది. ఉపాధి విషయంలో వ్యవసాయం తర్వాత చేనేతది రెండవ స్థానం, కుటీర పరిశ్రమ మీద కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్నది చేనేత పరిశ్రమ. ప్రత్యక్షంగా పరోక్షంగా రాష్ట్రంలో 70 లక్షల మందికి పైగా ఈ పరిశ్రమ ఉపాధి కల్పిస్తుంది. వీరు మగ్గాల మీద నేసిన వస్త్రాలు, దేశం మొత్తం వస్త్రాల ఉత్పత్తిలో 20% పైగా ఉంటాయి. ప్రపంచ చేనేత వస్త్రాలలో 90 శాతం పైగా భారతదేశంలో నేస్తారు. భారతదేశంలో దాదాపు 150 చేనేత కేంద్రాలు ఉన్నాయని అంచనా. నూలు, కాటన్, సిల్క్, పట్టు ఇతర సహజంగా ఉపలబ్ధమయ్యే నార, పీచులతో చేనేత కళాకారులు అద్భుతమైన వస్త్రాలు తయారు చేస్తారు. ప్రస్తుతం దేశ జీడీపీలో 2.3 శాతంగా ఉంది. 2023–24లో ఈ రంగం ద్వారా రూ.3 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు జరిగాయని, దీన్ని 2030 నాటికి రూ. 9 లక్షల కోట్లకు పెంచాలని లక్ష్యంతో ఉన్నామని దేశ ప్రధాని మోడీ ప్రకటించారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకపథకం (పిఎల్ఐ) నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్( ఎన్ హెచ్ డి పి) ద్వారా నేతన్నలకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని, వారికి అంతర్జాతీయ మార్కెటింగ్ సదుపాయాలతోపాటు మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు.

తెలంగాణలో చేనేత రంగంలో 40 వేల కుటుంబాలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు అవుతున్నాయి. పోచంపల్లి, ఆలేరు, కనుకుల, శాయంపేట, కమలాపూర్, ఆర్మూర్, వెల్టూర్, వేములవాడలో బ్లాక్ లెవెల్ క్లస్టర్లు ఏర్పాటు అయ్యాయి. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయించారు. కరోనా మహమ్మారి వ్యాప్తి సందర్భంగా విధించిన లాక్ డౌన్ చేనేత పరిశ్రమను మరింత ప్రమాదంలోకి తోచింది. చేనేత, మరనేత రంగాలు ఇప్పుడు ఇదే ఇబ్బందుల్లో ఉన్నాయి. లాక్ డౌన్ వల్ల బట్టల వ్యాపారం పూర్తిగా ఆగిపోయింది. దీని ప్రభావం నేత కార్మికులపై తీవ్రం గా ఉంది. ప్రభుత్వాలు చేనేత రంగానికి తగు ప్రోత్సాహం అందించటంతో పాటు ప్రతి భారతీయుడు తాము కొనే వస్త్రాలలో దుప్పట్లు, తువ్వాళ్ళు, కర్టెన్లు మొదలైన నిత్యం వాడే వస్తువుల్లో కనీసం 15–20% చేనేత తయారీలో వాడగలిగితే మన ప్రాచీన సాంస్కృతిక సంపద, వారసత్వం మన కలుగుతుంది. చేనేతమీద ఆధారపడ్డ లక్షలాది కుటుంబాలు మనుగడ సాగించగలుగుతాయి.



**సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి:** తెలంగాణ రాష్ట్రంలో 336 చేనేత సహకార సంఘాలలో 40,000 మంది సభ్యులు ఉన్నారు. ఉమ్మడి ఏపి లో 2013 ఫిబ్రవరిలో చేనేత, మరమగ్గాల సహకార సంఘాలకు ఎన్నికలు జరిగినవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాల అయినప్పటికీ, నేటికీ ఎన్నికలు జరగలేదు.ఐదేళ్ల గడువు ముగిసినాక 2018 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించకుండా పర్సనల్ ఇన్చార్జిలుగా కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. 2025 ఆగస్టు12 తో పర్సనల్ ఇన్చార్జీల పాలన కూడా ముగిసింది. సంఘాలకు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని కోరుతున్నారు.

**నేతన్నల రుణమాఫీ వ్యథలు :** తెలంగాణలో గత ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలకు రూ. ఒక లక్ష రుణమాఫీని చేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 9న హైదరాబాద్లో జాతీయ చేనేత సాంకేతిక సంస్థ(ఎన్ఐఎచ్ టి) ప్రారంభోత్సవ సందర్భంగా చేనేత కార్మికులకు లక్ష లోపు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి జీవో 56 జారీ చేసింది. 2025–26 బడ్జెట్ నుంచి రూ. 33 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సంవత్సరం గడుస్తున్నా చేనేత రుణమాఫీ అమలుకు నోచుకోలేదని నేతన్నలు తెలుపుతున్నారు.

రాష్ట్రంలో చేనేత కార్మికుల సంఖ్య 2013 అంచనాల ప్రకారం 2 లక్షల 12 వేలు. మొత్తం రుణ గ్రహీతల సంఖ్య 32,476. రుణమాఫీకి ప్రభుత్వం కేటాయించిన మొత్తం రూ. 33కోట్లు. అంటే లబ్ధిదారులకు సగటున మాఫీ రూ. 10,200 మాత్రమే. మొత్తంగా లబ్ధిదారుల్లో 20% మందికి మాత్రమే రుణమాఫీ వర్తిస్తుంది. కాగా దీనిలో తిరస్కరించిన దరఖాస్తులు సగానికి పైగా ఉండటం గమనార్హం. సిరిసిల్ల జిల్లాలో రుణమాఫీకి 6245 దరఖాస్తులందాయి. వాటిలో ఆమోదం పొందినవి కేవలం 2,312 మాత్రమే. తిరస్కరణకు గురైనవి 3933 ఉన్నాయి. గద్వాల జిల్లాలో రుణమాఫీకి దరఖాస్తులు 3,110 రాగా, ఆమోదం పొందినవి 1,225 మాత్రమే. తిరస్కరించిన దరఖాస్తులు1,885. వరంగల్ జిల్లాలో అందినవి దరఖాస్తులు 5,320 కాగా,2,998 ఆమోదం పొందాయి. 2,422 దరఖాస్తుల్ని తిరస్కరించారు. నల్లగొండ జిల్లాలో రుణమాఫికి దరఖాస్తులు 4,789 కాగా, లబ్ధిదారుల సంఖ్య 2,308 మంది మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో తిరస్కరణకు గురైన దరఖాస్తులను మరోసారి పరిశీలించి నేతన్నలు రుణ విముక్తి చేయాలని కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల లోపు రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని.. సహకార సంఘాల్లో నిల్వఉన్న వస్త్రాలు టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని సిపిఐ సభ్యులు శ్రీ నెల్లికంటి సత్యం శాసన మండలిలో డిమాండ్ చేశారు. రాష్ట్ర సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జవాబిస్తూ రాష్ట్రంలో 2017 నుంచి 2023 వరకు 6,784 మంది చేనేత కార్మికులకు రూ. లక్ష లోపు రుణమాఫీ కోసం రూ. 27.14 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. చేనేత, భరోసా పొదుపు పథకం కింద రూ. 303 కోట్లు, పావలా వడ్డీ కింద రూ. 109 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. టెస్కో ద్వారా చేనేత కార్మికుల నుంచి రూ. 587 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు.

ఉజ్జిని రత్నాకర్ రావు,
949095 2646

## లైసెన్స్ సర్వేయర్లు భూ సమస్యలకు స్థిరమైన పరిష్కారం చూపాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : గ్రామాలలో భూమి కొలతల సమస్య తీర్చుటకు గాను వ్రాత పరీక్ష ద్వారా ప్రభుత్వం ఎంపిక చేసిన మొదటి బ్యాచ్ లైసెన్స్ సర్వేయర్ల 45 రోజుల శిక్షణ కాలం పూర్తయిన సందర్భంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ మొదటి విడత శిక్షణ చేసుకున్న లైసెన్స్ సర్వేయర్లు నూతన నైపుణ్యంతో భూభారతి, ధరణి, ఎల్ఆర్పి సమస్యలు ఉన్న భూములను సర్వే చేసి ఖచ్చితమైన నివేదిక అందించాలన్నారు. స్థిరమైన పరిష్కారం, ఖచ్చితమైన కొలతలు ఉండాలని ఆ విధంగా గ్రామాలలో తహాశీల్దార్, జిపిఓ సహాయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మీ మీద రైతులకు అపార నమ్మకం కలిగేలా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టి సూర్యాపేట జిల్లాను భూమి రికార్డుల విషయంలో ముందు వరుసలో నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్, మండల సర్వేయర్లు ఇతరులు హాజరయ్యారు.

## ఇంటి వద్ద నుండే ఎఫ్ఐఆర్ నమోదు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : బాధితులు ఇక ఇంటి నుండే ఎఫ్ఐఆర్ నమోదు చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుందని జిల్లా ఎస్పి కె నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఫోన్ చేస్తే ఇంటికే పోలీసులు వచ్చి ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేసి బరోసా కల్పించడం కోసం సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. పోలీసు సేవల్లో పారదర్శకత కోసం తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అమలులోకి తెచ్చిన నూతన ప్రణాళిక కార్యాచరణను జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తామని తెలిపారు. శారీరక దాడులకు గురైయ్యే వారికి, ఎస్సి, ఎస్టి వర్గాల ప్రజలకు, బాలలకు, ర్యాగింగ్‌కు గురయ్యే విద్యార్థులకు, వేధింపులకు గురయ్యే మహిళలకు, బాలలకు ఇది ఎంతో సహాయపడనుందన్నారు. దీని ప్రకారం అన్ని పోలీసు స్టేషన్ల సిబ్బందికి, అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఫోన్‌కాల్, ఆన్‌లైన్ అభ్యర్థన లేదా ఇతర మార్గాల ద్వారా సమాచారం అందగానే సంబంధిత పోలీసు సిబ్బంది బాధితుల నివాసానికి చేరుకుని ఫిర్యాదు నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా ఫిర్యాదుల నమోదు ప్రక్రియ మరింత వేగవంతమవడంతోపాటు పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకం పెరుగుతుందని వివరించారు.

## పంటల పేరుతో యూరియా కోత

రైతులను ఇబ్బంది పెడుతున్న అధికారులు

యూరియా ఆన్‌లైన్ నమోదులో అవకతవకలు



**ప్రజాపక్షం /మునుగోడు** : రైతుల పంట పొలాలకు ఉపయోగించే యూరియాను కొనుగోలు చేయాలంటే రైతులు నానా ఇబ్బందులకు గురై యూరియా ని కొనుగోలు చేసేవారు.అలాంటి ఇబ్బందులు రైతులు ఎదుర్కోకుండా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల రోజుల నుండి ఆన్లైన్లో రైతులకు కావలసిన యూరియాని బుక్ చేసుకునే వసతిని కల్పించింది. దానికి అనుగుణంగా మండల రైతులు మండలంలోని వివిధ ప్రభుత్వ,ప్రైవేట్ ఫర్టిలైజర్స్ దుకాణాలలో ఉన్న స్టాక్ ఆధారంగా మండలంతో పాటు ఇతర మండలాల రైతులు యూరియాను బుక్ చేసుకుంటున్నారు. రైతులు యూరియాను బుక్ చేసుకుని సమయంలో ఏ పంట సాగు చేశారో ఆ పంటని ఆన్‌లైన్‌లో నమోదు చేసి యూరియాను బుక్ చేసుకోవాల్సిన వసతిని కల్పించారు. దానికి అనుగుణంగా రైతులు యూరియాని నమోదు చేసుకుంటున్నారు. అధికారులు మాత్రం దానికి విరుద్ధంగా ఇప్పుడు ఉన్న కాలానుగుణంగా మీరు ఈ పంటని సాగు చేయలేదని పంట సాగుతో వారు బుక్ చేసుకున్న యూరియా బ్యాగులను కొరత విధిస్తున్నారని రైతులు వాపోతున్నారు.అదే సమయంలో పిఏసిఎస్ కేంద్రాన్ని వచ్చిన ఏడిఏ వేణుగోపాల్ అధికారి యూరియా అవకతకులపై వివరణ కోరగా యూరియా విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగే ప్రమేయం లేదని బుక్ చేసుకున్న రైతులకు పారదర్శకంగా యూరియాను సరఫరా చేస్తామని సమాధానం తెలిపారు.

## గ్రామస్థాయికి రెడ్‌క్రాస్ కార్యకలాపాలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : యువత,స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రెడ్ క్రాస్ కార్యకలాపాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్,రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు విష్ణుదేవ్ వర్మ అన్నారు.లోక్ భవన్‌లో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి మొదటి సమావేశం బుధవారం నిర్వహించారు.ఈసందర్భంగా రెడ్ క్రాస్ అధ్యక్షులు జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం అన్నారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందించే మానవతాసేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యం,విపత్తు నిర్వహణ,రక్తదానం,పోషణ వంటి రంగాల్లో రెడ్ క్రాస్ పాత్రను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.జూనియర్,యూత్ రెడ్ క్రాస్‌ను మరింత బలోపేతం చేసి యువతను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమావేశంలో నల్లగొండ జిల్లా చైర్మన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి,రాష్ట్ర పాలక మండలి సభ్యులుమందడి నర్సిరెడ్డి,మండలి సభ్యులు పాల్గొన్నారు.

## కందులకు కనీస మద్దతు ధర

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న కందులకు కనీస మద్ధతు ధర క్వింటాకు రూ.8వేలు చెల్లించబడుతుందని అదనపు కలెక్టర్ కె సీతారామారావు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో మార్కెటింగ్, అగ్రికల్చర్, సహకార శాఖ అధికారులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఎన్‌సిసిఎఫ్ జిఓఐ, తెలంగాణ రాష్ట్ర మార్కెఫెడ్ (టిజి మార్కెఫెడ్) సంయుక్తంగా సూర్యాపేట జిల్లాలో కందులను కనీస మద్ధతు ధరకు (ఎంఎస్‌పి) కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుగుణమైన కందులకు క్వింటాల్‌కు రూ.8 వేల కనీస మద్ధతు ధరగా నిర్ణయించబడిందని వివరించారు. సూర్యాపేట జిల్లాలో రైతులకు సౌకర్యంగా ఉండేందుకు త్వరలోనే వ్యవసాయ మార్కెట్ కమిటి, తిరుమలగిరి కొనుగోలు కేంద్రాలను సంబంధిత ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## సిట్ విచారణకు భయపడే హరీష్ రావు డ్రామాలు

'సృజన్ రెడ్డి' మీ అల్లుడే కదా.. నిజాలు బయటపడతాయని కుట్రలు!

సింగరేణిపై విచారణకు సిద్ధమా? కేంద్రానికి లేఖ రాయండి : ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి సవాల్



**ప్రజాపక్షం/యాదాద్రి** : ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతోనే మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఆయన దావూస్ నుంచి మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతల తీరును తీవ్రంగా ఖండించారు. సిట్ విచారణను, అందులోని అసలు అంశాలను పక్కదారి పట్టించేందుకే హరీష్ రావు కొత్త ట్రిక్స్ ప్లే చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సృజన్ రెడ్డి తనకి దూరపు చుట్టం అని గతంలోనే స్పష్టంగా చెప్పారని కిరణ్ రెడ్డి గుర్తు చేశారు. 'సృజన్ రెడ్డి బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డికి స్వయానా అల్లుడు. నా అల్లుడిని ఎందు కు బద్నాం చేస్తున్నారని గతంలో కందాల ప్రశ్నించలేదా?' అని ఆయన నిలదీశారు. బిఆర్ఎస్ హయాంలోనే సృజన్ రెడ్డికి, ప్రతిమ శ్రీనివాస్ రావుకు, హర్ష, సుధాకర్ రెడ్డి వంటి వారికి కాంట్రాక్టులు ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. కేటీఆర్, హరీష్ రావు బంధు వులకే గతంలో సింగరేణి కాంట్రాక్టులు కట్టబెట్టారని ఆరోపించారు.

'బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, తన సొంత ఇంటి అల్లుడి ఫోనే ట్యాప్ చేశారని కవిత స్వయంగా చెప్పారు. ఆ అక్రమాల్లో ఏం జరిగిందో తెలంగాణ సమాజానికి తెలియాలనే సిట్ దర్యాప్తు కొనసాగుతోంది' అని ఎంపీ పేర్కొన్నారు. తప్పు చేయనప్పుడు విచారణకు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు.

**సింగరేణిపై బహిరంగ సవాల్**

సింగరేణిలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న కేటీఆర్, హరీష్ రావులకు కిరణ్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. 'మీకు దమ్ముంటే 2014 నుంచి 2026 వరకు సింగరేణిలో ఏం జరిగిందో నిగ్గు తేల్చాలని కేంద్రానికి లేఖ రాయండి. 'కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో మీకు మంచి సంబంధాలు ఉన్నాయి కదా, బావా బామ్మర్దులు ఇద్దరూ కలిసి విచారణ కోరండి.'

'నేను కూడా లోక్ సభ సభ్యునిగా నిజానిజాలు తేలాలని కేంద్రానికి లేఖ రాస్తా ను.' అని సవాల్ చేశారు. హిల్ట్ పాలసీపై కేవలం చర్చ మాత్రమే జరిగిం దని, అందులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని ఎంపీ స్పష్టం చేశారు. 5 లక్షల కోట్ల కుంభకోణం అంటూ కేటీఆర్, హరీష్ రావు చేస్తున్న హడావుడి హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అధికార దుర్వినియోగం ఒక్కొక్కటిగా బయటపడుతుంటే తట్టుకోలేకనే బిఆర్ఎస్ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని చామల కిరణ్ రెడ్డి మండిపడ్డారు.

## కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా


ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కలిసిన గ్రామ పంచాయతీ కార్మికులు



**ప్రజాపక్షం/చండూరు:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను బుధవారం చండూరు మండల గ్రామ పంచాయితీ మల్టీపర్పస్ కార్మికులు మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకుపోయారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీ సత్యంను శాలువాతో సన్మానించారు. గ్రామ పంచాయితీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా గ్రామాలలో వెట్టి చాకిరి చేస్తున్నారని , ఉద్యోగ భద్రత లేదని ,ఈఎస్ఐ ,పీఫ్ తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. తక్కువ వేతనం ఇవ్వడంతో పాటు 3నెలలకు ఒక్కసారికూడ వేతనాలు ఇవ్వకుండ ఆస్యలం చేస్తున్నారని తెలిపారు. జీతాలు ఆలస్యంగా ఇవ్వడం ద్వార రోజువారి అవసరాలు తీర్చుకోలేకపోతున్నామని అప్పులు పెరుగుతున్నాయని ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రస్తుత వేతనాలను పెంచి కనీస వేతనం నెలకు 26వేల రూపాయలు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. కనీస వేతనాలు ,ప్రమాద బీమా, ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , గ్రామ పంచాయితీ మల్టీపర్పస్ కార్మికుల మండల అధ్యక్షుడు నాంపల్లి శంకర్ , మండలప్రధాన కార్యదర్శి రేవల్లి సైదులు , కోశాధికారి చారి పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా బలమైన శక్తులుగా మారాలి

భువనగిరిఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ఆకాశమే హద్దుగా మహిళలు ఆర్థికంగా బలమైన శక్తులుగా ఎదగాలని భువనగిరి కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన స్వయం సహాయక సంఘాలకు మెప్మా ఆధ్వర్యంలో వడ్డీలేని ఋణాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్డీవో శేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 430 మహిళా సంఘాలకు గాను రూ.1.11కోట్ల చెక్కులను సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. మహిళలకు ఇందిరమ్మ చీరను అందజేశారు. కళ్యాణ షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్క పోచంపల్లి మున్సిపాలిటీకే రూ.47.9 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. అన్ని మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. కేవలం పోచంపల్లి పట్టణంలోని ఇంత పెద్ద మొత్తంలో వడ్డీ మాఫీ డబ్బులు 4300 మందికి ఖాతాలో జమవుతుందంటే చాలా గర్వించదగ్గ విషయమని అన్నారు. గౌరీ నుండి కొత్తగూడెం వరకు ఎక్స్‌ప్రెస్ హైవే పనులను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. రూ.12 వేల కోట్లతో మినీ ట్యాంక్ బండ్ పనులు జరుగుతున్నట్లు మొదటి విడతగా రూ 9.5 కోట్లతో పనులు మొదలు నడుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఇంజన్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు పళ్లెం రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలలో మహిళలను అధిక సంఖ్యలో చేర్పించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ** :గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా మహిళలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముందుకు తీసుకువెళ్లడంలో డిపిఎంలు,ఏపీఎంలు ముఖ్యపాత్ర పోషించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు.స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సాధ్యమైనంత మందిని సంఘాలలో సభ్యులుగా చేర్పించాలని, కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని,గ్రామైక్య సంఘాల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని,బుక్కుల నిర్వహణ, రుణాలు పొందడం,తిరిగి చెల్లించడం, రికార్డుల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలని, జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులందరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉల్లాస్ అక్షరమాల కార్యక్రమంలో చదువుకునేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటివరకు ఈ కార్యక్రమాలకు హాజరు కాని వారిని గుర్తించి హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని, మొదటి బ్యాచ్‌లో గుర్తించిన వారందరూ నూటికి నూరు శాతం చదువుకొని ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలని ఆదేశించారు. దివ్యాంగుల ధ్రువ పత్రాల జారీలో భాగంగా ఇంకా 914 మందికి ఇవ్వాల్సి ఉందని,ఎప్పటికప్పుడు ధ్రువపత్రాలు జారీ చేస్తూనే, సదరం శిబిరాల నిర్వహణలో కొత్తగా వచ్చిన వాటిని కూడా అదే సమయంలో ప్రాసెస్ చేయాలని చెప్పారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటీండెంట్ నరసింహారావు,జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు,ఏపీఎంలు ఈ హాజరయ్యారు.

## బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు



**ప్రజాపక్షం/యాదాద్రి** : బాలకార్మికులను పనులలో పెట్టుకుంటే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మరియు రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం మినీ మీటింగ్ హాల్‌లో బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన ఆపరేషన్ స్మైల్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, అడిషనల్ డిసిపి లక్ష్మి నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి నర్సింంహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లడుతూ 0 నుండి 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎక్కడ పని చేసిన, వెట్టి చాకిరీ చేయించిన వారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. జనవరి నుండి 97 మంది పిల్లలను రెస్క్యూ చేయటం జరిగిందని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. పిల్లల సంరక్షణ కొరకు 1098కు సమాచారం ఇవ్వాలని, ఈ హెల్ప్ లైన్ నంబర్ 24 గంటలు పనిచేస్తుందని తెలిపారు. జిల్లాలో ఆపరేషన్ స్మైల్‌కి సంబంధించిన 3 టీంలు 18 సంవత్సరాల లోపు బాల కార్మిక పిల్లలను పనిలో పెట్టుకున్నట్లయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి A1 గా ఓనర్ A2 మేస్త్రి A3 సంబంధిత పరిశ్రమల సూపర్ వైజర్స్ కేసులు నమోదు చేయాలని అన్నారు. పరిశ్రమల యజమానులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. పరిశ్రమలు ఎక్కువగా ప్రాంతాలు ఉన్న దగ్గర అంగన్వాడీ సెంటర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి.జెజెబి స్టాఫ్ కమిటీ, బీఆర్‌బీ కో ఆర్డినేటర్ అనంతలక్ష్మీ , జిల్లా డీఎంఏచ్ఓ అధికారి మనోహర్, ఎడి ప్రశాంత్ రెడ్డి, పోలీస్ శాఖ సిబ్బంది. ఎన్జీవో ప్రతినిధులు, చైల్డ్ హెల్ప్ లైన్ సిసిఐ సిబ్బంది, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన యూరియా అందించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులకు యుద్ధ ప్రాతిపదికన రైతులకు యూరియా అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌కు ఆయన వినతిపత్రం అందించి మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో యాసంగి సీజన్‌లో వరి నాటు వేసి దాదాపు 20 నుంచి 25రోజులు కావస్తుందని, రైతులకు సకాలంలో యూరియా అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవాలని చెప్పడంతో స్మార్ట్ ఫోన్‌లో ఉన్న రైతులు యూరియా బుకింగ్ చేసుకుంటే రైతులు ఉన్న గ్రామం కాకుండా చుట్టుపక్క 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు మీ యూరియా వచ్చిందని మీరు అక్కడికి పోయి తీసుకోమని చెప్తున్నారు. వచ్చిన రైతులు యూరియా తెచ్చుకోలేక నానా తంటాటు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి ఆన్‌లైన్ సిస్టంను రద్దు చేసి రైతులకు వ్యవసాయాధికారుల ద్వారా కాని ప్రభుత్వ అధికారుల ద్వారా గాని అన్ని గ్రామాలకు యూరియా సప్లయ్ అయ్యే విధంగా చూడాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సరిపడా యూరియా ఉందని మాటలు చెప్తున్నారే కాని యూరియా అందించడం లేదన్నారు. ఇప్పటికైనా యూరియాను రైతులకు సకాలంలో అం దించాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ, వేములపల్లి సీపీఐ మండల కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, కొండేటి సైదులు, ప్రవీణ్, నాగేష్, మున్ని,నాగునాయక్ ఉన్నారు.



## బాల్య వివాహాల నిర్మూలన బాధ్యత

నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హాలియా:** బాల్య వివాహాలను నిర్మూలించడంలో ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా గుర్తించాలని నల్లగొండ పార్లమెంటు సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ ఆధ్వర్యంలో లైన్ డిపార్ట్మెంట్స్ సహకారంతో బాల్య వివాహ విముక్తి ప్రచార రథాన్ని హాలియాలోని లక్ష్మినరసింహ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్ని నల్లగొండ ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికీ సమాజంలో అక్కడక్కడ బాల్యవివాహాలు జరుగుతున్నాయని వీటిని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందని చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టాలంటే ముందు వారి తల్లిదండ్రులకు సమాజంపై అవగాహన కలిగించి బాల్య వివాహాలు చేయడం వలన కలిగే అనర్థాలను వివరించినప్పుడే వాటిని అరికట్టవచ్చని తెలిపారు. సమాజంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ఈ సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కొమ్మనబోయిన శేఖర్,ఇంద్రారెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ శోభారాణి,రమేష్,చిన రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రమాదం...



**ప్రజాపక్షం/డిండి:** డిండి ఆదర్శ పాఠశాల విద్యార్థులకు విహార యాత్రలో ప్రమాదం జరిగింది. రెండు ట్రావెల్ బస్సుల్లో విద్యార్థులతో విహార యాత్రకు వెళ్లిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌లోని దివాన్ చెరువు వద్ద బస్సులు ప్రమాదానికి గురయ్యాయి. అక్కడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డిండి మోడల్ స్కూల్ కళాశాలకు చెందిన 9వ, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు మూడు రోజుల క్రితం విహారయాత్రకు బయలుదేరారు. 55 మంది బాలికలు, 54 మంది బాలురు, 10 మంది ఉపాధ్యాయులు , సిబ్బంది రెండు బస్సుల్లో అరకు, పాడేరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తిరుగు ప్రయాణంలో అన్నవరం సత్యనారాయణ స్వామి దర్శనం చేసుకుని మంగళవారం అర్ధరాత్రి దాటాక రాజమహేంద్రవరం వైపు వస్తున్న తరుణంలో దివాన్‌చెరువు పరిధిలో ఓ గేదె అడ్డురావడంతో ముందు వెళ్తున్న ట్రావెల్ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుకనున్న పిల్లల బస్సులు రెండు మరో ట్రావెల్ బస్సు ఒకదానికొకటి ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈప్రమాదంలో రెండు బస్సుల్లోని 26 మంది విద్యార్థులకు గాయాలయ్యాయని అక్కడి పోలీసులు తెలిపిన సమాచారం. గాయపడిన విద్యార్థులను 3 అంబులెన్స్‌లలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి, మిగిలిన విద్యార్థులను బాల వికాస్‌కు తరలించినట్లు సమాచారం.

**అజాగ్రత్త వల్లే ప్రమాదం....** బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడంతో పాటు డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని విద్యార్థుల తల్లి తండ్రులు వాపోతున్నారు. విద్యార్థులను విహారయాత్రకు తీసుకెళ్లిన ఉపాధ్యాయులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదం జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

## చోరీకి పాల్పడ్డ ముగ్గురి అరెస్టు



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : మండలంలోని కేసారం గ్రామంలో మెంతబోయిన బుచ్చమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా ఇంట్లో ఉండడం చూసి ఈనెల 19వ తేదీన ఆమె మెడపై ఉన్న బంగారు నల్లపూసల గొలుసును కొందరు దొంగలు చోరీ చేశారు. దీంతో ఆమె చిన్న కుమారుడు చిన్న మల్లయ్య రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరిపారు. ఈ చోరీకి పాల్పడ్డ ముగ్గురు దొంగలను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామ్లు తండకు చెందిన వాంకుడోతు పద్మ, వాంకుడోతు నీలమ్మ, జాటోతు చిలకమ్మ అనే ముగ్గురు మహిళలు ఈ చోరీకి పాల్పడట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిని జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు.

## రోగులకు మెరుగైన సేవలందించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ పి వనజ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎంజి రోడ్డులో నూతనంగా అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ఏఆర్ ఐ ఆసుపత్రిని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కళ్ళు మానవుని జీవితంలో అత్యంత ముఖ్యమైన భాగమని అందుకే సర్వేంద్రియానం నయనం ప్రధానం అనే నానుడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు యండి పాషా, డాక్టర్ సమీరా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన సేవలు అందించాలి



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల పట్టణ ప్రాథమిక కేంద్రంలో రోగులకు మెరుగైన సేవలు అందించి అండగా ఉండాలని మహబూబ్ నగర్ జిల్లా డాక్టర్ కృష్ణ సూచించారు. బుధవారం నాడు జడ్చర్ల పట్టణంలోని ప్రాథమిక కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి డాక్టర్ భానుప్రియ డాక్టర్ శివ కాంతులతో మాట్లాడారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన తెలిపారు. అదే విధంగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని వేలు పాటించాలని కింది స్థాయి సిబ్బంది ఆలస్యం చేసిన రోగుల పట్ల అసహ్యంగా ప్రవర్తించిన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అనంతరం ప్రాథమిక కేంద్రంలోని రిజిస్టర్ లను మందులను మౌలిక సదుపాయాలను ఆయన తనిఖీ చేసి డాక్టర్లతో సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యేకు శ్రీ రామ పట్టాభిషేక ఆహ్వాన పత్రిక



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** హైందవ శక్తి సేవా సంస్థ పాలమూరు ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ పట్టణంలోని గడియారం చౌరస్తా వద్ద నిర్వహించనున్న ఆయోధ్య బాలరాముని ప్రాణ ప్రతిష్ట ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, శ్రీనివాస్, రమేష్, శివకుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన




**ప్రజాపక్షం/మక్తల్ :** నియోజకవర్గంలో రూ.70 కోట్లతో నిర్మించనున్న 220 కేవీ సబ్ స్టేషన్ కోసం స్థలాన్ని బుధవారం మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం నది పరివాహక ప్రాంతంలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్‌కి ప్రస్తుతం మక్తల్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతున్న అవసరాలకు రాబోయే కాలంలో ముందు చూపుతో 220 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా రూ.70 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం ఉన్న 132 కేవీ సబ్ స్టేషన్ స్థలంలో 220 టీవీ సబ్ స్టేషన్‌కి అభివృద్ధి చేయాలని నర్వ మండలంలో కరెంట్ కష్టాలు ఉండటంతో 132 కేవీ సబ్ స్టేషన్‌కి బదిలీ చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో 220 సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలో భాగంగా మంత్రి వాకిటి శ్రీహరి నూతనంగా ఏర్పాటు చేయబోతున్న సబ్ స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలించారు. మక్తల్ పట్టణంలో హైవేకు ఆనుకొని ఉన్న స్థలంలో భవిష్యత్ లో అభివృద్ధి అయ్యే అవకాశం ఉండటంతో ఇప్పటికే 150 పడకల ఆసుపత్రి. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు, నూతన కోర్టు భవనం అందుబాటులో రావడం శుభపరిమణామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్, ఇంజినీర్ నాగశివ, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** తెలంగాణ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద యాసంగి పంటకు అందించే రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహ బుధవారం ఉట్కూర్ మండంలోని బిజ్వార్ గ్రామంలో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. యాసంగి సీజన్‌లో రైతులు వరి, మొక్కజొన్న, కీరాదోసకాయ, పెసర్లు, అలసందలు వంటి పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. పేద రైతులు ఈ పంటలను సాగు చేయడానికి సరైన పెట్టుబడి లేక ప్రైవేట్ అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. ఈ అప్పుల కారణంగా పంటలు పండించినప్పటికీ రైతులకు లాభం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో సకాలంలో రైతు భరోసా నిధులు అందిస్తే రైతులు అప్పుల భారాన్ని తప్పించుకోవచ్చని పేర్కొన్నారు. గత నాలుగు నుంచి ఐదు సంవత్సరాలుగా కూలీ రేట్లు, వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరిగినందున రైతులు పండించిన పంటలు అమ్మినా పెట్టుబడికి మాత్రమే సరిపోతున్న పరిస్థితి నెలకొందన్నారు. కొన్నిసార్లు అతి వృష్టి, అనావృష్టి కారణంగా పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదని విచారం వ్యక్తం చేశారు. కావున సంబంధిత అధికారులు రైతులు కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతు భరోసా నిధులు సరి అయిన సమయంలో అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యకు 25% నిధులు కేటాయించాలి



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** భారతరాజ్యాంగంలో పొందుపర్చిన ప్రాథమిక హక్కులలో విద్యాహక్కుచట్టంకూడా ఉందని రాష్ట్రబడ్జెట్‌లో విద్యకు 25 శాతం నిధులు కేటాయించాలని బహుజన ప్రజాశక్తి జిల్లా నాయకులు పర్వతాలు జ్యోతి అన్నారు. మండలకేంద్రంలో బిపిఎస్ నాయకులు పర్వతా లు , జ్యోతి బహుజన ప్రజాశక్తి తెలంగాణరాష్ట్ర కరపత్రాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్‌చైర్మన్ దండునర్సింహ్మకు , ఇతరులకు అందజేశారు. ఈసందర్భంగా బహుజన ప్రజాశక్తి నాయకులు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ సమావేశంలో విద్యాహక్కుచట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని బహుజన ప్రజాశక్తి డిమాండ్ చేస్తుందని, ఈనెల 27న హైదరాబాద్ ఇందిరాపార్కు దగ్గర ఉదయం 11గంటలకు బహుజన ప్రజాశక్తి ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందని ఈసమావేశం విజయవంతం చేయాలన్నారు.

## బస్తీ దవాఖాన ప్రారంభించిన ఎమ్మెల్యే


**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో బస్తీ దవాఖానను ప్రారంభించి, అనంతరం మానసిక వికలాంగుల సంస్థ ఆధ్వర్యంలోని యన్‌హెచ్‌సి సెంటర్ ను పరిశీలించి, చిన్నారులతో ఆత్మీయంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జియంఆర్) సంభాషించారు. అనంతరం కొత్తకోట మున్సిపాలిటీలో సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే జియంఆర్ శంఖుస్థాపన చేశారు.



# జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వీర్యం

- మహాత్మా గాంధీ ఉనికి లేకుండా చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- భారత రాజ్యాంగాన్ని మార్చుటకు బిజెపి కుట్రలు
- వి బిజి–రామ్ జి పేరు వెనక్కి తీసుకోవాలి

రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/అమరచింత / మక్తల్ :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేసి కేంద్ర ప్రభు త్వం కొత్తగా విబి జిరాం జీ పేరుతో ఉపాధి హామీ పథకాన్ని తెచ్చి పేదలకు ఉపాధి హామీ పథకాన్ని దూరం చే సేందుకు కుట్రలు చేసిందని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆందోళన చెందారు. బుధవారం అమరచింత మున్సిపాలిటీలోని అంబేద్కర్ విగ్రహం ముందు కాంగ్రెస్ శ్రేణులు తలపెట్టిన కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విబి జి రామ్ జి చట్టానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమంలో వాకిటి శ్రీహరి హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పేర్లు తీసివేసి విబిజి రాంజీ పేరు పెట్టడం వల్ల కేంద్రానికి ఏమి లాభమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో బాపు అద్దాల గుర్తుని పెట్టుకుని కార్యక్రమాలను నిర్వహిస్తూ ఒక పక్క మహాత్మా గాంధీ ఉనికిని లేకుండా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రపంచ దేశాలు బాపూజీ శాంతి మంత్రం జపిస్తూ కొనియాడుతుంటే కేంద్ర ప్రభుత్వం గాంధీ ఆలోచనలను, శాంతియుత సిద్ధాంతాలను లేకుండా చెయ్యాలనే కుట్రలో భాగంగానే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మార్పు చేయడం ఎంతవరకు సమంజసమైందని మంత్రి ప్రశ్నించారు. అలాగే భారత రాజ్యాంగాన్ని మార్చుటకు బిజెపి అనేక కుట్రలు చేస్తోందని వాకిటి శ్రీహరి కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని మంత్రి కేంద్ర ప్రభుత్వానికి డిమాండు చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున బడుగు బలహీన వర్గాల పేదల పక్షాన నిలబడి ఉద్యమాలు నడిపిస్తామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కల్లుగీత సెల్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు కేశం నాగరాజు గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎస్ఎం.అరుణ్ కుమార్ , జిల్లా నాయకులు అయుబ్‌ఖాన్, మండల నాయకులు మహంకాళి విష్ణు, మార్కె ట యార్డు కమిటీ సభ్యులు పోసిరి విష్ణు, శ్యామ్ , దేవరకొండ మోహన్, కమలాకర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రూ.కోటి 15 లక్షలతో సీసీ రోడ్డు పనులు

మక్తల్ నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయమని రాష్ట్ర పశు సంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. నియోజకవర్గ కేంద్రం మక్తల్ పట్టణంలోని 7వ వార్డులో మైసమ్మ దేవాలయం నుండి అయ్యప్ప స్వామి దేవాలయం వెనక వరకు రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి భూమి పూజ చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని చందాపూర్ గ్రామంలో రూ.90 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు సైడ్ డ్రైనేజీ పనులకు మంత్రి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయమని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం ప్రత్యేకించి పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నియోజకవర్గం అభివృద్ధిలో నిర్లక్ష్యానికి గురైందని అన్నారు.గడిచిన రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక వెయ్యి 35 కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. అందులో భాగంగా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో రెండు ప్రాంతాల్లో ఒక కోటి 15 లక్షల రూపాయలతో చేపడుతున్న సీసీ రోడ్డు డ్రైనేజీ పనులకు భూమిపూజ చేసుకోవడం జరిగిందన్నారు. అభివృద్ధిని కోరుకునే వారు ఎవరైనా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాల్సిందిగా మంత్రి విజ్ఞప్తి చేశారు. మీ అందరి ఆశీర్వాదంతోనే అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొస్తున్నామని మరింత అభివృద్ధి కోసం మీ అండ దండ కావాలని మంత్రి విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గవినోళ్ళ బాలకృష్ణా రెడ్డి, కట్టా సురేష్ కుమార్ గుప్తా, బి. గణేష్ కుమార్, బోయ రవికుమార్, కోళ్ళ వెంకటేష్, సాలంబిన్ ఉమర్ బస్రవి, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ పేరు యధావిధిగా కొనసాగించాలి



**ప్రజాపక్షం/పెబ్బేరు:** నిరుపేదలకు జీవనోపాధి దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ప్రధాని డా. మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చి కొత్త పేరు ప్రవేశపెట్టిన కేంద్ర బిజెపి ప్రభుత్వం తీరుకు నిరసనగా ఎఐసిసి, పిసిసి పిలుపు మేరకు, ముఖ్యంగా డిసిసి అధ్యక్షులు శివసేన రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు పెబ్బేరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం దగ్గర పెబ్బేరు పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించి, తమ నిరసన తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం మానుకోవాలని, దేశానికి స్వతంత్రం సిద్ధింపచేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీని, వారి పేరును, ముమ్మాటికీ కొనసాగించాలని లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ విజయ్ వర్ధన్ రెడ్డి, జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మండల సీనియర్ నాయకులు సురేందర్ గౌడ్, యుగేందర్ రెడి, రాములు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఆర్‌జెడి ఎం.సోమిరెడ్డి




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాలో పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించడంతోపాటు విద్యలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేసేలా సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాధికారులు పర్యవేక్షణ చేయాలని , పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భద్రతపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ప్రాంతీయ విద్యాశాఖ సంచాలకులు(ఆర్‌జెడి) ఎం.సోమిరెడ్డి అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించిన ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించి జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్‌తో కలిసి విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులతో సమావేశమయ్యారు. విద్యాశాఖ పరిధిలో చేపట్టిన పలు అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆర్‌జెడి ఎం. సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను తరుచుగా తనిఖీచేసి విద్యాభివృద్ధికి మరింత కృషిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన బోజనం అందేలా పర్యవేక్షణ అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఆదేశించారు. పిఎంశ్రీ నిధులను వందశాతం వినియోగించిన పెద్దకొత్తపల్లి కేజిబివి ప్రత్యేక అధికారిని సన్మానించారు. ఈసమావేశంలో సమగ్రశిక్ష గణాంక అధికారి మధుసూదన్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారులు షర్పుద్దిన్, నూరుద్దిన్, వెంకటయ్య, శోభారాణి, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, సుజాత, వెంకటేశ్వర్లశెట్టి ఉన్నారు.

## వనపర్తి కీర్తి ప్రతీకకు దక్కిన గౌరవం

మొత్తం రూ.23 కోట్ల 15 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్ :** 140 సంవత్సరాలకు పైగా ఘనకీర్తి గల వనపర్తి లోని రాజుగారి బంగ్లా (రాజ మహల్) వందల సంవత్సరాలైన ఆదరణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటుందని గమనించిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి రాజమహల్ పునరుద్ధరణ పై ప్రత్యేక దృష్టి సారించారు. వనపర్తి ఘన కీర్తిని చాటి చెప్పే రాజు బంగ్లాను కాపాడుకోవాలని తలచిన వనపర్తి శాసనసభ్యులు రాజు బంగ్లా పునరుద్ధరణకై మొదటి నుంచి దృష్టి సారించారు. పలుమార్లు బంగ్లా పునరుద్ధరణ పై ప్రత్యేక దృష్టి సారించారు. పలుమార్లు బంగ్లా పునరుద్ధరణ కోసం చేపట్టవలసిన అంశాలపై పలువురి నిపుణులతో సమగ్ర పరిశీలనను నిర్వహించారు. అనంతరం బంగ్లా పునరుద్ధరణ కోసం నివేదికలను తయారు చేసి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి సమర్పించారు. ఇందుకు సంబంధించిన ముఖ్యమంత్రి మొదటగా బంగ్లాలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు వారికి బాలుర , బాలికల ప్రతి గృహాల పునరుద్ధరణ కోసం రూ.13 కోట్ల 15 లక్షలను ఇటీవల మంజూరు చేయించారు. రాజు బంగ్లా పునరుద్ధరణ కోసం నిధులు మంజూరు చేయాలని పలుమార్లు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి ని కోరగా అందుకు స్పందించిన ఆయన రూ. 10 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ బుధవారం జీవో జారీ చేశారు. వనపర్తి చరిత్రకు ఆనవాళ్లుగా మిగిలిపోయిన పూర్వ వైభవం రాజు బంగ్లాను కాపాడుకునేందుకు ఎమ్మెల్యే చేసిన కృషికి వనపర్తి జిల్లా పరిధిలోని విద్యావేత్తలు, సంఘసంస్కర్తలు, సాహితా వేత్తలు, కళాకారులు, నిపుణులు, ప్రజలు ప్రశంసించారు.

## మహిళల భద్రతకు కార్పొరేట్లు– ఎన్‌జిఒలతో భాగస్వామ్యం:చారుసిన్హా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో మహిళల భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీసుల పరిధిలోని మహిళా భద్రతా విభాగం కీలక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఆర్ఆర్) నేతలు, ఎన్‌జిఒలు, దాతృ సంస్థలు పాల్గొని మహిళల భద్రతకు సంబంధించి కలిసి పని చేసే మార్గాలపై చర్చించారు. మహిళల భద్రతకు సంబంధించి ప్రస్తుతం ఉన్న లోపాలు, వాటిని అధిగమించే విస్తృతంగా అమలు చేయగల కార్యక్రమాలు, భాగస్వామ్య నమూనాలు వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. మహిళల భద్రత, సురక్షిత ప్రయాణం, న్యాయానికి ప్రాప్తి, ఆర్థిక సాధికారత వంటి రంగాల్లో సిఆస్ఆర్ సహకారంతో దీర్ఘకాలిక, ఫలితాల ఆధారిత కార్యక్రమాలు అమలు చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా భద్రతా విభాగం అదనపు డిజి చారుసిన్హామాట్లాడుతూ, నివారణ, స్పందన, పునరావాసం, సామర్థ్య వృద్ధి వంటి ప్రాధాన్యతా రంగాల్లో సిఎస్ఆర్ భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషించగలవని తెలిపారు. ఇప్పటికే మహిళా భద్రతా విభాగం అమలు చేస్తున్న భరోసా కేంద్రాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, బాధితుల సహాయ సేవలు, కమ్యూనిటీ అవుట్‌రీచ్, అవగాహన కార్యక్రమాలు, సాంకేతికత ఆధారిత భద్రతా చర్యలు వంటి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ఈ భాగస్వామ్యాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ సమావేశం ద్వారా మహిళల భద్రత కోసం పోలీసులు–కార్పొరేట్లు–ఎన్‌జీవోలు–పౌర సమాజం కలిసి పనిచేసే సహకార వ్యవస్థ ఏర్పాటుకు కీలక అడుగు పడిందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల భద్రతా కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా అమలు చేయడమే ఈ ప్రయత్నాల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## త్వరలో చర్లపల్లి–తిరువనంతపురంకు అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రయాణికులకు మరింత మెరుగైన రైలు సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చర్లపల్లి–తిరువనంతపురం నార్త్– చర్లపల్లి అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17041/17042) ను ప్రారంభించనున్నారు. ఈ కొత్త రైలు సేవల ప్రారంభానికి అనుసంధానంగా ఈ నేఎల 23న ప్రత్యేక ప్రారంభ రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సిపిఆర్ఒ ఎ. శ్రీధర్ తెలిపారు.ఈ సందర్భంగా 06308 తిరువనంతపురం నార్త్–చర్లపల్లి అమృత్ భారత్ స్పెషల్ రైలు ఈ నెల 23న ఉదయం 10.45 గంటలకు తిరువనంతపురం నార్త్ నుంచి బయలుదేరి, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మీదుగా ప్రయాణించి మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు వర్కల శివగిరి, కొల్లం, కాయంకులం, కొట్టాయం, ఎర్నాకులం టౌన్, త్రిస్సూర్, పాలక్కాడ కోయంబత్తూర్, ఈరోడ్ సేలం, కాట్పాడి, రెనిగుంట, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ తదితర ముఖ్య స్టేషన్లలో ఆగుతుంది. ప్రారంభ ప్రత్యేక రైలులో మొత్తం 8 స్లీపర్ కోచ్‌లు, 11 జనరల్ సెకండ క్లాస్ కోచ్‌లు, 1 ప్యాంట్రీ కార్, దివ్యాంగులకు అనుకూలంగా 2 సెకండ క్లాస్ కోచ్‌లు ఉండనున్నాయి. నూతనంగా ప్రారంభిస్తున్న చర్లపల్లి–తిరువనంతపురం నార్త్ అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ నియమిత సేవల తేదీలు, సమయాలు తదితర వివరాలు త్వరలోనే వేరుగా ప్రకటిస్తామని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు ద్వారా తెలంగాణ, కేరళ మధ్య ప్రయాణించే ప్రయాణికులకు ఎంతో ఉపయోగం కలగనుందని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

## గురుకుల ప్రవేశానికి గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** రాష్ట్రప్రభుత్వం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5,6తరగతుల ప్రవేశపరీక్ష దరఖాస్తుల గడువును పెంచినట్లు మండల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అకుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు ఈనెల 25వతేదివరకు పొడిగించడం జరిగిందన్నారు. అర్హులైన ఎస్‌సి,ఎస్‌టి,బిసి, మైనార్టీ, జనరల్ విద్యార్థులందరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రోడ్డునిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను ఆరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిఎస్‌పి సాయిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం రోడ్డుభద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పాలమూరుచౌరస్తానుండి హైదరాబాద్‌చౌరస్తావరకు కల్వకుర్తి పోలీసుశాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను ఆరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రోడ్డు భద్రత వారోత్సవాలను యేటా నిర్వహించి వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇబ్రహీం, సీఐ నాగార్జున, ఎంవిఐ అశోక్‌కుమార్, ఎస్ఐ మాధవరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

## 40 కుక్కలు చంపడంపై పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలో సింబయాసిస్ యూనివర్సిటీ, సమీప ప్రాంతంలో ఇటీవల 40 కుక్కలను ఒకేరోజు చంపడాన్ని తప్పుపడుతూ దాఖలైన పిల్‌ను విచారించేందుకు హైకోర్టు నిరకరించింది. ఈ వ్యవహారంపై అన్ని హైకోర్టులోని కేసులు సుప్రీంకోర్టుకు బదిలీ అయ్యాయని, కాబట్టి ఈ కేసును సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. నలభై కుక్కలను చంపిన పంచాయతీ సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదుకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ అడ్వకేట్ రిషిహాస్ రెడ్డి వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణకు వచ్చినప్పుడు పై విధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

## జంతు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర జంతు సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేసేందుకు విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హైకోర్టు బుధవారం ఆదేశించింది. జంతువుల అమ్మకాల దుకాణాలు పెంపుడు కేంద్రాలు నిర్వహణ చట్టపరంగా ఉండే విధంగా చర్యలకు ఆదేశాలు ఇవ్వాలంటూ ఒక ఎన్జీవో పిల్ దాఖలు చేసింది. దీనిని చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారించింది. ప్రభుత్వ వివరణతో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని న్యాయవాది కోరడంతో విచారణ వచ్చే నెలకు వాయిదా పడింది.

## టిజిఎస్ఆర్‌టిసి ట్రాఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులకు 26,160 దరఖాస్తులు

మార్చి 29న రాత పరీక్షలు : టిఎస్ఎల్‌పిఆర్‌బి చైర్మన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్‌టిసి)లో ట్రాఫిక్ సూపర్వైజర్ ట్రైనీ, మెకానికల్ సూపర్వైజర్ ట్రైనీ పోస్టుల భర్తీకి సంబంధించి రాత పరీక్షలను మార్చి 29(ఆదివారం)న నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టిఎస్ఎల్‌పిఆర్‌బి) ప్రకటించింది. ఈ నియామకాల కోసం జనవరి 20 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించగా, 84 ట్రాఫిక్ సూపర్వైజర్ ట్రైనీ పోస్టులకు 20,097 దరఖాస్తులు (వాటిలో 6,489 మహిళలు), 114 మెకానికల్ సూపర్వైజర్ ట్రైనీ పోస్టులకు 6,063 దరఖాస్తులు (వాటిలో 735 మహిళలు) వచ్చాయని బోర్డు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి గత డిసెంబర్ 25న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. పరీక్షల షెడ్యూల్ మార్చి 29న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ట్రాఫిక్ సూపర్వైజర్ పరీక్ష, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు మెకానికల్ సూపర్వైజర్ పరీక్ష ఉంటుందని, రెండు పరీక్షలు కూడా 3 గంటల వ్యవధితో, 200 ఆబ్జెక్టివ్ (ఎంసిక్యూ) ప్రశ్నలతో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలు హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. హాల్ టికెట్ల డౌన్‌లోడ్, తదితర వివరాలను తగిన సమయంలో ప్రకటిస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

## 'ధర్మ రక్ష సభ'కు అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అక్రమ వలసదారుల వల్ల దేశ భద్రతకు ఏర్పడబోయే ముప్పు గురించి ప్రజలకు చైతన్యం కల్పించేందుకు ఈనెల 24న రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌లో 'ధర్మ రక్ష సభ' నిర్వహణకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని పిటిషన్ హైకోర్టు బుధవారం విచారించింది. తమ దరఖాస్తును ఆమోదించి ధర్మరక్ష సభకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదంటూ గణేష్ సేన కన్వీనర్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ శ్రవణ్ కుమార్ విచారించారు. ధర్మ రక్ష సభకు షరతులతో అనుమతి మంజూరు చేశారు. ఈనెల 24న సాయంత్రం 3 నుంచి 6 గంటల్లోగా 3 వేల మందితో నిర్వహించుకోవాలని చెప్పారు. ర్యాలీలు నిర్వహించరాదని, రాజకీయ నాయకులను ఆహ్వానించరాదని షరతు విధించారు. రెచ్చగొట్టే ప్రసంగాలు, ప్లకార్డుల ప్రదర్శనలు, నినాదాలు చేయరాదన్నారు. బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసులను ఆదేశించారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి.. రాష్ట్రంలోని శరణార్థులు, రోహింగ్యాలకు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఉందా, వాళ్ళు దేశంలో చట్టప్రకారం దేశంలో నివసించేందుకు వీలుందా.. అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అక్రమంగా దేశంలోకి వలస వచ్చిన వాళ్లని బయటకు పంపించే బాధ్యత కేంద్ర ప్రభుత్వాన్ని దేనిని రాష్ట్ర ప్రభుత్వం జవాబు చెప్పింది. బాలానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో 6993 మంది శరణార్థులు ఉన్నారని వివరించింది. పిటిషన్‌పై విచారణ ముగిసింది.



## ఫిట్నెస్ సమస్యలతో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు

## ఢిల్లీ జెర్సీతో మెరుపులు!

మహిళల ప్రీమియర్ లీగ్‌లో దూకుడైన ఆటతో అభిమానులను ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ లిజెల్లె లీ అలరిస్తోంది. ఫ్రాంచైజీ క్రికెట్లో ఇప్పటికే తన విధ్వంసక ఆటతో ఫైర్ బ్రాండ్ అనిపించుకున్న లీ.. డబ్ల్యుపిఎల్లోనూ రఫ్ఫాడిస్తోంది. ఇప్పటికే రెండు అర్ధ శతకాలతో విరుచుకుపడి ఫ్రాంచైజీపై తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంది. భారీ కాయం ఉన్నప్పటికీ.. చకచకా వికెట్ల మధ్య పరుగెడుతూ.. వికెట్ల వెనకాల మెరికలా కదులుతున్న తనలో ప్రతిభకు కొదవలేదు. కానీ, అధిక బరువు కారణంగా అర్ధాంతరంగా అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికింది. డబ్ల్యుపిఎల్లో ఢిల్లీ క్యాపిటల్స్ ఐదింటా రెండు విజయాలతో ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది. షఫాలీ వర్మలాంటి డేరింగ్ బ్యాటర్కు లిజెల్లె లీ జోడీగా ఇన్నింగ్స్ ఆరంభించడం అగ్నికి వాయువు తోడైనట్టుగా మారింది. తన మార్క్ విధ్వంసంతో ఈ లీగ్లో రెండు అర్ధ శతకాలు బాదేసిందామె. ఏ మాత్రం ఇబ్బందిపడకుండా ఆడడం చూసి ఫ్యాన్స్ వారెవా అంటున్నారు.

## టి–20 వరల్డ్ కప్ టోర్నీలో బంగ్లా ఆడుతుందా?

### ఒక్క రోజే గడువిచ్చిన ఐసిసి



రాబోయే టి–20 వరల్ కప్ టోర్నీలో బంగ్లాదేశ్ పాల్గొనే అంశంపై ఉత్కంఠ మరో 24 గంటల్లో వీడనుంది. ఈ టోర్నీలో బంగ్లాదేశ్ పాల్గొంటుందో, లేదో తేల్చుకునేందుకు ఆ జట్టుకు 24 గంటల టైమిచ్చింది ఐసిసి. అయితే, షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్.. ఇండియాలో మ్యాచులు ఆడాల్సిందే అని ఐసిసి తేల్చి చెప్పింది. ఇక నిర్ణయం తీసుకోవాల్సింది బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మాత్రమే. ఇటీవల బంగ్లాదేశ్, భారత్ మధ్య విభేధాలు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ వివాదం క్రికెట్ కు చేరింది. బంగ్లా క్రికెటర్ను ఐపిఎల్ నుంచి బిసిసిఐ తొలగించింది. దీంతో భద్రతా కారణాల రీత్యా తాము కూడా ఇండియా లో జరగబోయే టి–20 వరల్ కప్ టోర్నీలో పాల్గొనబోమని బంగ్లా చెప్పింది. తాము ఆడే మ్యాచు వేదికల్ని ఇండియా నుంచి మరో చోటుకు మార్చాలని ఐసిసిని కోరింది. కానీ, ఐసిసి దీనికి సానుకూలంగా స్పందించలేదు. ముందే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఇండియాలో మ్యాచులు ఆడాల్సిందే అని బంగ్లాకు సూచించింది. ఈ ప్రతిపాదనను బంగ్లా తిరస్కరించింది. దీంతో వివాదం ఎటూ తేలలేదు. మరోవైపు ఐసిసి.. బంగ్లాకు బుధవారం (నేటి) వరకు గడువిచ్చింది. ఈ గడువు నేటితో ముగిసినా.. మరో 24 గంటలు అదనపు సమయం ఇచ్చింది. బంగ్లా ప్రతిపాదనను ఐసిసి తిరస్కరించడం వెనుక కారణం ఉంది. బంగ్లా ప్రతిపాదనపై ఐసిసి కౌన్సిల్ ఓటింగ్ నిర్వహించింది. అంటే బంగ్లాదేశ్ ఇండియాలోనే మ్యాచులు ఆడాలా.. లేక వేరే చోట నిర్వహించాలా అనే అంశంపై ఓటింగ్ పెట్టింది. ఇందులో ఇండియాలో బంగ్లా ఆడాల్సిందే అని 14 ఓట్లు, మరో చోట ఆడాలని 2 ఓట్లు వచ్చాయి. దీంతో బంగ్లాదేశ్ ఇండియాలో మ్యాచులు ఆడాల్సిందే అని ఐసిసి తుది హెచ్చరిక జారీ చేసింది. దీనిపై 24 గంటల్లో నిర్ణయం తీసుకుని చెప్పాల్సిందిగా బంగ్లాకు సూచించింది. అంటే ఇండియాలో టోర్నీలో పాల్గొనేది, లేనిది బంగ్లా గురువారం లోపు తేల్చాలి. ఒకవేళ బంగ్లా పాల్గొనకుంటే.. ఆ స్థానంలో స్కాట్లాండ్ జట్టును ఆడించేందుకు ఐసిసి సిద్ధంగా ఉంది.

## అభిషేక్, రింకూ వీరకొట్టుడు

### టి – 20లో కివిస్ చిత్తు



ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో భారత జట్టు అదిరే బోణీ చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(84) విధ్వంసక ఆటకు శివం దూబే(2–28), వరుణ్ చక్రవర్తి(2–37) విజృంభణ తోడవ్వగా.. న్యూజిలాండ్‌పై భారీ విక్టరీ కొట్టింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లో వన్డే సిరీస్ హీరోలు గ్లెన్ ఫిలిప్స్(78) హీరో మిచెల్ మార్ష్(28)లు పోరాడినా గెలిపించలేకపోయారు. 48 పరుగుల తేడాతో విజయం సాధించిన టీమిండియా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. వన్డే సిరీస్ విజయోత్సాహంతో నాగపూర్‌లో చెలరేగాలనుకున్న న్యూజిలాండ్‌కు సూర్యకుమార్ యాదవ్ సేన బిగ్ షాకిచ్చింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(84) పవర్ హిట్టింగ్‌కు, రింకూ సింగ్(44 నాటౌట్) మెరుపులు తోడవ్వగా 238 కొట్టిన టీమిండియా.. అనంతరం ప్రత్యర్థిని 190కే కట్టడి చేసి సిరీస్‌లో ముందంజ వేసింది.

**2 పరుగులకే 2 వికెట్లు...** భారీ ఛేదనలో ఆరంభంలోనే న్యూజిలాండ్ కష్టాల్లో పడింది. అర్ష్‌దీప్ సింగ్ మొదటి ఓవర్లోనే డెవాన్ కాన్వే(0)ను ఔట్ చేసి షాకిచ్చాడు. ఆ తర్వాత హార్దిక్ పాండ్యా ఓవర్లో రచిన్ రవీంద్ర(1) వెనుదిరగడంతో 2 పరుగులకే రెండు వికెట్లు పడిన వేళ టిమ్ రాబిన్సన్(21), గ్లెన్ ఫిలిప్స్(78) వికెట్ కాపాడుకున్నారు. వీరిద్దరూ కీలక భాగస్వామ్యం నెలకొల్పినా ఈ జోడీని వరణ్ చక్రవర్తి విడదీశాడు. అనంతరం మార్క్ చాప్మన్(39) జతగా ఫిలిప్స్ పెద్ద షాట్లు ఆడి స్కోర్ 130 దాటించాడు. ప్రమాదకరంగా మారిన ఈ ఇద్దరిని అక్షర్, వరుణ్ పెవిలియన్ పంపారు. వెంటవెంటనే ఇద్దరూ ఔట్ కావడంతో బ్లాక్‌క్యాప్స్ గెలుపు ఆశలు ఆవిరయ్యాయి. ఆఖర్లో డారిల్ మిచెల్(28), కెప్టెన్ శాంట్నర్(20 నాటౌట్) పోరాడారు. శివం దూబే(228) ఆఖరి ఓవర్లో బౌండరీ లైన్ వద్ద బిష్ణోయ్ సూపర్ క్యాచ్‌తో మార్ష్ డకౌట్ చేరాడు. తర్వాతి బంతికే క్లార్క్(0) రింకూ చేతికి చిక్కగా కివీస్ 190కే పరిమితమైంది.

**అభిషేక్, రింకూ వీరకొట్టుడు...** పొట్టి సిరీస్ తొలి మ్యాచ్‌లోనే భారత బ్యాటర్లు శివాలెత్తిపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ(84)విధ్వంసక అర్ధ శతకంతో చెలరేగగా.. రింకూ సింగ్(44 నాటౌట్) తనమార్క్ స్ట్రోక్ ప్లేతో రెచ్చిపోయాడు. ఓపెనర్లు విఫలైమనా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(32) తో కలిసి మూడో వికెట్కు కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు అభిషేక్. డెత్ ఓవర్లలో హార్దిక్ పాండ్యా(25), రింకూలు బ్యాట్ ఝులిపించగా నాగ్పూర్లో జరుగుతున్న తొలి టీ20లో టీమిండియా 238 రన్స్ కొట్టింది.



## చరిత్ర

## బాబిలోనియాలో అతిపురాతన ప్రపంచ పటం



బాబిలోనియన్ వరల్డ్ మ్యాప్ అనేది ప్రపంచంలో లభించిన అతి పురాతన పటాలలో ఒకటి. ఇది సుమా రు క్రీ.పూ.700 నుంచి 500 మధ్యకాలానికి చెందినది. ఈ పటం దక్షిణ ఇరాక్‌లోని సిప్పర్ అనే ప్రాంతంలో దొరికింది. ఇది చిన్న మట్టి పలక మీద చెక్కబడింది. దీని పరిమాణం మన చేతిలో పట్టుకునేంత చిన్నది అయినా, ఇందులో ఉన్న సమాచారం చాలా గొప్పది. ఈ మట్టి పలకపై క్యూనిఫార్మ్ లిపి అనే పురాతన లిపిలో రాత లు, అలాగే చిత్రాలు ఉ న్నాయి. ఇందులో బాబిలోనియన్లు తమకు తెలిసిన ప్రపంచా న్ని ఎలాఊహించుకున్నారో చూపించారు. ఈ పటంలో మధ్యలో బాబిలోను నగరం ఉంటుంది. అది ఒక చిన్నచతురస్రం లా చూపించారు. అంటే వారి దృష్టిలో ప్రపంచానికి కేంద్రం బాబిలోనే. దాని చుట్టూ ఇతర ప్రాంతాలు ఉన్నాయి.. అస్సిరియా, ఏలాం వంటి ప్రాంతాల పేర్లు కూడా ఉన్నాయి. మధ్యలో ప్రవహించే యూఫ్రటిస్ నది కూడా పటంలో కనిపిస్తుంది. ఈ భూమి మొత్తాన్ని ఒక పెద్ద వృత్తం చుట్టుముట్టి ఉంటుంది. ఆవృత్తాన్ని వారు ఉప్పు సముద్రం అని పిలిచారు. అంటే వారి నమ్మకం ప్రకారం భూమి అంతా ఒక మహాసముద్రంతో చుట్టబడి ఉంది. ఈసముద్రానికి అవతలగా, పటంలో ఎనిమిది త్రిభుజాకార ప్రాంతాలు చూపించారు. వీటిని వారు దూర ప్రాంతాలు లేదా ద్వీపాలుగా భావించారు. ఈ ప్రాంతాల గురించి రాసిన వచనాల్లో విచిత్రమైన జీవులు, వీరులు, పౌరాణిక కథలు కూడా ఉన్నాయి. అంటే అక్కడ నిజమైన భూములు ఉన్నాయా, లేక కథల్లో చెప్పిన లోకాలేనా అన్నది వాళ్లకూ పూర్తిగా స్పష్టంగా లేదు. ఈ త్రిభుజాల ఆకారం చూస్తే, సముద్రంలో ప్రయాణిస్తే దూరంగా కనిపించే భూభాగాల్లా అనిపించేలా వారు గీసినట్టుగా భావిస్తారు. ఈపటం పూర్తిగా శాస్త్రీయ మ్యాప్ కాదు. ఇది బాబిలోనియన్ల ప్రపంచాన్ని ఎలా ఊహించుకున్నారో చూపించే ఒక ప్రతిబింబం. నిజమైనభూభాగాలు, నదులు, నగరాలతో పాటు వారి పురాణకథలు కూడా ఇందులో కలిసిపోయాయి. ఈ మట్టి పలకను 1882లో బ్రిటిష్ మ్యూజియం స్వాధీనం చేసుకుంది. దీనిని ఇమాగోముండీ అంటే ప్రపంచ చిత్రం అని పిలుస్తారు. ఇందులో ఉన్న కొన్ని వచనా లు, తరువాత అనువదించినప్పుడు, ఒక పెద్ద వరద మరియు పడవ కథను సూచిస్తున్నాయని తెలిసింది. అంటే ఇది బాబిలోనియన్ల నోయా పడవలాంటి కథతోసంబంధం కలిగి ఉంది. పడవనిలిచినట్లు నమ్మిన కొండల దిశలు కూడా ఇందులో పేర్కొన్నట్టు భావిస్తున్నారు. ఇవి బైబిల్లో చెప్పే కథలకు చాలాపోలికగా ఉంటాయి. అందుకే ఈపటం ఒక మ్యాప్ మాత్రమే కాదు. ఇది మెసపొటేమియా ప్రజలచరిత్ర, నమ్మకాలు, పురాణాలు, మరియు ప్రపంచంపై వారి ఆలోచనలనుతెలియజేసే ఒకవిలువైన ఆధారం.



## ఇక్ష్వాకుల కాలం నాటి నాగార్జునకొండ

నాగార్జునకొండ (ప్రాచీననామం విజయపురి) దక్షిణ భారతదేశంలో ఒక ప్రముఖ బౌద్ధ కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఇది ఇక్ష్వాకుల వంశపాలనలో (క్రీ.శ. 3వ–4వ శతాబ్దాలు) బౌద్ధ విశ్వవిద్యాలయంగా మరియు విహారాల కేంద్రంగా వికసించింది. మహాయాన బౌద్ధ తత్త్వవేత్త నాగార్జునుడి పేరుతో ఈ ప్రాంతానికి నాగార్జునకొండ అనే పేరు వచ్చింది. ఒకప్పుడు ఇది ప్రపంచవ్యాప్తంగా బౌద్ధ విద్యకు కేంద్రం గా నిలిచింది. ఈ ప్రాంతంలో అనేక స్తూపాలు, విహారాలు, చైత్యాలు, అవశేషాలు వెలుగు చూసాయి. నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణం వల్ల పురాతన నగరం నీట మునిగిపోవడంతో, ముఖ్యమైన శిల్పాలు, విగ్రహాలు, నిర్మాణాలను సమీపంలోని కొండపైకి తరలించి అక్కడ ఓద్వీప మ్యూజియంగా ఏర్పాటు చేశారు. నేటి నాగార్జునకొండ మ్యూజియం ఈ గొప్ప చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. చరిత్రపరమైన ప్రాముఖ్యతను చూస్తే, క్రీ.పూ. 3వ శతాబ్దంలో శాతవాహనుల కాలంలో ఇక్కడ బౌద్ధ ధర్మానికి పునాదులు పడ్డాయి. తరువాత ఈక్ష్వాకుల కాలంలో ఇది అత్యంత వైభవంగా అభివృద్ధి చెంది, ఆసియా నలుమూలల నుంచి విద్యార్థులు వచ్చి ఇక్కడ బౌద్ధ విద్యను అభ్యసించేవారు. ఈ ప్రాంతానికి నాగార్జునుడు బోధనలు అందించడం వల్ల దీనికి ప్రత్యేక ఖ్యాతి లభించింది. అప్పట్లో ఈ నగరం విజయపురి అనే పేరుతో ప్రసిద్ధి. 1926లో జరిగిన తవ్వకాలలో అనేక బౌద్ధ స్మారకాలు, స్తూపాలు, విహారాలు, చైత్యాలు వెలుగులోకి వచ్చాయి. నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణం వల్ల పురాతన విజయపురి నీట మునిగినప్పటికీ, విలువైన అవశేషాలను జాగ్రత్తగా బయటకు తీసి కొండపై తరలించి ఓ ఓపెన్‌ఎయిర్ మ్యూజియంగా ఏర్పాటు చేశారు. నేడు అక్కడ పురావస్తు మ్యూజియంలో శిల్పాలు, శాసనాలు, పురాతన వస్తువులు చూడవచ్చు. అలాగే పునర్నిర్మిత స్తూపా లు, విహారాలు, బౌద్ధ విగ్రహాలు దర్శనమిస్తాయి. ఫెర్రీ సర్వీసుల ద్వారా ఈ ద్వీపానికి చేరుకోవచ్చు. అంతేకాక, క్రీ.శ. 2వ శతాబ్దానికి చెందిన మేగాలిథిక్ సమాధి స్థలాలు కూడా ఇక్కడ ఉన్నాయి. నాగార్జునకొండ దక్షిణ భారతదేశంలో బౌద్ధ ధర్మ విస్తరణకు ప్రతీకగా నిలిచిన ఒక విశిష్ట చారిత్రక కేంద్రం. ఇది ప్రాచీన కాలంలో ప్రపంచ బౌద్ధ విద్యకు కేంద్రంగా ఉన్న గొప్ప వారసత్వాన్ని నేటికీ భద్రంగా సంరక్షిస్తున్న పురావస్తు స్థలం.





## అరాచక శక్తుల ఆటలు సాగనివ్వం

### సిపిఐ ఖమ్మంజిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సిపిఐ పునాదితో బలంగా నిర్మితమైన ఈ ప్రాంతంలో అరాచ శక్తుల ఆటలు సాగినవ్వమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ హెచ్చరించారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని, దండి భాస్కర్ మెమోరియల్ ట్రస్ట్, మహిళా సమాఖ్య, ఎఐవైఎఫ్ నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంబిబిఎస్ సీటు సాధించిన చిట్యాల వెంకన్న కుమార్తె చిట్యాల లక్ష్మి కి దండి భాస్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో మాఫియాలు, అరాచక శక్తులు, రౌడిగ్యాంగ్‌లు అడుగుపెట్టాలని చూసిన వాటిని అడ్డుకున్నామన్నారు. అలా ఇక్కడి ప్రజల ఆస్తులు, మహిళ, యువతులకు రక్షణ కవచంగా ఎర్ర జెండా అండగా ఉందన్నారు. కొంతకాలంగా అరాచకశక్తులు, మాఫియా పెట్రేగిపోతున్నాయన్నారు. వీటిని కమ్యూనిస్టు పార్టీగా సహించదని, బాధితులలకు అండగాఉంటామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర బాబు, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, మహిళా సంఘం నాయకురాల్లు పోటు కలవతి, ఏపూరి లతాదేవి, ఐఎఎల్ జాతీయ సమితి సభ్యుడు ఓరుగంటి శేషగిరిరావు, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల సమితి సభ్యులు దండి రంగారావు, పొన్నెకంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శీతాకాల సమావేశాల్లో మహిళలకు 33 శాతం బిల్లు

### ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్దు డిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్దు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎంతో కాలంగా మహిళలు పోరాటాలు చేస్తున్నారన్నారు. 1996 సెప్టెంబర్‌లో పార్లమెంటు సమావేశాల్లో భారత జాతీయ మహిళా సమాఖ్య అప్పటి ప్రధాన కార్యదర్శి గీతాముఖర్జీ పార్లమెంటులో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టారన్నారు. నాటి నుంచి నేటి వరకు మహిళల చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ కోసం పోరాడుతూనే ఉన్నారని ఆమె తెలిపారు. సమాజ నిర్మాణంలో మహిళలకు తగిన గుర్తింపు లభించాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. తగినంత సంఖ్యాబలం ద్వారా పార్లమెంటు, శాసనసభలలో వారు తమ హక్కులను వినిపించాల్సిన సమయం గీతాముఖర్జీ తన ప్రసంగంలో చెప్పారనే విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం చాలా రంగాల్లో మహిళలు తమ శక్తియుక్తులతో, తెలివితేటలతో రాణిస్తున్నారని, కానీ రాజకీయాల్లో మాత్రం మహిళల పాత్ర తక్కువేనన్నారు. ఇప్పటి వరకు లోక్‌సభలో ఉన్న 542 సీట్లకు 78 మంది మహిళా ఎంపిలు ఉండటం శోచనీయమన్నారు. రాజ్యసభలో వారి సంఖ్య 24తో మరింత దారుణంగా ఉందన్నారు. 33 శాతం ఉండాల్సిన రిజర్వేషన్ 13.3 శాతం మాత్రమే ఉందన్నారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిథ్యం పెరిగి రాజకీయాల్లోకి వస్తే అసమానతలు తొలుగుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉస్తెల సృజన, నెదునూరి జ్యోతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మందా సదాలక్ష్మి, ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, జిల్లా నాయకురాలు మందడపు రాణి, బత్తినేని నీరజ, ఎస్‌కె.రంజాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

## పిజి విద్యార్థుల జీవితాలతో చెలగాటం సరికాదు

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** శాతవాహన యూనివర్సిటీ పరిధిలో పిజి మూడో సెమిస్టర్ విద్యార్థులను అటెండెన్స్ లేదని హాల్ టికెట్లు ఇవ్వకుండా వారిని పరీక్షలకు దూరం చేయడం సరికాదని, విద్యార్థుల జీవితాలతో యూనివర్సిటీ అధికారులు చెలగాటం ఆడడం సరికాదని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి అన్నారు. శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో బుధవారం యూనివర్సిటీ అధికారుల ఏకపక్ష నిర్ణయంతో పరీక్షలకు దూరమైన పిజి విద్యార్థులను కలిశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో పిజి విద్యార్థులకు మూడో సెమిస్టర్ సందర్భంగా పరీక్ష ఫీజు తీసుకునే సమయంలో కూడా అటెండెన్స్ విషయంపై నోటీసు ఇవ్వకుండా హాల్ టికెట్ తీసుకునే సమయంలో అటెండెన్స్ లేదని వారిని పరీక్షకు అనుమతించకపోవడం వల్ల అనేక మంది విద్యార్థులు పరీక్షలు దూరమయ్యారన్నారు. వెంటనే మూడో సెమిస్టర్ విద్యార్థులందరినీ పరీక్షలకు అనుమతించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నాయకులు సందీప్ రెడ్డి, అడపా సాయి కృష్ణ ఉన్నారు.



## మున్సి 'పోల్'లో కలిసి పనిచేస్తాం

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని 6 మున్సిపాలిటీలలో బిఆర్ఎస్, బిజెపిని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామని, కాంగ్రెస్ పార్టీ పొత్తు ధర్మాన్ని పాటించాలని అందుకు ఆయా మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యేలు చొరవ చూపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి కోరారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం పల్లె శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నుంచి కాంగ్రెస్‌తో అవగాహనతో ఉన్న నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలలో కూడా కలిసి పనిచేయడానికి సిపిఐ సిద్ధంగా ఉందన్నారు. సిపిఐకి బలం ఉన్న చోట మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసే స్థానాలకు సీట్ల సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాంగ్రెస్‌తో పాటు సిపిఎం పార్టీలతో కలిసి మున్సిపల్ ఎన్నికల్లో ముందుకు వెళ్తామన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు బోలగాని సత్యనారాయణ, చెడ చంద్రయ్య, కురిమిద్ద శ్రీనివాస్, ఎండి. ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, ఏశాల అశోక్, చిగుర్ల లింగం తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం పట్టణాభివృద్ధి సిపిఐతోనే సాధ్యం

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** త్వరలో జరగనున్న కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల ప్రచారం జోరును సిపిఐ పెంచింది. ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలను సంసిద్ధులను చేసేందుకు జరుగుతున్న డివిజన్ల స్థాయి సమావేశాల్లో భాగంగా రామవరం పరిధిలోని ఆరు డివిజన్ల విస్తృత స్థాయి సమావేశం బుధవారం పార్టీ కార్యాలయం విఠల్ రావు మెమోరియల్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో అంతర్భాగంగా ఉన్న రామవరం పట్టణంలో సిపిఐకి తిరుగులేదని, అనాదిగా ఇక్కడి ప్రజలు సిపిఐని ఆదరిస్తున్నారని, ప్రజలకు సిపిఐ అందిస్తున్న సేవలే ఇందుకు కారణం అన్నారు. కొత్తగూడెం పట్టణాభివృద్ధి సిపిఐతోనే సాధ్యమని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది తమ పార్టీయే అని స్పష్టం చేశారు. ముఖ్యంగా రామవరం ప్రాంతంలోని డివిజన్లలో పార్టీకి బలమైన పట్టు ఉందని, రాబోయే ఎన్నికల్లో ఆ ఆరు డివిజన్లలో సిపిఐ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని కోరారు. వార్డుల వారీగా ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రజలతో కలిసి పోరాడాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి, నిష్పక్షపాతంగా అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. రామవరం ప్రాంత ప్రజలకు పొజిషన్ సర్టిఫికెట్లు, మాజీ కార్మికులు, పేదలు నివశిస్తున్న సింగరేణి క్వార్టర్లపై హక్కు కల్పించేందుకు కృషి జరుగుతోందన్నారు. కార్యకర్తలు ఐక్యమత్యంతో శ్రమించి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, అప్పుడే మున్సిపల్ కార్పోరేషన్‌లో సామాన్యుల గొంతు వినిపిస్తుందని సాబీర్ పాషా ఉద్ఘాటించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, ఎస్‌కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, మునిగడప పద్మ, నాయకులు గోపి కృష్ణ, రంగారావు, గుత్తుల శ్రీనివాస్, తూముల శ్రీను, మండల రాజు, సుధాకర్, ఖయ్యూమ్, సత్యనారాయణాచారి, జలీల్, షాహీన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## సెంట్రలైజ్‌డ్ కిచెన్ విధానం సరికాదు




### మధ్యాహ్న భోజన వర్కర్స్‌యూనియన్ ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిలిండర్లు, కోడిగుడ్లు నిత్యవసర సరుకులు ప్రభుత్వమే పంపిణీ చేయాలని ఎఐటియుసి అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సెంట్రలైజ్‌డ్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిగుడ్డు ధరలు పెరిగినందున అందించలేమన్నారు. గ్యాస్ సిలిండర్లు కార్మికులే భరించాలని ఒత్తిడి తేవడం విరమించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు వంట చేసి పెడుతున్న కార్మికులను గుర్తించకుండా 24 సంవత్సరాల నుంచి ఎన్నో అప్పులు చేసి మిడ్ డే మీల్స్‌ను నడిపిస్తున్నామన్నారు. జీతభత్యాలు పెంచకుండా, సెంట్రలైజేషన్ విధానాన్ని హరే రామ హరే కృష్ణకు అప్పజెప్పాలి అనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల హామీ మేరకు పదివేల జీతాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్, యూనిఫామ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులకు ఇచ్చే రూ.6000తో కుటుంబాలను ఎలా పోషించుకోవాలో సమాధానం చెప్పాలన్నారు. స్థానికంగా ఉన్న ఎంపి, ఎమ్మెల్యేలు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఫిబ్రవరి 15 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలోమధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ, లింగంపల్లి లక్ష్మి, రేణుక, జుబేదా, సంతోష, మమత, మహేశ్వరి, రాజమణి, రామలత, కౌసల్య లక్ష్మి, నరసవ్వ, రజిత, లక్ష్మి, సరోజన, కనక లక్ష్మి, లక్ష్మి, కవిత, రజిత, నరసవ్వ, కొమురవ్వ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ ఇందిరా మహిళా శక్తి చీరలు

### పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హులైన మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య వివరించారు. బుధవారం పట్టణంలోని 18,19,20, 21వ వార్డుల్లో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం మహిళల పేరుపై తీసుకువస్తున్నామని, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఎన్నో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ చీరలనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని సూచించారు. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం, గృహ లక్ష్మీ పథకం ద్వారా ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, నీరటి వాసు, తంగేడుపల్లి శంకర్, జమాల్పూర్ చందు లాల్, బచ్చలి నరేష్, బిసి జనసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప, ఎండి షర్ఫుద్దీన్‌తోపాటు మహిళలు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్యను పరిష్కరించండి

### కమిషనర్‌కు కాలనీవాసుల వినతిపత్రం

**ప్రజాపక్షం/కొత్తూరు:** ఏడాది పాటు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని..నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలంటూ కమీషనర్ బాలాజీని కోరారు. బుధవారం కొత్తూరు మున్సిపల్ కమీషనర్ బాలాజీకి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అంధించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ సమస్యలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని వాపోయారు. కొత్తూరు మున్సిపల్ పరిధిలోని నాల్గవ వార్డు భరత్‌నగర్ కాలనీ ప్రజలు గత ఏడాది నుండి నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని వినతిపత్రం పేర్కొన్నారు. భరత్‌నగర్ కాలనికి వచ్చే మంచినీటి పైపులైన్లు రోడ్డు పనుల కారణంగా ధ్వంసం అయ్యాయని, దాంతో నీటి సరఫరా లేక ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నామని వివరించారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసినా కాలనీకి తాగునీరు మాత్రం రావడం లేదని కాలనీ వాసులు వాపోయారు. కమీషనర్‌గాను తక్షణమే స్పంధించి కాలనీలో ఉన్న 10శాతం భూమిలో వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు కృషి చేయాలని, తద్వారా నీటిని అంధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కమీషనర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో రూప్సింగ్, యాదగిరి, శ్రీను, లక్ష్మణ్, సురేష్, ప్రభు, రాజశేఖర్, శ్రీకృష్ణ, రాజేందర్‌రెడ్డి, సుమన్, తేజలు పాల్గొన్నారు.

## ఆర్మీ వ్యాన్ చక్రాల కిందపడి బాలుడి మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నేరేడ్‌మెట్‌లో విషాదం చోటుచేసుకుంది. కొడుకును స్కూల్‌లో దింపి రావడానికి స్కూటీపై బయలుదేరిన ఓ తల్లి ఆర్కేపురం బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో కొడుకు చనిపోగా, తల్లి తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఆర్మీ స్కూల్‌లో చదువుతున్న కొడుకు నైజాన్(7)ను స్కూల్‌లో దింపి రావడానికి తల్లి స్కూటీపై బయల్దేరింది. స్కూల్‌కు వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి స్కూటీ కిందపడిపోయింది. దీంతో అదే సమయంలో వెనక నుంచి వచ్చిన ఆర్మీ వ్యాన్ ముందు టైర్ ఎక్కడంతో బాలుడు అక్కడికక్కడే చనిపోగా, తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ప్రమాదంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదు చేసుకుని విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆర్మీ వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. తల్లి కళ్లముందే కొడుకు విలవిలలాడుతూ చనిపోవడంతో స్థానికులు భావోద్వేగానికి లోనయ్యారు.



## 'మున్సిపల్' ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లపై వైఖరేంటో చెప్పాలి:బాలగోని డిమాండ్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు తమ వైఖరి స్పష్టంచేయాలని బిసి పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్.దుర్గయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ఫ్రంట్ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్‌తో కలిసి మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయకుండా మున్సిపల్ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్లు 17శాతానికి తగ్గించి తీవ్ర అన్యాయం చేశారన్నారు. అయినా, బిసి ఉద్యమం ఫలితంగా బిసిలు చైతన్యవంతులై జనరల్ స్థానాల్లో సైతం సగానికిపైగా గెలువడం శుభపరిణామమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా నోటిఫికేషన్ వస్తే, మరుసటిరోజు నుంచే రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేపడుతామన్నారు. బిసిలు 42శాతం రిజర్వేషన్లు సాధించేంతవరకు తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్‌లు అయిలి వెంకన్నగౌడ్, యెలికట్టె విజయ్‌కుమార్ గౌడ్, బైరు శేఖర్, అంబాల నారాయణ, నేతలు గోలి గిరి రజక, సింగం నాగేశ్వర్, పాలకుర్తి అశోక్, రాఘేందర్, లింగేశ్ యాదవ్, శ్రీకాంత్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ పోలీసుల చరిత్రాత్మక నిర్ణయం....

# ఘటనా స్థలంలోనే ఎఫ్ఐఆర్ నమోదు

### నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేర బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ తీసుకున్న చారిత్రాత్మక బాధితులు, పౌర కేంద్రీకృత విధానాన్ని హైదరాబాద్ నగరంలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ వెల్లడించారు. తెలంగాణ సిఐడి విభాగం రూపొందించిన నూతన 'విక్టిమ్, సిటిజన్ సెంట్రిక్' విధానం ప్రకారం కొన్ని ప్రత్యేక నేరాల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఇంటి వద్ద నుంచే ఫిర్యాదు అందించి ఎఫ్ఐఆర్ నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. నేరం జరిగిన తర్వాత శారీరకంగా, మానసికంగా కుంగిపోయిన బాధితులకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం ఒక ప్రయాసగా మారకూడదనే సదుద్దేశంతో తెలంగాణ పోలీస్ శాఖ ఈ గొప్ప ముందడుగు వేసిందని అన్నారు. ఈ నూతన విధానం అమలుపై బుధవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టిజిఐసిసిసి)లో అవగాహన సమావేశం నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మహత్యలు, అసహజ మరణాలు, రోడ్డు ప్రమాదాలు, చోరీలు, దోపిడీలు, వాహన దొంగతనాలు, మహిళలు, పిల్లలపై నేరాలు, ర్యాగింగ్ వంటి ఘటనల్లో బాధితులకు త్వరతగతిన సేవలందించేందుకు ఈ విధానం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.

**ఘటన స్థలంలోనే ఎఫ్ఐఆర్ నమోదు..**

సమాచారం అందగానే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని, బాధితులు ఆసుపత్రిలో ఉన్నా సరే, పోలీసులు అక్కడికే వెళ్లి వివరాలు సేకరించి తక్షణమే కేసు నమోదు చేస్తారని తెలిపారు. గతంలో ఘటన జరిగిన తర్వాత బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సి ఉండటం, అప్పటికే మానసిక ఆందోళనలో ఉన్నవారికి మరింత ఇబ్బంది కలిగించేదని ఆయన గుర్తుచేశారు. ఈ పౌర కేంద్రీకృత విధానం వల్ల బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదని, పోలీసులే స్వయంగా వారి వద్దకు వెళ్తారని స్పష్టం చేశారు. ఈ విధానం అమలులో ఎలాంటి అలసత్వం వహించినా సంబంధిత పోలీసు అధికారులపై శాఖా పరమైన చర్యలు తప్పవని సజ్జనర్ హెచ్చరించారు. అకారణంగా ఏ ఒక్క బాధితుడైనా పోలీస్ స్టేషన్‌కు తిరగాల్సి వస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతి కేసును ఎసిపి, డిసిపి స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. బాధితుల గౌరవానికి, గోప్యతకు భంగం కలగకుం డా ఈ సేవలను అందిస్తామని స్పష్టం చేశారు. బాధితులు, పౌర కేంద్రీకృత విధానం ప్రకారం ఫిర్యాదు, ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారిక వాట్సాప్ నంబర్ 94906 16555 వివరాలు పంపాలని సూచించారు. సైబర్ నేర బాధితుల కోసం ఇటీవల హైదరాబాద్ సిటీ పోలీస్ ప్రారంభించిన 'సి మిత్ర'తో పాటు, ఇప్పుడు ఈ నూతన విధానం కూడా ప్రజలకు ఎంతగానో మేలు చేస్తుందని సిపి తెలిపారు.

పోలీస్ శాఖ ఖ్యాతిని పెంచేలా ఈ అద్భుతమైన విధానాన్ని రూపొందించిన డిజిపి బి.శివధర్ రెడ్డికి, సిఐడి అదనపు డిజిపి చారు సిన్హాకి సిపి సజ్జనర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించండి

### యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి



**ప్రజాపక్షం/కొందుర్గు:** గ్రామ పంచాయతీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి ఆరోపించారు. బుధవారం జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివో ప్రవీణ్‌కుమార్, ఎంపిఓ హనుమంత్‌రెడ్డిలతో పంచాయతీ వర్కర్స్ యూనియన్, ఎఐటియుసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు మౌళిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. కనీస వేతనం ఇవ్వకపోవడమే కాకుండా పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, ఆసుపత్రులకు అయ్యే ఖర్చులు, యూనిఫాం, షూ, చేతులకు బ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.21వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

ఎంపిడివో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ యూనియన్ తరుపున తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల కృషి చేస్తామని, కనీస వేతనం అమలు అయ్యే విధంగా ప్రభుత్వానికి నివేధిక పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబుగౌడ్, ఉప సర్పంచ్ ఆజర్ అలీ, సిపిఐ మండల కార్యదర్శి జిల్లెల వెంకటేష్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.వీరేష్, గోపాల్, పాపయ్య, నరసమ్మ, బాలమ్మ, జంగయ్య, భీమయ్య, చంద్రయ్యలు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత

### పెద్దవేదు సర్పంచ్ రాజా సులోచన

**ప్రజాపక్షం/షాబాద్:** గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పెద్దవేదు సర్పంచ్ రాజా సులోచన అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని పెద్దవేదు గ్రామంలో అమెజాన్ కంపెనీ వారి సహకారంతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్థానిక తహశీల్దార్ అన్వర్‌తో కలిసి సర్పంచ్ రాజా సులోచన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి పనులు చేసేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు. గ్రామంలో ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమెజాన్ కంపెనీ ప్రతినిధి తాతాజీ, దేవేందర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ మధు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టులో ఎన్‌డిఆర్ఎఫ్ మాక్ డ్రిల్





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు,అగ్ని ప్రమాదాలు, వరదలు వంటి సంఘటనలు సంభవించినప్పుడు ఎన్ డి ఆర్ ఎఫ్ చేపట్టే సహాయక చర్యలు, ప్రమాదాల నుండి ప్రజలను ఏ విధంగా రక్షించడం జరుగుతుందనే అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అనుకోని విపత్తులు జరిగిన సందర్భంగా ఎన్‌డిఆర్ఎఫ్ టీమ్ సభ్యులు అధికారులకు, సిబ్బందికి వివరించారు. బుధవారం శంషాబాద్ ఎయిర్ పోర్టు ఆవరణలో నేషనల్ దిశస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్ డి ఆర్ ఎఫ్), టీం ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు, అగ్ని ప్రమాదాలు, వరద లు వంటి సంఘటనలు సంభవించినప్పుడు ఎన్ డి ఆర్ ఎఫ్ వారు చేపట్టే సహాయక చర్యలు, ప్రమాదాల నుండి ప్రజలను ఏ విధంగా రక్షించడం జరుగుతుందనే అంశముల పై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ డిఆర్ ఎఫ్ టీమ్ సభ్యులు అధికారులకు,సిబ్బందికి వివరిస్తూ అనుకోని విపత్తులు సంభవించినప్పుడు, భవనాలు కూలినప్పుడు, కొండచరియాలు విరిగిపడినప్పుడు, వినాశకరమైన వరదలు సంభవించినప్పుడు, తుఫానులు వంటి అనేక విపత్తుల సమయంలో ఎన్‌డిఆర్ఎఫ్ టీం అద్భుతమైన పని తీరుతో ప్రజలను రక్షించడం జరుగుతుందని, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తమను తాము ఏవిధంగా రక్షించుకొని ప్రమాదాల నుండి బయటపడ వచ్చునో మాక్ డ్రిల్ ద్వారా వివరిస్తూ విమానాశ్రయ అధికారులకు, ఇతర అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగినది.

ఈ మాక్ డ్రిల్ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు, ఎన్ డి ఆర్ ఎఫ్,టి జి ఎస్ డి ఆర్ ఎఫ్,డిడిఆర్ ఎఫ్ టీం సభ్యులు, ఆపద మిత్రా టీమ్, జిల్లా అగ్నిమాపక శాఖ టీమ్, మెడికల్ టీమ్స్, పోలీస్ అధికారులు, విమానాశ్రయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయండి

### రైల్వే ఎజిఎం కోట్ల ఉదయ్‌కుమార్‌కు వినతి

**ప్రజాపక్షం/కొత్తూరు:** రైల్వే ప్రయాణీకులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైల్వే పట్టాలపై వంతెన నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని స్టేషన్ తిమ్మాపూర్ గ్రామస్తులు కోరారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని రైల్వే ఎజిఎం కోట్ల ఉదయ్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌లో రైల్వే వంతెన నిర్మించాలని, ప్రయాణీకులు ఫ్లాట్ ఫాంలను దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

ఇందుకు కోట్ల ఉదయ్‌కుమార్ స్పందిస్తూ తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌లో వంతెన నిర్మాణానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇదివరకే తమ దృష్టికి తీసుకువచ్చారని, వాటికి సంబంధించిన టెండర్లు సైతం పూర్తి చేశామని, వచ్చే నెల ఫిబ్రవరిలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాంతో తిమ్మాపూర్ గ్రామస్తులు పాశం కృష్ణ, సిహెచ్ సురేష్, అబ్దుల్ గని భాయ్, పాశం మల్లేష్, పాశం శ్రీశైలంలు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు, రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధి హామీ పథకం రద్దుకు కేంద్రం కుట్ర

### టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జాతీయ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజిఎన్ఆర్ఇజిఎ) రద్దు చేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్ర చేస్తోందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, టిజియుఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండల పరిధిలోని చరికొండ గ్రామం లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి మాట్లాడు తూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తూట్లు పొడు స్తూ మోడీ సర్కార్ నూతనంగా తీసుకువచ్చిన వీబీజీ రామ్ జీ చట్టా న్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలోని బిజెపి సర్కార్ దేశ స్వాతంత్రోద్యమ కాలపు జాతి నేతల పేర్లను నిస్సిగ్గుగా తొలగించేందుకు వెనకాడటం లేదంటూ మండిపడ్డారు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకురావటం దుర్మార్గం అన్నారు. ఇది భారతదేశ లౌకిక రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమని, ఈ చర్యను బిజెపి అప్రజాస్వామిక పాలనకు పరాకాష్టగా పేర్కొనవచ్చున్నారు. వర్షాభావంతో కరువుకూరల్లో చిక్కుకున్న రైతు కూలీలకు ఉపాధి కల్పించేందుకు చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందన్నారు. నూతన చట్టం రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం మోపనుందన్నారు. మన రాష్ట్రాల సుమారు 3000 కోట్ల భారాన్ని మోయాల్సి వస్తుందని తెలిపారు. శ్రామికులకు వేతనాల చెల్లింపు లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టే పనులపైనా రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద 40శాతం నిధులు ఖర్చు చేయాలని, అందు కు రాష్ట్రభుత్వంపై ఏటా వేల కోట్ల భారం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉపాధి హామీ చట్టంలో పలు సవరణలు చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో సోమవారం ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ఆమోదం పొందితే ఈ పథకం కింద అయ్యే ఖర్చులో కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్రభుత్వాలు తమ వాటా కింద 40 శాతం భరించాల్సి వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పిసిసి మెంబర్ శ్రీనివాస్ గౌడ్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, యాట నరసింహ, సర్పంచ్ మహేందర్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రోహిత్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.



## సరూర్‌నగర్ చెరువు పూర్తి స్థాయిలో అభివృద్ధి : హైడ్రా కమిషనర్ రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్/సరూర్‌నగర్:** సరూర్‌నగర్ చెరువును పూర్తి స్థాయిలో పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నట్లు హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ తెలిపారు. బుధవారం హైడ్రా కమిషనర్ సరూర్‌నగర్ చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ 140 ఎకరాలకు పైగా ఉన్న చెరువు పరిధిలో చాలావరకు నివాసాలు రావడంతో వాటి జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 90 ఎకరాలకు పైగా ఉన్న చెరువునే అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. నగరంలో పెద్ద చెరువులను కూడా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారని, అందులో సరూర్‌నగర్ చెరువు కూడా ఉందన్నారు. చెరువుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించి.. మార్చిలోగా పనులు చేపట్టి ఏడాదిలోపు పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

**పూర్తి స్థాయిలో అభివృద్ధి :** చెరువుల అభివృద్ధి అంటే పై మెరుగులు దిద్దడం కాదని హైడ్రా కమిషనర్ తెలిపారు. ఇప్పటికే హైడ్రా పునరుద్ధరించిన బతుకమ్మకుంట, బమృకున్ ఉద్ దౌలా, కూకట్‌పల్లి నల్లచెరువులను పరిశీలిస్తే అందరికీ అర్థమవుతుందన్నారు.ఆ దిశగానే సరూర్‌నగర్ చెరువును తీర్చిదిద్దుతామని చెప్పారు. చెరువులో 10 నుంచి 15 అడుగుల మేర పూడికను తొలగించి లోతు పెంచుతామని, తద్వారా నీటి నిలువ సామర్థ్యం పెంచడమే కాకుండా.. భూగర్భ జలాల పెరుగుదలకు మార్గం సుగమం అవుతుందన్నారు. చెరువు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సరిగా ఉండేలా చూస్తామని, మరీ ముఖ్యంగా వరదల నియంత్రణకు ఈ చెరువు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామన్నారు. మురుగు నీరు చెరువులో కలవకుండా వాటర్ బోర్డు సహకారంతో జాగ్రత్తలు తీసుకుంటూనే.. ఎస్‌టిపీల సామర్థ్యాన్నిపెంచుతామన్నారు. చెరువును పర్యావరణ హితంగా తీర్చిదిద్దుతామని ఇందులో భాగంగా పరిసరాల్లో పెద్దమొత్తంలో ఔషధగుణాలున్న మొక్కలు నాటానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ఎసిపి తిరుమల్ తదితర పాల్గొన్నారు.



## అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** ఆదిభట్ల జిహెచ్ఎంసి సర్కిల్ (15)కాంట్రాక్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని రాగన్నగూడ వార్డు కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా విష్ణువర్ధన్ రెడ్డి, వేముల వెంకటయ్య, పట్నం శ్రీశైలం, దుర్గయ్య అధ్యక్షులుగా సుంకరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా వై. ఓంకార స్వామి, ఉపాధ్యక్షులుగా ఓ వెంకటేష్, ఎం శ్రవణ్ నాయక్, ఓ గణేష్, ట్రెజరర్ గా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా వి. గిరి నాయక్, ఎం అభిలాష్ యాదవ్, ఆర్. విక్రమ్ నాయక్, వి.సాయిబాబా, ఆర్గనైజర్ సెక్రెటరీగా ఎం చంద్రారెడ్డి, రాజేందర్ నాయక్, ఓ. గణేష్, జి.గిరి, ఎగ్జిక్యూటివ్ నెంబర్ వి. బాబు,వేముల శ్రీను, రాజ వర్ధన్ రెడ్డి, వాసు తదితరులు ఎన్నికయ్యారు.

## వసంత పంచమి పేరుతో... వింత అడ్మిషన్లు

### ఎఐవైఎఫ్ కార్యదర్శి పి.శివకుమార్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వసంత పంచమి పేరుతో ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించిన కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణ చంద్ర రావు ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.



ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ అకడమిక్ సంవత్సరం ప్రారంభం కాకముందే వసంత పంచమి పేరుతో ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించిన కార్పొరేటర్ పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలని అన్నారు. డబ్బులే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్న కార్పొరేట్ పాఠశాలలు ఇలా వింత పేర్లతో భారీ డిస్కౌంటు అంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారనీ తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తూ, పాఠశాల జిఓలను తుంగలో తొక్కుతూ తమ ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సోషల్ మీడియా వేదికగా, భారీ ఫ్లెక్సీలతో నిత్యం ప్రచారం చేస్తూన్న విద్యాశాఖ అధికారులు తమకు పట్టనట్టు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారని పేర్కొన్నారు. వసంత పంచమి పేరుతో జరిగే అక్రమ అడ్మిషన్లను అడ్డుకోకపోతే అఖిల భారత యువజన సమైక్య పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యులు హరికృష్ణ నాయక్, గండికోట శివ, వివేక్ తదితరులు పాల్గొన్నారు

## బిజెఆర్ భవన్ నిర్మాణానికి రూ.3కోట్ల నిధులను విడుదల చేయాలి

### ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

**ప్రజాపక్షం, సరూర్‌నగర్:** ముఖ్యమంత్రిగా కెసిఆర్ హయంలో బాబు జగ్జీవన్ రాం భవన్‌కు రూ.3కోట్ల నిధులు మంజూరు అయ్యి ఉన్నాయని, అట్టి నిర్మాణ భవనం మరమ్మత్తులు, పై అంతస్తు నిర్మాణం కోసం వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం బిజేఆర్ భవన్‌లో రూ.7లక్షలతో సీటింగ్ రిపేర్ పనులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే సబితారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ భవనంలో చాలా మరమ్మత్తులు ఉన్నాయని, ఆ డబ్బును విడుదల చేస్తే మరమ్మత్తుల కోసం ఉపయోగపడుతుందని తెలిపారు. మొదటి అంతస్తులో కిచెన్ రూమ్ ను ఏర్పాటు చేస్తే పేదలందరూ ఈ భవనాన్ని ఉపయోగించుకోవడానికి వీలుంటుందన్నారు. మహేశ్వరం నియోజ్కవర్గ పరిధిలో కల్చరల్ ప్రోగ్రాం నిర్వహించుకునేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. భవనం ఇంచార్జ్ రాజు ప్రస్తుతం జరుగుతున్న పనులను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవిందశర్మ, డివిజన్ అధ్యక్షుడు పెంద్యాల నగేష్, సాజిద్, రాంనర్సింహగౌడ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## డివిజన్ల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే మర్రి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేయటమే తన లక్ష్యమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. వినాయకనగర్ డివిజన్‌లోని ఆకుల నారాయణ కాలనీ, వినాయకనగర్ సబ్‌లేన్‌ల వద్ద రూ. 75 లక్షల వ్యయంతో చేపట్టిని సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ కాస్యం రాజ్యలక్ష్మి తో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ వాసులతో పాటు బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## ఘనంగా మార్కండేయ జయంతి



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** జగద్గిరిగుట్ట డివిజన్ కొండపై గల శివ మార్కండేయ స్వామి దేవాలయంలో బుధవారం మార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కెపి వివేకానంద్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, దేవాలయ కమిటీ సభ్యులు బేతి గోపాల్, ఎర్ర శంకరయ్య, జనార్ధన్, దత్తాత్రేయ, ప్రభాకర్, ప్రవీణ్, రమేష్, రవి, రాములు, రాజా, మహేష్, దత్తు, ఎల్లయ్య, రాజకుమార్, మహిళా నాయకురాళ్లు ఇందిరాగౌడ్, సీనియర్ నాయకులు విఠల్, దాసు, మల్లేష్‌గౌడ్, జైహింద్, రాజు, పాపులగౌడ్, అంజయ్య, శ్రీను పాల్గొన్నారు.

## సురక్షితంగా ఇంటికి చేరండి..




**ప్రజాపక్షం/చర్లపల్లి :** ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రజలు సురక్షితంగా ఇంటికి చేరాలనే లక్ష్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అడిషనల్ డిసిపి వెంకటరమణ అన్నారు. బుధవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో విలేకులతో సమావేశం ఏర్పాటు చేసి మీడియా ద్వారా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి డిజిపి శివధర్‌రెడ్డి అదేశాల మేరకు అడిషనల్ డిసిపి,ఎసిపి వెంకట్‌రెడ్డితో కలసి సూచించారు. రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిఐ భాస్కర్‌రెడ్డి,ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే ముఖ్యం



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** గ్రామ అభివృద్ధి తన లక్ష్యమని ఎల్లకొండ సర్పంచ్ కొండల్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం నవాబుపేట మండలంలోని ఎల్లకొండ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామ అభివృద్ధి కోరుకునేవారు పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండల్ యాదవ్, ఉప సర్పంచ్ రాంచందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, వెటర్నిటీ వైద్యురాలు శ్రీప్రియ, ఏఈఓ రమాదేవి, జిపిఓ అంజయ్య, వైద్యాధికారులు, వార్డ్ సభ్యులు గాలయ్య, పద్మ, పాండు, సాధత్ బేగం,పద్మమ్మ, ఉమాదేవి, శ్రీనివాస్, లక్ష్మి, సరిత, వెంకటయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అలీ తలాబ్ చెరువును పరిశీలించిన కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అలీ తలాబ్ చెరువును బుధవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ వారి సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలీ తలాబ్ చెరువలో సెవరేజ్ నీరు కలుస్తున్న కారణంగా గుర్రపు డెక్క పెరిగి దోమల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని, సరస్సులోని గుర్రపు డెక్కను తొలగించి శుభ్రత చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి, అధికారులు నరసింహ, మహదేవ్, యుగంధర్‌రెడ్డి, రవికుమార్, శంకర్ గణేష్, ఒస్సీ పటేల్, సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షపు నీటి నిల్వ నివారణ కాలువ పనుల ప్రారంభం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నేరేడ్‌మెట్ డివిజన్‌లోని జెజె నగర్ మెయిన్ రోడ్ నుండి సైనిక్‌పురి మెయిన్ రోడ్ వరకు చేపట్టిన ఆర్‌సిసి వర్షపు నీటి నిల్వ నివారణ కాలువ పనులను స్థానిక కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ పనుల ఫలితంగా వర్షాకాలంలో ప్రతి సారి మెయిన్ రోడ్‌లో బ్లాక్ అవుతున్న నీటి సమస్య పరిష్కారం కానుందని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, ఆదిత్య, రమేష్‌గౌడ్, సత్యనారాయణ, శర్మ, శ్యామ్, దినేష్, నాగరాజు, ఆకారం సాయి. అగర్వాల్, నవీన్, కాంతారావు, ధనలక్ష్మి, ప్రమీల, ఇంద్రమ్మ, పద్మజ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# మున్సి‘పోల్’లో మెజార్టీ స్థానాలు గెలుద్దాం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాపై నమ్మకంతో మేడ్చల్ నియోజకవర్గ మున్సిపాలిటీలకు ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించారని ఆనమ్మకాన్ని వమ్ము చేయకుండా మునిసిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపల్‌లోని శుభం గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి మంత్రి హాజరై ప్రసంగించారు. మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాలో ఆరు మున్సిపాలిటీలతో పాటు చేవెళ్ల, యాదగిరిగుట్ట, ఆలేరులో విస్తృతంగా పర్యటించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. కార్యకర్తల జోష్ చూస్తుంటే ఈ ఎన్నికల్లో అన్ని సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. నేనుమంత్రిగా ఉన్నానని, కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు అధికారంలో ఉంటుందని మీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడే వారికి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. సర్వే చేయిస్తున్నామని ప్రజల్లో ఉండే నాయకులకు, గెలిచే అవకాశాలు ఉన్నవారికే పారదర్శకంగా పార్టీ టికెట్‌లు ఇస్తామని స్పష్టంచేశారు. మూడు మున్సిపాలిటిలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం నా కార్యాలయంలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తానని చెప్పారు. నల్లగొండ ప్రజలు ఎట్లనో మేడ్చల్ ప్రజలకు అంతే ప్రాముఖ్యత ఇస్తానని మంత్రి వివరించారు. మరోపదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కలేనని ఎద్దేవా చేశారు. పార్టీ గుర్తుతో జరిగే ఎన్నికల్లో బిఆర్ఎస్ 10 శాతమైన గెలువాలని కెటిఆర్‌కు సవాల్ విసిరారు. మాజీ సిఎం కూతురు కవిత అడిగిన ప్రశ్నలకు బిఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలన్నారు. ప్రతిపక్ష నేత అసెంబ్లీలో పాలకపక్షాన్ని ప్రశ్నిస్తాడని అనుకుటే కనీసం మూడు నిమిషాలు అసెంబ్లీలో లేడని విమర్శించారు. ప్రజల సొమ్ముతో జీతభత్యాలు తీసుకుంటు అసెంబ్లీకి రావడం లేదని ఆరోపించారు. ఆయన చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కోక్కటిగా నెరవేర్చుతున్నామన్నారు. పేద ప్రజలకు మేలు కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, మాజీ ఎంఎల్‌వి మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ డిసిసి హరివర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పి చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, నక్క ప్రభాకర్‌గౌడ్, మాజీ మేయర్లు అజయ్‌యాదవ్, శాంతి, పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్, వెంకటేష్, విఘ్నేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాయితీపై వ్యవసాయ పరికరాలు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న వ్యవసాయ పరికరాలను రైతులు పొందాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధ్వర్యంలో వ్యవసాయ యాంత్రికరణ పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకున్న రైతులకు కలెక్టర్ రోటావేటర్ ,కట్టీవేటర్ , తైవన్ ప్రేయర్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం వ్యవసాయ యంత్రికరణ పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించడం జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ జిల్లా అధికారి రాజరత్నం , జిల్లా ఉద్యనవన అధికారి సత్తార్ , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ , మహేందర్‌రెడ్డి , అంజయ్య, విజయ భాస్కర్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ బాధితులకు నష్టపరిహారం అందజేత

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణలో భాగంగా పునరావాసం, పునరావాస హక్కులకు అనుగుణంగా బుధవారం జిల్లా కలెక్టర్ మనుచౌదరి బాధితులకు నష్టపరిహారం అందజేశారు. హైదరాబాద్-మేడ్చల్ జిల్లాల మీదుగా పారడైజ్ జంక్షన్ నుండి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పనులు చేపట్టిందని, దీనిలోని భాగంగా మేడ్చల్ జిల్లాలో ఆల్వాల్ మండలంలో 1.5, శామీర్‌పేట మండలంలో 4 కిలో మీటర్ల వరకు ఈ పనులు జరుగనున్నాయన్నాని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రధాన ప్రాజెక్టుగా మేడ్చల్ జిల్లాలో ఎలివేటెడ్ కారిడార్ కోసం భూసేకరణ ప్రక్రియ చేపట్టిందని, దీనిలోని భాగంగా హకీంపేట, దేవరాయంజల్, లోతుకుంట, తూముకుంట, ఆల్వాల్, పొతైపల్లి గ్రామాలకు చెందిన ప్రభావితమైన భూయజమానులకు సర్వే నిర్వహించి నష్టపరిహారం ఇస్తున్నామన్నారు.




### కీసర బ్రహ్మోత్సవాలు సజావుగా నిర్వహించాలి

కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బ్రహ్మోత్సవాలపై జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగువార్, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కుషాయిగూడ ఎసిపి వెంకటరెడ్డి, ఆర్డీఓ రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేష్, ఆలయ ఇఒ సుధాకర్‌రెడ్డిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 13 నుండి 18 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండే విధంగా అవసరమైన మౌలిక వసతులు, దర్శనానికి సంబంధించి ఏర్పాట్లు సక్రమంగా జరుగాలన్నారు.

## వేగంగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

### అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఓటరు జాబితాకు అనుగుణంగా సవరించే మ్యాపింగ్ ప్రక్రియను ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని సంబంధిత తహసీల్దార్లను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కీసర తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా అనుసంధాన ప్రక్రియ పురోగతిపై తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏఈఆర్‌ఓలు పూర్తి బాధ్యత తీసుకొని బిఎల్‌ఓలకు రోజువారీ లక్ష్యాలనను ఇచ్చి వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో కీసర ఆర్డీవో రాజేష్, కీసర తహసీల్దార్ యాదగిరి, శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత, ఘట్‌కేసర్ తహసీల్దార్ చంద్రశేఖర్, మేడిపల్లి తహసీల్దార్ కృష్ణచైతన్య, మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, మూడుచింతలపల్లి డిప్యూటీ తహసీల్దార్ సునీల్, మున్సిపల్ కమిషనర్లు, సూపర్‌వైజర్లు, బిఎల్‌ఓలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

### జెఇఇ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

ఈ నెల 21 నుండి 29 వరకు నిర్వహిస్తున్న జెఇఇ (మెయిన్) 2026 పరీక్షలు సజావుగా నిర్వహించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. ఘట్‌కేసర్ మండలంలోని జెఇఇ మెయిన్ పరీక్షలు నిర్వహిస్తున్న సిద్ధార్థ కాలేజీ, నలల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుండి 29 వరకు నిర్వహిస్తున్న ఈ పరీక్షలను మేడ్చల్ జిల్లాలో ఏర్పాటు చేసిన 13 పరీక్షా కేంద్రాలలో జరుగుతున్నాయన్నారు. అభ్యర్థులు పరీక్షా హాలులోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు తీసుకొని రాకుండా చూడాలని, పరీక్షా కేంద్రాల సమీపంలో చుట్టు పక్కల ఉన్న జిరాక్స్‌సెంటర్లను పరీక్షా సమయాల్లో మూసి వేయించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల కోసం ఫస్ట్ ఎయిడ్ కిట్, ఓఆర్ఆర్ ప్యాకెట్లతో పాటు వైద్య బృందాలు ఉండేలా చూడాలని, సమీప ప్రాంతాల్లో సెక్షన్ 144 అమలు చేయాలన్నారు. ఘట్‌కేసర్ తహసీల్దార్ చంద్రశేఖర్, కళాశాలల నిర్వాకులు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రయాణం వాహనదారుడి ప్రధాన లక్ష్యం

### ఉప్పల్ జోన్ డిసిపి సురేష్ కుమార్



**ప్రజాపక్షం/ఉప్పల్ :** ప్రతి వాహనదారుడు సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే ఎ లైవ్ ఎ రైవ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఉప్పల్ జోన్ డిసిపి సురేష్ కుమార్ తెలిపారు. బుధవారం ఉప్పల్ జోన్ డిసిపి కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎలైవ్ ఏరైవ్ కార్యక్రమంపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పోలీసు, ట్రాన్స్‌పోర్ట్ తదితర శాఖలు కలిసి రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఎలైవ్ ఏరైవ్ కార్యక్రమాన్ని ఈ నెల 13 నుంచి 27 వరకు (సెలవు దినాలు మినహాయించి) పది రోజులపాటు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల వల్ల జరుగుతున్న మరణాలు, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ డిసిపి జోన్‌లో ఈ కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీడియా భాగస్వాములుగా ఉండి ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎసిపి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/బంట్వారం :** కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉందని మర్పల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి బుధవారం అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ అదేశాల మేరకు కల్యాణలక్ష్మి, షాదిముభారక్ చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోచారం వేంకటేశం అధ్వర్యంలో మండల కేంద్రంలో లబ్దిదారులకు అందజేశారు. మండల పరిధిలోని 48 లబ్దిదారులకు చెక్కులకు మరియు సిఎంఆర్ఎస్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు, అధికారులు తదితరులు ఉన్నారు.

## ఉపాధి చట్టం పునరుద్ధరించేవరకు పోరాటం


### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు :** కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకవచ్చిన ఎంజిఎన్ ఇజిఎస్ పథకాన్ని మార్చి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకవచ్చిన కొత్త చట్టాన్ని రద్దు చేసే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుదవారం పెద్దేముల్ మండల పరిధి కందనెల్లి గ్రామంలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ పథకానికి మద్దతుగా వీబి జీ రామ్‌జీ పథకానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ 2005లో యుపిఎ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పేదరికాన్ని నిర్మూలించడానికి పేదల సంక్షేమం కోరి రెండు పూటల అన్నం అందించాలనే ఉద్దేశంతో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకవచ్చిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేదలకు వ్యతిరేకంగా ఎంజిఎన్ ఇజిఎస్ పథకాన్ని నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ పేరుతో ఉన్న చట్టాన్ని మార్చి జీ రామ్‌జీ చట్టాన్ని తీసుకవచ్చిందన్నారు. గ్రామీణ పేదలకు వ్యతిరేకంగా ఉన్న జీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని గ్రామ సభల్లో సర్పంచ్‌లు తీర్మాణాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, సీనియర్ నాయకులు మాజీ చైచైర్మన్ నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ ఎస్.నారాయణ రెడ్డి, మహిళ నాయకురాలు శోభరాణి, మాజీ వైస్ ఎంపిపి మధులత, గ్రామ సర్పంచ్, మైనార్టీ నాయకులు రియాజ్, మల్లేశం, మండల పార్టీ అధ్యక్షులు గోపాల్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనుల పూర్తికి కృషి

### కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి పాదయాత్ర చేస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ, సిసి రోడ్లకు సంబంధించిన పెండింగ్ పనులు ఉన్నాయని, వాటిని ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లి అతిత్వరలో పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. పలు చోట్ల విద్యుత్ స్తంబాలు రోడ్డు మీద ఉండి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే విద్యుత్ స్తంబాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు ఎస్ఆర్‌పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, యూబిడి నాగరాణి, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు, వాటర్ వర్క్స్ సూపర్‌వైజర్ శివ, ఎస్ఎఫ్ఎ వెంకటరెడ్డి, మల్లేష్, సిబ్బంది, నాయకులు సమ్మారెడ్డి, గోపాల్, అశోక్, పాండు, శ్రీనివాస్, రాము, రమణ, సారాయి కృష్ణ, షౌకత్‌అలీ పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన ఎరువులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతులకు తక్కువ ధరలకు నాణ్యమైన ఎరువులను అందిస్తున్న ఇండియన్ బెస్ట్ ప్రోడక్ట్ సంస్థ ఎఫ్‌పిఒ అని ఆ సంస్థ మేనెజింగ్ డైరక్టర్ శ్రీధర్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లో పోతారం చౌరస్తా వద్ద శామీర్‌పేట రైతు ఉత్పత్తిదారుల సంఘం మూడుచింతలపల్లి శాఖను ఎఫ్‌పిఒ చైర్మన్ పెంటారెడ్డి అధ్యక్షతన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాలు లేకుండా రైతులకు అందుబాటులో ఎరువులను అందజేస్తున్నామని చెప్పారు. రైతుల పొలాల వద్దకు వెళ్లి రకమైన తెగుళ్లు సోకుతున్నాయనేది పరిశీలించి మందులను ఇస్తారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు కల్లివాటెక్‌ను పెంపొందించడం కోసం షాపును ఏర్పాటు చేశామన్నారు. రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని ఈ కార్డులు ఉన్న రైతులు కొనుగోలు చేసిన మందులకు తక్కువ ధరకు అందజేస్తామని ప్రకటించారు. భూసార, నీటి పరీక్షలు చేసి రైతులకు రిపోర్టులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో చైర్మన్ పెంటారెడ్డి, ఎడిఎ వెంకట్రామ్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు సంజీవరెడ్డి, మాజీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జాం రవి, శ్యామల, అంజనేయులు, హరిమోహన్‌రెడ్డి, ఎఒ రవికుమార్, రైతులు పాల్గొన్నారు.




## రోడ్డు భద్రత నిబంధనలు పాటించండి

### సిఐ గోవింద రెడ్డి




**ప్రజాపక్షం/బోడుప్పల్ :** రోడ్డు భద్రత నిబంధనలను పాటించి ప్రమాదాలను నిర్మూలించాలని మేడిపల్లి సిఐ గోవిందరెడ్డి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల చర్యలతోనే సాధ్యం కాదని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండి, వాటిని బాధ్యతాయుతంగా పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని సిఐ గోవిందరెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరుల కోసం ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందా రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు వాహనాలు నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వాడకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. పరిసరాలను గమనిస్తూ వాహనం నడిపే డిఫన్సివ్ డ్రైవింగ్ పద్ధతిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
గురువారం
22-01-2026
www.prajapaksham.in

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ 'పళ్లి చట్టంబి'. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్‌పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'పళ్లి చట్టంబి' సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ మోషన్ పోస్టర్ ద్వారా సినిమా రిలీజ్ డేట్‌ను కూడా వెల్లడించారు. ఏప్రిల్ 9న మూవీని హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లోఖి విడుదల చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు.

# రీల్

## 'జెట్లీ' చివరి షెడ్యూల్ షురూ



కమేడియన్స్ త్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్టైన్మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్నారు.ఈ సినిమా షూటింగ్ జెట్ స్పీడ్లో జరుగుతోంది. తాజాగా చివరి షెడ్యూల్ను ప్రారంభించారు ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. మ్యూజిక్ కాల భైరవ, సినిమాటోగ్రాఫర్ సురేష్ సారంగం, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్ నార్ని శ్రీనివాస్ తో కలిసి రితేష్ రానా మరోసారి యూనిక్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేశారు.

## యూనివర్సల్‌గా కనెక్ట్ అయ్యే డ్రామా



తరుణ్ భాస్కర్ లీడ్ రోల్ లో నటిస్తున్న హిలేరియస్ విలేజ్ కామెడీ ఎంటర్ టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతిః. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు ఎఆర్ సజీవ్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మాది వెస్ట్ గోదావరి, నిడదవోలు. డైరెక్టర్ సంకల్ప్, నందకిషోర్ దగ్గర పని చేశాను. అలాగే స్టాండ్ అఫ్ రాహుల్ సినిమాకి అసోసియేట్ గా వర్క్ చేశాను. చాలామంది దర్శకులతో రైటింగ్ టీం లో వర్క్ చేశాను.నాకు డైరెక్టర్ కావాలనే స్ఫూర్తినిచ్చింది వి వి వినాయక్ గారు. ఆయనది మా ఊరు పక్కనే. ఫస్ట్ టైం ఆయన్ని థియేటర్ విజిట్ లో చూసినప్పుడు అక్కడ ఆడియన్స్ ఆయనకు ఇచ్చిన రెస్పాన్స్ ని చూసి డైరెక్టర్ అవ్వాలనిపించింది. 35 చిన్న కథ సినిమాకి డైరెక్టర్ నందకిశోర్ తో కలిసి పని చేశాను. ఇదే ప్రొడక్షన్ హౌస్ లో నా సొంత కథ అడిగారు. అయితే ఒక రెండు నెలల తర్వాత ఈ ప్రాజెక్టు గురించి చెప్పారు. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా లాంటి ఒక పెద్ద టీం తో నా ఫస్ట్ సినిమా చేయడమైనది అదృష్టంగా భావిస్తున్నాను. ఆ కథలోని కోర్ పాయింట్ ని తీసుకున్నాను. ఇది యూనివర్సల్ గా అందరికీ కనెక్ట్ అయ్యే కథ. అక్కడికి ఇక్కడికి కల్చర్ విషయంలో చాలా డిఫరెన్స్ ఉంటుంది. బ్యాక్ డ్రాప్ ని గోదారి ప్రాంతానికి మార్చాము. దాదాపుగా అరవై శాతం కథని మార్చాము. చివరి 30 నిమిషాలు కొత్త కథలాగే అనిపిస్తుంది. ఫైట్ ఒకటే కామన్ గా ఉంటుంది కానీ మిగతాదంతా కొత్తగా ఉంటుంది. తరుణ్ ఈ సినిమాలో గోదారి యాస మాట్లాడడానికి చాలా ప్రిపేర్ అయ్యారు. చాలా హోంవర్క్ చేశారు. ఒరిజినల్ నుంచి ఒక్క ట్రాక్ కూడా వాడుకోలేదు. కంప్లీట్ గా కొత్త మ్యూజిక్ చేయడం జరిగింది. ఒరిజినల్ కంటే తెలుగులో ఎక్కువ సాంగ్స్ ఉన్నాయి. మొత్తం ఏడు పాటలు. అన్ని పాటలు కూడా అద్భుతంగా వచ్చాయి.ఇది ఇవివి సత్యనారాయణ సినిమాల్లో భార్యాభర్తల మధ్య ఉండే ఎంటర్టైన్మెంట్ ఎమోషన్ ఏ విధంగా రన్ అవుతుందో ఈ సినిమాలో కూడా అంత చక్కని వినోదం కుదిరింది.ఈ సినిమాలో దాదాపు అన్ని కొత్త సీన్లే ఉంటాయి. ఒరిజినల్ నుంచి జస్ట్ కోర్ ఐడియా ఒక్కటే తీసుకున్నాము మిగతా ట్రీట్మెంట్ అంతా చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో బ్రహ్మాజీ గారితో పాటు మిగతా క్యారెక్టర్ ఆర్టిస్టులు పాత్రలన్నీటిలో మంచి ఫ న్ వుంటుంది. 39 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాను. అనుకున్న బడ్జెట్లో సినిమాని తీయడం జరిగింది. సినిమా నిడివి రెండు గంటల 11 నిమిషాలుగా వచ్చి ంది. డ్రామా ఎమోషన్స్ విషయంలో ఒక దర్శకుడిగా మంచి పేరు వస్తుందని నమ్ముతున్నాను.

## ఉస్తాద్ భగత్ సింగ్ కోసం బోస్ పాట



పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా కోసం పవన్ కళ్యాణ్ పై ఒక గొప్ప పాటను తయారు చేశారు. ఈ పాటను ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ రాశారు. పవన్ కళ్యాణ్ పై చంద్రబోస్ రాసిన పాట ఔరా అనేలా ఉంటుందని దర్శకుడు హరీష్ శంకర్ అంటున్నారు. ఈ సినిమా కోసం ఇటీవల విడుదల చేసిన దేఖ్ లేంగే సాలా అనే పాటకు మంచి స్పందన లభించింది. త్వరలోనే చంద్రబోస్ రాసిన పాటను కూడా రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల , రాశి ఖన్నా హీరోయిన్ లుగా నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం, ఆనంద్ సాయి ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్న ఈ సినిమాను ఈ సినిమాను మిత్రు మూవీస్ సంస్థ నిర్మిస్తోంది.

## థియేటర్స్ పెరుగుతున్నాయ్



శర్వానంద్ హీరోగా నటించిన తాజా సినిమా 'నారీ నారీ నడుమ మురారి'. జనవరి 14న విడుదలైన ఈ చిత్రం హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా శర్వానంద్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు నారి నారి నడుమ మురారి సినిమా సక్సెస్ చేసినందుకు థాంక్యూ. చాలా హ్యాపీగా ఉంది. ప్రతి సినిమా హిట్ కొట్టాలనే కష్టపడి పని చేస్తాం. అనుకున్న రిజల్ట్ రావడం చాలా ఆనందాన్నిచ్చింది. అన్ని సినిమాలు కథ బాగుంటేనే చేస్తాం. అయితే అన్ని కుదిరినప్పుడే అది వర్క్ అవుట్ అవుతుంది. ప్రొడ్యూసర్ డైరెక్టర్ హీరో కలిస్తే బడ్జెట్లు పెరగవు. మంచి సినిమాలు బడ్జెట్లో తీయొచ్చు. ప్రతి సినిమా బాగా తీయాలని కూర్చుంటే అన్ని సినిమాలు బాగుంటాయి. ఆల్రెడీ నాలుగు సినిమాలు బుక్ అయ్యాయి. అయితే ఈ సంక్రాంతికి చాలా పెద్ద లాంగ్ వీకెండ్స్ కలిసి వచ్చాయి. 23 నుంచి 26 వరకు మళ్లీ పెద్ద వీకెండ్ వుంది. మేము కంటెంట్‌నే బలంగా నమ్మాము. సంక్రాంతి సీజనోలో ఆదరిస్తారని నమ్మకం ఉంది. ఆ నమ్మకం మాకు నిజమైంది. ఇప్పుడు నెంబర్ ఆఫ్ థియేటర్స్ పెరుగుతున్నాయి. సినిమాకి చాలా మంచి లాంగ్ రన్ ఉంటుంది. ఈ సినిమా తొలి రోజు నుంచి చాలా నమ్మకం ఉంది. సినిమా ఎప్పుడు వచ్చినా సరే బ్లాక్ బస్టర్ అని మొదటి నుంచి చెప్తున్నాను. నాకు జాను సినిమా సమయంలో ఒక యాక్సిడెంట్ జరిగింది. నిజంగా పెద్ద యాక్సిడెంట్ అది. తర్వాత నేను బరువు పెరిగాను. శ్రీకారం, ఆడవాళ్లకు జోహార్లు సినిమాల్లో నేను కాస్త లావుగా కనిపిస్తాను, ఆ లుక్ నాకే నచ్చదు. మనకు మనం నచ్చేలా ఉండాలని సంకల్పంతో మొదట వాకింగ్ చేయడం ప్రారంభించాను. తర్వాత రన్నింగ్, ఆ తర్వాత స్ట్రెంత్ ట్రైనింగ్ మీద ఫోకస్ చేశాను. బైకర్ లో రెండు రకాల క్యారెక్టర్లు ఉన్నాయి. అందులో ఒకటి ఫాదర్ రోల్. సూర్య సన్నాఫ్ కృష్ణన్ లో సూర్య ఎలా కనిపిస్తారో అలాంటి క్యారెక్టర్. దాని కోసం చాలా కష్టపడ్డాను. బాలకృష్ణ టైటిల్ తీసుకున్నాము. ఆయనతోనే లాంచ్ చేయించాము. అంత గొప్ప సినిమా పేరు పెట్టుకున్నప్పుడు ఆ పేరు నిలబెట్టకపోతే బాగుండదు. నేను ఒక జానర్ కి పరిమితం అవ్వాలని అనుకోలేదు. ప్రతి సినిమా కొత్తగా చేయాలి కొత్త కథలు చేయాలని తపన ఉంటుంది. అమ్మ చెప్పింది, అందరి బంధువయా, శతమానం భవతి.. ఇలాంటి చిత్రాలతో ఫ్యామిలీ ఆడియన్స్ నన్ను ఎంతగానో ఆదరించారు. వారికి దగ్గర కావడం బ్లెస్సింగ్ గా భావిస్తున్నాను. రామ్ అబ్బరాజు ఒక దేవుడిలా కనిపించాడు. నిజానికి ఇండస్ట్రీకి రామ్ అబ్బరాజు లాంటి డైరెక్టర్స్ కావాలి. తనకు చాలా క్లారిటీ ఉంటుంది.ఈ సందర్భంగా శ్రీవిష్ణు కి మనస్ఫూర్తిగా థాంక్స్ చెప్తున్నాను. ఇదంతా శ్రీ విష్ణు గొప్పతనం.ఇద్దరు కూడా బ్యూటిఫుల్ గా పెర్ఫార్మన్స్ చేశారు. సంయుక్త క్యారెక్టర్ ని నమ్మి చేసింది. అలాగే సాక్షి చాలా హార్డ్ వర్క్ చేసింది. డైలాగ్ లు తెలుగు లోనే నేర్చుకుని చెప్పేది. ఈ విజయం మా అందరికీ ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది.విశాల్ తో పడి పడి లేచే మనసు సినిమా చేశాను. దానికి అది అద్భుతమైన ఆల్బమ్ ఇచ్చాడు. మళ్లీ ఈ సినిమాకి మంచి మ్యూజిక్ కుదిరింది. శ్రీకారం శతమానం భవతి సినిమాల్లో పండగ పాటలు ఉంటాయి. ఈ సినిమాలో కూడా పాటలు పండగ సమయంలో అందరూ చాలా ఆహ్లాదంగా వింటున్నారు. బైకర్ ఇండియా గర్వపడే సిని మా అవుతుంది. తెలుగు సినిమా అని కాలర్ ఎగరేసుకొని చెప్పే సినిమా అవుతుంది. బైకర్ షూటింగ్ అయిపోయింది. సంపత్ నంది గారితో భోగి సినిమా షూటింగ్ జరుగుతోంది. భోగి కూడా చాలా మంచి కథ.

## 'స్లమ్ డాగ్' ఫస్ట్ లుక్ రిలీజ్

పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతి కాంబినేషన్ లో వస్తున్న పాన్‌ఇండియా మూవీ 'స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్' షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం ఇప్పుడు పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రాన్ని పూరి కనెకట్స్ బ్యానర్ పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, జెబి మోహన్ పిక్చర్స్ జెబి నారాయణరావు కొంన్డ్రోల్లాతో కలిసి నిర్మిస్తున్నారు. దునియా విజయ్ కుమార్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ను విడుదల చేశారు. ఆ పోస్టర్లో ఆయన రఫ్ లుక్లో కనిపించడం ఆకట్టుకుంది. స్లీవ్లెస్ గ్రీన్ వెస్ట్, బోల్ పెండెంట్, బ్రౌన్ హ్యాట్తో ఆయన స్టైలింగ్ అదిరిపోయింది. ఆయన ఎనర్జిటిక్ ఎక్స్ప్రెషన్, స్ట్రీట్‌స్మార్ట్, పవర్ఫుల్ వైబ్ను ఇచ్చాయి. ఈ పాత్ర ఆయన కెరీర్లో ఇప్పటివరకు చేయని పూర్తిగా కొత్తగా ఉండబోతోంది.ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ నటిస్తున్నారు.'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలలో అద్భుతమైన సంగీతాన్ని అందించిన జాతీయ అవార్డు గ్రహీత హర్షవర్ధన్ రామేశ్వర్, 'స్లమ్ డాగ్' 33 టెంపుల్ రోడ్ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఐదు భాషలలో రిలీజ్ కానుంది.



## 'ఆత్రేయపురం బ్రదర్స్' షూటింగ్ ప్రారంభం



ఎస్ టూ ఎస్ సినిమాస్, ది ఫెర్వేంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్లపై 'ఆత్రేయపురం బ్రదర్స్' అనే సినిమా రూపొందిస్తున్నారు. రాజేష్ జగన్నాధం దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను వి ఎస్ కె సంజీవ్, వంగపల్లి సందీప్, వంగపల్లి సంకీర్త్, ప్రవీణ్ గద్దె, రాజేష్ గద్దె,రాకేష్ గద్దె కలిసి నిర్మిస్తున్నారు. హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమా పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ వశిష్ట, డైరెక్టర్ అనుదీప్, డైరెక్టర్ ఆదిత్య హాసన్, డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి వశిష్ట క్లాప్ కొట్టగా.. విజయ్ కనకమేడల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రవీణ్ కాండ్రేగుల, ఆదిత్య హాసన్ స్క్రిప్ట్ అందించారు. మరో డైరెక్టర్ అనుదీప్ మొదటి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా కాన్సెప్ట్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ఏ స్వీట్ రైవల్రీ అనే ట్యాగ్ లైన్ తో ఇద్దరు వ్యక్తులు బల పరీక్ష చేసుకుంటున్నట్లుగా ఈ పోస్టర్ డిజైన్ చేశారు. ఈ మూవీకి డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ రమీజ్ నవనీత్, మ్యూజిక్ డైరెక్టర్ సంతు ఓంకార్, ఎడిటర్ అనిల్ పసల పని చేస్తున్నారు. సినిమాలో రాజీవ్ కనకాల, గవిరెడ్డి, సన్నీ పత్సా, రఘు బాబు, గీత్ సాయిని, నేహా పఠాన్, సిద్దార్థ్ గొల్లపూడి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి సంగీతం సంతు ఓంకార్, ఎడిటర్: అనిల్ పసల.

## భవన నిర్మాణాలు కాదు

(మొదటి పేజీ తరువాయి)

రూ.4 కోట్లు మొత్తంగా రూ 263.40 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడారు.రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం విద్య వైద్యం,సంక్షేమ రంగాల అభివృద్ధికి సంకల్పబద్ధంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పిల్లలు చదువులో ముందుకు రావాలి,వారికి నాణ్యమైన వసతులు అందాలనే భావనతో ఈ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో ఒకే ప్రాంగణంలో విద్య,ఆటలు,వసతి,ల్యాబ్స్,డైనింగ్ అన్నీ అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించామన్నారు.ప్రపంచంతో పేద విద్యార్థులు సైతం పోటీపడే స్థాయిలో అవకాశాలు వస్తాయన్నారు.తాత్కాలిక భవనాల్లో కాకుండా ధర్మపురి లో రూ 10 కోట్లతో డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలను నిర్మిస్తున్నామని,ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురిలో త్రాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా రూ.24.5 కోట్లతో ఎస్టీపి ప్లాంటు ఏర్పాటు చేస్తున్నామన్నారు.వెనకబడిన వర్గాలు చదువులో ఉద్యోగాల్లో, సమాజ నిర్మాణంలో ముందుకు తీసుకు రావడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముకగా పేర్కొన్నారు. రైతులు బలంగా ఉంటే రాష్ట్రం బలపడుతుందన్నారు. తమ ప్రభుత్వం యువతకు నైపుణ్యాల పెంపును కూడా అత్యంత ఆవశ్యకత గా చేస్తున్నదని పేర్కొన్నారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు.ప్రధానంగా విద్యారంగంలో పేద,వెనుకబడిన, అగ్రహార ప్రాంతాల విద్యార్థులకు తగిన వాతావరణం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల,వసతిగృహ నిర్మాణాలతో విద్యార్థులు నగరాలకు వలడా వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఇకముందు ఉండదన్నారు.విద్యార్థులు తగిన అవకాశాలు పొందేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని అడ్లూరి చెప్పారు.ఈ కార్యక్రమంలో మంత్రులతోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు డా.సంజయ కుమార్ (జగిత్యాల),మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్(రామగుండం),విజయ రమణారావు (పెద్దపెల్లి), ట్రైకార్ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, తిరుపతి, టిఎస్ఎన్‌పిసిడిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## కొత్త ఆక్సిజన్

(మొదటి పేజీ తరువాయి)



ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ కనబడటం లేదని విమర్శించే ఇతర పార్టీలకు ఈ సభ ఒక గట్టి సమాధానమని పల్లా అన్నారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన తమ పార్టీ ఇప్పటికీ సజీవంగా ఉందని, అధికారంలో లేకపోయినా లక్షలాది మందితో సభను విజయవంతం చేయడం తమ బలానికి నిదర్శనమని పేర్కొన్నారు. జాతీయ సమితి సమావేశాల్లో రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల గురించి చర్చించినట్లు ఆయన వెల్లడించారు. కేరళలో మూడవసారి అధికారంలోకి రావడానికి సిపిఐ, సిపిఎం కలిసి గట్టి ప్రయత్నం చేయాలని నిర్ణయించాయని,తమిళనాడు, పుదుచ్చేరిలో డిఎంకె తో తమ మిత్రత్వం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ లో బిజెపి ప్రయత్నాలను అడ్డుకోవడానికి అక్కడ బలమైన రాజకీయ సమీకరణలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మూడు నెలల పాటు ఏర్పాట్లలో కీలక పాత్ర పోషించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ శ్రేణులకు, అలాగే ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించిన పాత్రికేయ మిత్రులకు పల్లా వెంకట రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఐక్య పోరాటం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ సమితి సమావేశం నిర్ణయాలను రాజా వివరించారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఖమ్మం వేదికగా జరిగిన బహిరంగ సభ, జాతీయ సమితి సమావేశాలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని పేర్కొన్నారు. చండీగఢ్‌లో గత ఏడాది సెప్టెంబర్ మాసంలో నిర్వహించిన 25వ జాతీయ మహాసభ తర్వాత జరుగుతున్న మొదటి జాతీయ సమితి సమావేశం ఇదేనని ఆయన వెల్లడించారు.1925లో ప్రారంభమైన సిపిఐ, గత 100 ఏళ్లుగా ఎన్నో త్యాగాలు, పోరాటాలతో ప్రజలపక్షాన నిలిచిందని రాజా గుర్తు చేశారు. ఖమ్మంలో నిర్వహించిన భారీ ప్రదర్శన, బహిరంగ సభ కమ్యూనిస్ట్ పార్టీ బలాన్ని చాటిచెప్పాయని, ఇంతటి భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ పార్టీ సమితిలకు ఆయన అభినందనలు తెలిపారు.

### పాలస్తీనా, వెనిజులా దేశాలకు సంఘీభావం

పాలస్తీనా ,వెనిజులా వంటి దేశాల్లోని ప్రజల పోరాటాలకు సిపిఐ ఎల్లప్పుడూ సంఘీభావం ప్రకటిస్తుందని , ఈ మేరకు జాతీయ సమితి సమావేశంలో తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యంగా రాబోయే రోజుల్లో తమ పార్టీ మరింత ఉధృతంగా పని చేస్తుందని స్పష్టం చేశారు. దేశంలో బిజెపిఆర్‌ఎస్‌ఎస్ ద్వయం అనుసరిస్తున్న విధానాలు భారత రాజ్యాంగ పునాదులకే ముప్పుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం భారతదేశం ఒక 'సంక్షేమ రాజ్యం' అని, కానీ ప్రస్తుత మోదీ ప్రభుత్వం దానిని 'కార్పొరేట్ సేవ చేసే రాజ్యంగా' మార్చిందని రాజా ఆరోపించారు.మోదీ దృష్టిలో సంపద సృష్టించేవారు అంటే కేవలం అదానీ, అంబానీలేనని, దేశానికి వెన్నెముకైన రైతులు, కూలీల కాదని విమర్శించారు.విశాఖ ఉక్కు పరిశ్రమ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ కంపెనీకి అకస్మాత్తుగా ధారాదత్తం చేస్తారని అన్నారు.జాతీయ విద్యా విధానం 2020 ద్వారా విద్యను కేంద్రీకృతం చేసి, కాషాయీకరణ, వ్యాపారీకరణ చేస్తున్నారని ధ్వజమెత్తారు.



సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు విజయవంతం చేసినందుకు ఖమ్మం, కొత్తగూడెం సిపిఐ నేతలను అభినందించిన రాజా

### గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వాల పనితీరులో గవర్నర్లు జోక్యం చేసుకోవడంపై రాజా తీవ్రస్థాయిలో స్పందించారు. తమిళనాడు, కేరళ వంటి బిజెపియేతర రాష్ట్రాల్లో గవర్నర్లు రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలచే ఎన్నికైన ముఖ్యమంత్రులకే పాలించే హక్కు ఉంటుందని, అసలు గవర్నర్ల వ్యవస్థే అవసరం లేదని, ఆ పదవిని రద్దు చేయాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందని తెలిపారు.

### సనాతన ధర్మం వివక్ష, అసమానతలను పెంచుతోంది

ఆర్‌ఎస్‌ఎస్ ప్రతిపాదిస్తున్న సనాతన ధర్మం సామాజిక, ఆర్థిక, లింగ అసమానతలను, కుల వ్యవస్థలను శాశ్వతం చేస్తాయని డి. రాజా విమర్శించారు. కొంతమంది తెలియ క సనాతన ధర్మం మంచిదని భావిస్తారని ,అది వాస్తవం కాదన్నారు. భారత రాజ్యాంగం దేశాన్ని ఒక లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రరాజ్యంగా అభివర్ణిస్తే, బిజెపి మాత్రం దానిని ఒక 'మత రాజ్యంగా' మార్చాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. భారత దేశం విభిన్న సంస్కృతులు, భాషలు కలిగిన సమాఖ్య దేశమని, ఇక్కడ 'ఒకే దేశం ఒకే ఎన్నిక' అనే విధానం చెల్లదని రాజా స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆయన ఆరోపించారు.

## ప్రజా ఉద్యమాలకు పునరంకితం

సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా

బెలూన్లు ఎగురవేసిన సిపిఐ నేతలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా ఉద్యమాలకు పునరంకితమవుతున్నామని భవిష్యత్తులో విస్తృత ప్రాతిపదికన ప్రజా ఉద్యమాలను నిర్వహించనున్నామని సిపిఐ జాతీయ ప్రధా న కార్యదర్శి డి. రాజా తెలిపారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగిన జాతీయ స్థాయి సమావేశాలు ముగిసిన సందర్భంగా బుధవారం సాయంత్రం సిపిఐ నాయకులు బెలూన్లు ఎగురవేశారు. సమావేశ స్థలం వద్ద ఎర్రటి బెలూన్లకు సిపిఐ జెండాలు కట్టి గాలిలోకి ఎగురవేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా కార్యాచరణ చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ నాయకులు పల్లా వెంకటరెడ్డి, కె. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎస్‌కె సాబీర్ పాషా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురే ష్, పలువురు రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణం చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ఏనాడూ ఎవ్వరూ నిర్మించని స్వర్ణకాంతులీనే మహోన్నతమైన 'హేమ శిఖరాలు' నిర్మిస్తాం అన్నారు. దావోస్ వేదికపై ఆయన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. "నాటో మిత్రులకోసం అమెరికా కట్టుబడి ఉంది, కానీ వారు అమెరికా కోసం ఉన్నారో లేదో? నేను ఖచ్చితంగా చెప్పలేను" అన్నారు. భారీ చర్చల తర్వాత ఆయన తన ప్రసంగం ముగించారు.అమెరికా తప్ప ఇంకెవ్వరూ గ్రీన్‌లాండ్‌ను రక్షించలేరని పదే పదే చెప్పారు. గడచిన 200 సంవత్సరాలుగా అమెరికాను పాలించిన అధ్యక్షులందరూ గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని, ఇప్పటికీ తాము అదే ప్రయత్నంలో ఉన్నామని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన గ్రీన్‌లాండ్ ద్వీపంలో డెన్మార్క్ ఉన్న ఆనవాళ్ళు ఎక్కడా లేవని, పైగా గ్రీన్‌లాండ్ బాధ్యతలు నిర్వహిస్తున్న డెన్మార్క్ పాలకులు దాని అభివృద్ధికోసం వాగ్దానం చేసిన దాని కంటే చాలా తక్కువ మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారని విమర్శించారు.ఇంత పెద్ద దీవిని, భారీస్థాయిలో విస్తరించి ఉన్న ఈ మంచు ముక్కను అభివృద్ధిచేసి, ఆ ప్రాంతాన్ని మెరుగుపరచి,నిర్వహించే సమర్థత ఉన్న ఏకైక దేశం అమెరికా మాత్రమేనని, అందుకే గ్రీన్‌లాండ్‌ను తమ అధీనంలోకి తెచ్చుకోవడానికి తక్షణ చర్చలు కోరుతున్నానన్నారు. "గ్రీన్‌లాండ్ మాకొక ప్రత్యామ్నాయం, మీరు అవును అని చెబితే మేం కృతజ్ఞతలు తెలియజేస్తాం, హర్షం ప్రకటిస్తాం, కాదు అని అంటే మిమ్మల్ని గుర్తుంచుకుంటాం, బలమైన సురక్షితమైన అమెరికా అంటే అర్థం 'బలమైన నాటో కూటమి" అని నర్మగర్భంగా హెచ్చరించారు. ఐతే పశ్చిమ దేశాలు ముందుగా ఊహించిన విధంగా దావోస్ వేదికపై ఆ దేశాల పట్ల అంత కఠినంగా మాట్లాడలేదు. మొదట ఆయన చాలా స్నేహపూర్వకంగా పశ్చిమ దేశాల మిత్రుల గురించి మాట్లాడారు.

**మా టారిఫ్‌లు న్యాయబద్ధమైనవి:** ఇక టారిఫ్‌ల గురించి కూడా ఆయన మాట్లాడారు. తాము వివిధ దేశాలపై తరతమ స్థాయిలో విధించిన టారిఫ్‌లు చాలా న్యాయబద్ధమైనవని అన్నారు. ఆ విషయం మీకు కూడా తెలుసునని ప్రపంచ నాయకులను ఉద్దేశించి అన్నారు. వివిధ దేశాలపై నేను టారిఫ్‌లు విధించానని, ఇక్కడున్నవారిలో టారిఫ్ బాధితులు కూడా ఉన్నారని, కానీ తర్వాత సంప్రదింపుల ద్వారా తగ్గించుకున్నామని చెప్పారు. ఉదాహరణకు స్విట్జర్లాండ్‌పై 30 శాతం టారిఫ్ విధించామని, ఆ తర్వాత సంప్రదింపుల్లో తగ్గించుకున్నామన్నారు. తన హయాంలో అమెరికా కోశాగారం ఎంతో బలపడిందన్నారు. ఇప్పుడు వెనిజులా కూడా బ్రహ్మాండంగా అభివృద్ధి చెందగలదని, ఆ దేశ ప్రజల జీవితాలు బాగుపడతాయని అన్నారు. రష్యాకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో బైడెన్ 350 బిలియన్ డాలర్లు ఇచ్చారని ట్రంప్ అన్నారు. ఇంతకుముందు కూడా ట్రంప్ అదే విషయం చెప్పారు. కానీ జర్మన్ పరిశోధనాసంస్థ సమాచారం ప్రకారం అమెరికా ఇప్పటివరకూ ఉక్రేన్‌కు 119 బిలియన్ డాలర్లు మాత్రమే యుద్ధ అవసరాలకు స మకూర్చిందని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. విమాన ప్రయాణంలో సాం కేతిక లోపం కారణంగా ఆలస్యంగా దావోస్‌కు చేరుకున్న ట్రంప్ భారత కాలమానం ప్రకారం రాత్రి ఏడు గంటలకు తన ప్రసంగం ప్రారంభించారు. గంటసేపు అనర్గళంగా ఆ ప్రసంగం కొనసాగింది. మిత్రులు,శత్రువులందరికీ శుభాకాంక్షలు అని తొలుత చెప్పారు. అంతకుముందు ఆయనకు రెడ్ కార్పెట్‌లో దావోస్‌లో ఘన స్వాగతం లభించింది. ఒకవైపు ట్రంప్ దావోస్ చేరుకున్న సమయంలో లండన్‌లో బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ ఎంపీలతో మాట్లాడుతూ, గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఒత్తిడికి తాను లొంగిపోనన్నారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడాన్ని అదేపనిగా వ్యతిరేకించే దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు విధిస్తానని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. దీంతో యూరప్–అమెరికా మధ్య గడచిన రెండు రోజులుగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకుంది.

## అంగీకరించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అని పిలువబడే దానిలో స్థానం కల్పించడానికి అమెరికా చేసిన ప్రతిపాదించినను అంగీకరించకూడదు అని ఐదు వామపక్ష పార్టీలైన మేం భారత ప్రభుత్వాన్ని గట్టిగా అభ్యర్థిస్తున్నాం' అని ఆ పార్టీల ప్రకటన పేర్కొంది. పాలస్తీనా హక్కులను గౌరవించని అటువంటి బోర్డులో భారతదేశం పాల్గొనడం పాలస్తీనా లక్ష్యానికి తీవ్ర ద్రోహం చేయడమే అవుతుందని వామపక్షపార్టీలు అమెరికా వైఖరిని స్పష్టం చేశాయి. ప్రస్తుత అంతర్జాతీయ సంస్థలను అధిగమించడానికి అమెరికా చేసే ప్రయత్నాన్ని గట్టిగా వ్యతిరేకించాలి. భారత ప్రభుత్వం అటువంటి ప్రతిపాదనలకు దరంగా ఉండాలని, అమెరికా సామ్రాజ్యవాద ఆశయాల వల్ల ముప్పు పొంచి ఉన్న పాలస్తీనా, గ్లోబల్ సౌత్‌లోని ఇతర దేశాల రక్షణలో దృఢంగా నిలబడాలని వామపక్ష పార్టీలు కోరాయి. ఐదు వామపక్ష పార్టీలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధానకార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్) ప్రధానకార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధానకార్యదర్శి జి.దేవరాజన్, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ప్రధానకార్యదర్శి మనోజ్ భట్టాచార్య ఉన్నారు. శాంతి మండలిలో భాగస్వామ్యం కావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుండి భారత ప్రభుత్వానికి ఆహ్వానం అందింది. ఇదిలా ఉంటే సోషల్ మీడియా పోస్ట్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇలా రాశారు. శాంతిమండలి ఏర్పడిందని ప్రకటించడం నాకు చాలా గౌరవంగా ఉంది. బోర్డు యొక్క సభ్యులను త్వరలోనే ప్రకటిస్తారు.కానీ ఇది ఎప్పుడైనా సమావేశమైన అత్యంత గొప్ప, ప్రతిష్ఠాత్మకమైన బోర్డు అని నేను ఖచ్చితంగా చెప్పగలను. ఈ విషయమై మీ శ్రద్ధకు నేను ధన్యవాదాలు తెలుపుతున్నాను. భారతదేశానికి అమెరికా రాయబారి సెర్గియా గోర్ 'ఎక్స్' పోస్ట్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాసిన లేఖను పోస్ట్ చేశారు. గాజాలో శాశ్వత శాంతిని నెలకొల్పడానికి 'ప్రపంచ సంఘర్షణ'ను పరిష్కరించడానికి ధైర్యమైన కొత్త విధానాన్ని ప్రారంభించేందుకు కృషి చేసే శాంతి మండలిలో భాగం కావాలని ట్రంప్ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com